
వల కెరటాలు
ఆర్. సంధ్యాదేవి

LAVAN... PARK ROAD; ...ALL.
PROP:
M. Venkateswarlu;
NANDYAL.

# ఎర్రకలువలు

ఉదయం పది గంటలు కావస్తుంది.

గేట్లోంచి దూసుకు వచ్చిన లైట్ గ్రీన్ప్లిమత్ ఫోర్టికోలో ఆగింది. బంగళా ముందు కారు ఆగటంతో మృత్యుంజయరావుగారి ముఖం గంభీరంగా మారిపోయింది.

డ్రైవర్ కారు దిగివచ్చి వినయంగా కారుడోరు తెరిచి పట్టుకున్నాడు.

ఆయన తలతిప్పి తన పక్కన కూర్చున్న అమ్మాయి వేపు చూశాడు.

ఆమె భయంభయంగా ఆయనవైపు చూసింది.

ఆయన ఆమెకు కళ్ళతోనే ధైర్యం చెప్పారు.

ఇది మా ఇల్లే నీకు ఏం భయంలేదు నిశ్శంకోచంగా హాయిగా వుండొచ్చు అన్నట్టు ధైర్యం చెప్పాయి ఆ చూపులు.

మృత్యుంజయరావుగారు కారు దిగి తనచెయ్యి ఆమెకు అందిచ్చారు.

ఆయన తనయందు చూపే ఆప్యాయత వాత్సల్యాని! ఆమె కళ్ళనీరు గిర్రున తిరిగి తళుక్కున మెరిశాయి ఆ కోల కళ్ళు.

ఆయన చేతిని ఆసరా చేసుకుని మెల్లగా కారుదిగింది.

తల ఎత్తి ఆ బంగళావేపు ఒకసారి పరిశీలనగా చూసింది.

ఆధునికంగా అందంగావుంది ఆ బంగళా.

బంగళాచుట్టూ రకరకాల రంగురంగుల పువ్వుల మొక్కలతో చాలా అందంగా వుంది.

ఆయనవెంట మెల్లగా లోపలకు వెళ్ళింది.

నౌకర్ను పిలిచి చెప్పారు.

"ఈ అమ్మాయిగార్కి మన గెస్టురూము చూపించు. ఈరోజునుండి యిక్కడే ఉంటారు. మీరు అందరూ అమ్మాయిగారు ఎలా చెపితే అలా వినండి. తెలిసిందా!" అని అడిగారు.

అతను చేతులు కట్టుకుని తెలిసింది అన్నట్లు తల వూపాడు.

"వెళ్ళమ్మా!" అని చెప్పారు.



ఆమె నౌకరువెంట వెళ్ళింది.

ఆమె వెళ్ళినవైపు చూస్తూ బరువుగా నిట్టూర్చారు.

ఈ అమ్మాయిని ధైర్యంచేసి తన ఇంటికి తీసుకు
వటం మంచిదే అయింది.

ఆ కళదిక్కు లేని ఈ ఇల్లు వెలవెలబోతూ వుంది.

ఎంత అష్టయిశ్వర్యాలు ఉంటేమాత్రం ఇంటికి కళ
స్తుందా!

ఆడపిల్ల ఇంట్లో లక్ష్మిలా తిరిగితేనే అందం.

తనకి కూతుళ్లు లేరు. ఈ అమ్మాయిరాకతో ఆ లోటు
క ఉండదనే అనిపిస్తుంది.

మృత్యుంజయరావుగారు బిజినెస్‌లో లక్షలకు లక్షలు
డించేరు. డబ్బు గడించే వాళ్ళకి ఈ డబ్బు ఇక చాలు
నిపించదు.

ఇంకా ఇంకా గడించేయాలన్న తాపత్రయం రోజు
జుకి పెరిగిపోతూనే ఉంటుంది.

అలాగే ఆయనలోకూడా ఆ తాపత్రయం పెరుగు
గానే ఉంది. మృత్యుంజయరావుగార్కి చాలా కంపెనీల్లో
ర్లుకూడా వున్నాయి.

కంపెనీ పనులమీద ఆయన విదేశాలుకూడా వెళ్ళ
లసి వస్తుంది. ఈమధ్య ఆయన ఆరోగ్యం సరిగా లేనందు

వలన ఎక్కడికయినా వెళ్ళవలసివస్తే తన తరపున కొడుకుని పంపిస్తున్నారు.

మృత్యుంజయరావుగారి భార్య, కొడుక్కి పదిహేనవ సంవత్సరం వచ్చాక చనిపోయింది.

అప్పటినుండి ఆయనకి మనసు ఏమీ బాగుండక ఆ బాధలు మర్చిపోవటంకోసం డ్రింక్స్ అలవాటు చేసుకున్నారు.

ఆ విషయం కొడుక్కి తెలియదు. యింటిదగ్గర ఎప్పుడూ ఆయన డ్రింక్స్ తీసుకోరు.

పార్టనర్సుతో ఏదయినా హోటల్లో తీసుకుంటుంటారు.

మృత్యుంజయరావుగారికి ఒకే ఒక అబ్బాయి ఉదయ్ కృష్ణ. అతనికి డబల్ డిగ్రీవుంది ఎమ్. ఏ. ఎమ్. ఏ. పాసయ్యాడు.

తండ్రి కోరికమీద బిజినెస్ చూసుకుంటున్నాడు

కంపెనీ పనిమీద స్విడ్జర్లాండ్ వెళ్ళాడు.

వెళ్ళి పదిరోజులయింది. మరో ఇరవై రోజులకుగాని అతను ఇండియాకు రాడు.

* * * *

మృత్యుంజయరావుగారు ఇంటికివచ్చాక చేసిన మొట్ట మొదటిపని బట్టలషాపులకి ఫోన్ చేసి పట్టుచీరలు డజను జ చీరలు డజను, పాలియెస్టర్, అమెరికన్ జార్జెట్, ఆర్గం



వాయిల్, పోచంపల్లి చీరలు అన్నీ ఒకొక్క అరడజను చీరలు పంపించమని చెప్పారు.

విశాఖపట్నంలోవున్న పెద్దపెద్ద షాపుల యజమానులు గంట తరవాత సేల్సుమేన్లు చేత పంపించేశారు.

ఆయన చెప్పిన చీరలు వాటికి మ్యాచింగు జాకెట్లు తెచ్చి ఇచ్చేశారు. వాటి ఖరీదు ఎంతయిందీ అడిగి చెక్ వ్రాసి ఇచ్చేశారు.

వాళ్ళు వెళ్ళిపోయారు.

నౌకర్లని పిలిచి ఆ బట్టల ప్యాకెట్లు అన్నీ అమ్మాయిగారి గదిలో పెట్టి రమ్మన్నారు.

తన గదిలోకి నౌకర్లు అందరూ వరసగా ప్యాకెట్లు మోసుకు రావటం చూసి ఊర్మిళ ఆశ్చర్యపోయింది.

ఏమిటి అని వాళ్ళని అడిగితే మాత్రం నౌకర్లకు ఏం తెలుస్తుంది? యజమానులు ఏ పని చెపితే ఆ పని చేస్తుంటారు.

ఊర్మిళ మెల్లగా హాలులోకి వెళ్ళింది.

ఆయన సోఫాలో కూర్చుని ఫోన్లో ఎవరితోనో ఏదో మాట్లాడుతున్నారు.

ఊర్మిళ చీర చెంగు బుజాలచుట్టు తీసుకుని ఆ పైట చెంగుకొస ఎడంచేతి చూపుడు వేలుకి చుట్టుకుంటూ తలవంచి ఒక వారగా నిలబడింది.

మృత్యుంజయరావుగారు ఫోన్ పెట్టేసి తలతిప్పి అటు ఆమెవైపు చూశారు.

హాలులో స్థంభందగ్గర సంకోచంగా భయంగా నిల బడటంచూసి ఆయనకు జాలేసింది.

"ఏమ్మా! ఏం కావాలి!" ఆయన మెల్లగా అడిగారు.

"ఆ ప్యాకెట్లు నా గదిలో పెట్టారు" అంటూ ఆగి పోయింది.

"అవన్నీ నీకోసమే తెప్పించానమ్మా" అన్నారు.

"కానీ అన్ని బట్టలు ఎందుకు, ఏవో రెండు చీరలు తెప్పిస్తే చాలుకదా" అంది మొహమాటంగా.

ఆ మాటలతో ఆయన ముఖం గంభీరంగా మారి పోయింది.

"చూడమ్మా ఊర్మిళా! నిన్ను ఈ ఇంటికి తీసుకు వచ్చాను అంటే నిన్ను ఎవరోగా దూరంగా వుంచడానికి కాదు నిన్ను నా మేనకోడలిగా ఈ ఇంటికి తీసుకువచ్చాను. ఈ ఇంట్లో నీకు సర్వాధికారాలు వున్నాయి. ఈ ఇంటికి తగినట్టుగా నువ్వు ఖరీదయిన బట్టల్తో వస్తువులతో కళకళ లాడుతూ వుండాలి తెలిసిందా!"

ఆమె తలవంచుకుని అలాగే నిలబడింది.

కళ్ళనీళ్ళు గిర్రున తిరుగుతున్నాయి.

ఈ రోజుకి తన కష్టాలు గట్టెక్కాయి.



ఒక చల్లని నీడ తనకి లభించింది. బాధలు కష్టాలు అన్నీ ఇక మరిచి హాయిగా సంతోషంగా వుండొచ్చు.

మృత్యుంజయరావుగారిది నిజంగా ఎంతమంచి మనసు.

"చూడమ్మా నీ బాధ్యత అంతా నాది. నీకు మంచి సంబంధం చూసి పెళ్ళిచేసి అత్తవారింటికి పంపిస్తాను. నేను బ్రతికివుండగా నీకు ఏలోటు రానివ్వను" ఆయన కంఠస్వరం దృఢంగా పలికింది.

ఊర్మిళ మెల్లగా అక్కడనుండి వెళ్ళిపోయింది.

సాయంత్రం మృత్యుంజయరావుగారు జ్యూయలర్ షాపుకి వెళ్ళి వస్తువులు పట్టుకువచ్చారు ఊర్మిళకోసం.

ఆమెకు ఇది అంతా ఏదో కలలోలాగ వుంది.

## 2

ఊర్మిళ ఆ ఇంటికివచ్చి పదిరోజులు కావస్తుంది.

మునుపటి ఆమె రూపానికి ఇప్పటి ఆమె రూపానికి బాగా మార్పు వచ్చేసింది.

ఏ అందమైనా కట్టుకున్న బట్టలతో పెట్టుకున్న వస్తువులతో వస్తుంది. అందులో ఆమె చాలా అందంగా వుంటుంది ఏమో ఇంకా అందం వచ్చేసింది.

ఇప్పుడు ఇంటిపెత్తనం అంతా ఆమెదే.

నౌకర్లు అందరూ ఆమె ఎలా చెపితే అలా వింటారు.

ఆరోజు మృత్యుంజయరావుగారు పనిమీద ఉదయమే ఎక్కడికో వెళ్ళారు.

వంట పెత్తనంనుండి డబ్బు పెత్తనంకూడా ఆమెదే.

ఆరోజు ఆమెకు కాస్త తీరిక అవటంతో నౌకర్లందర్నీ పిలిచి ఇల్లు అంతా నీటుగా సర్దించింది.

ఎక్కడి సామాన్లు అక్కడే అన్నీ వరసగా పెట్టింది.

మునుపటికీ ఇప్పటికీ ఇల్లు మారిపోయినట్టు కనిపిస్తుంది.

మేడమీద గదులుకూడా వరసగా సర్దించేసింది.

ఒకే ఒక గదిమాత్రం తలుపులు మూసి తాళం వేసి వుంది.

"ఈ గది ఏమిటి! తాళాలు ఎక్కడ ఉన్నాయి!" అంటూ నౌకర్లవైపు చూసింది.

"ఆ గది చినబాబుగారిది అండి" అని వినయంగా చెప్పారు వాళ్ళు.

అయితే ఏం అన్నట్టు నుదురుచిట్లించి వారివైపు చూసింది.

"ఆ బాబుగారు ఇంటివద్ద లేనప్పుడు ఆ గదికి ఎప్పుడూ తాళాలు వేసి వుంటాయి. ఆ గదిలోకి ఎవర్నీ వెళ్ళనివ్వరు. వెళ్తే ఆ బాబుగారు ఒప్పుకోరు."



ఊర్మిళ ఏదో ఆలోచిస్తూ తలపంకించి "ఆ తాళాలు ఎక్కడ వున్నాయి!" అడిగింది.

"మా దగ్గరే వున్నాయి."

"అయితే తీసుకురండి" ఆజ్ఞాపిస్తున్నట్టుగా పలికింది ఆమె కంఠస్వరం.

అమ్మో అన్నట్టు భయంగా చూశారు.

ఏం ఫర్వాలేదు ఆయన ఏమైనా అంటే వారికి నేను సమాధానం చెపుతాను అన్నట్టు చూసింది వారివైపు.

ఒక నౌకరు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్ళి తాళాలు పట్టుకు వచ్చాడు.

ఆ తాళాలు అందుకుని తలుపులు తెరుచుకుని గదిలో అడుగుపెట్టింది.

నౌకర్లు ఆమె వెంట ఆ గదిలోకి వెళ్ళలేదు.

మెల్లగా అక్కడినుండి వెళ్ళిపోయారు.

ఊర్మిళ గదిలో అడుగు పెడుతూనే అలా వుండిపోయింది.

ఆ బంగళా అంతా ఒక అందంతో వెలిగిపోతుంటే ఆ గది ఒక్కటి అంతకు మించిన అందంతో వెలిగిపోతుంది.

ఎక్కడి సామాన్లు అక్కడ నీటుగా సర్ది వున్నాయి.

ఆ గదిలో అంతా ఖరీదయిన ఫర్నీచరే. మంచం మీద ఖరీదయిన దుప్పటి పరిచివుంది.

మంచానికి తలవైపున గోడకి అమర్చిన అరలో రికార్డు ప్లేయర్ పెట్టి వుంది. మరోపక్క టేపురికార్డ్ వుంది.

ఒక మూలగా డ్రెస్సింగ్ టేబుల్, మరోవైపు నిలువుటద్దంతో బీరువా, ఒకవైపు పెద్దసోఫా, క్రింద ఖరీదయిన కార్పెట్ గోడలకి ఖరీదయిన పెయింటింగ్స్ ఎంతో అందంగా వుంది.

ఆ గదిలో ప్రత్యేకంగా ఒక ఫోన్ దానికి ప్రత్యేకంగా వేరే నెంబర్.

ఆ గదిలో ఎయిర్‌కూలర్ అమర్చివుంది. ప్రస్తుతం ఎయిర్‌కూలర్ ఆన్ చేసి లేదు.

గది అంతా కలియచూస్తున్న ఊర్మిళ చూపులు టేబుల్‌పై నిలిచిపోయాయి.

టేబుల్‌పై ఫ్రేమ్‌కట్టివున్న ఫోటో ఒకటి వుంది.

ఫోటోలో వున్నతను ఫుల్‌సూట్‌లో వున్నాడు బస్ట్ సైజు ఫోటో. నొక్కు నొక్కుల క్రాప్ చురుగ్గావున్న కళ్ళు. సూటిగా పొడవుగావున్న నాశిక చిరునవ్వు చిందించబోయి బిగబట్టుకున్నట్టున్న పెదవులు. కొద్ది కోలగా ఉండే ముఖం ఆ ఫోటోలో అతను ఎంతో అందంగా వున్నాడు అనుకుంది మనసులో.

ఆ ఫోటోలో అతను ఎవరో ఆమెకు ఒకరు చెప్పకుండానే అర్థం అయిపోయింది.

అతనే ఉదయ్‌కృష్ణ అని.



ఆ గది అంతా ఆమె పూర్తిగా మార్చేసి సర్దింది.

ఇప్పుడా గదికి ఇంకా అందం వచ్చింది.

దుప్పటి కర్టెన్లు అన్నీ మార్చి కొత్తవి వేసింది.

ఆ గదికి మళ్ళీ యథాప్రకారం తాళం వేసేసి ఆ తాళాలు తనదగ్గరే అట్టేపెట్టింది.

* * * *

మృత్యుంజయరావుగారికి ఇప్పుడు సంతోషంగా వుంది.

ఇల్లు చక్క దిద్దుకుంటూ ఇంట్లో ఆడపిల్ల తిరుగుతుంటే ఎంత కళకళలాడుతుంది ఈ ఇల్లు.

ప్రతీ చిన్న పనికీ తను నౌకర్లతో చెప్పవలసి వచ్చేది.

ఊర్మిళ వచ్చిన దగ్గరనుండి అలాక్కాదు.

ఇంటి విషయాలు అన్నీ ఆమె చూసుకుంటుంది.

ఊర్మిళ స్వతహాగా తెలివయినది, చురుకయినదీ కావటంవలన మాట పైకి చెప్పకుండానే గ్రహించుకునే శక్తి ఆ అమ్మాయికి వుంది.

అందుకే తన ప్రమేయం తన మాట అవసరం లేకుండా యిల్లు చక్కగా దిద్దుకుంటుంది.

ఉదయ్‌కృష్ణని పెళ్ళిచేసుకోమని ఎంత చెప్పినా వినటం లేదు.

తనకి నచ్చిన అమ్మాయి ఇక ఎప్పుడు కనిపిస్తుంది!

ఆ మాట అంటే వాడికి కోపం ముప్పయి ఆరు సంవత్సరాలు వచ్చినా పెళ్ళిమాట పట్టించుకోడు.

చెపితే వినడు.

ఉదయ్ కృష్ణకి పెళ్ళి విషయంలో, వచ్చే ఆ అర్ధాంగి విషయంలో చాలా చాలా కోరికలు వున్నాయి.

ఆమె ఎక్కువగా చదువుకోకూడదు. మెట్రిక్ పాసయి వుండాలని ఆపై మరిక చదవకూడదు.

ఆమె ఎంతో చక్కగా అందంగా వుండాలి.

పెద్దలయందు వినయ విధేయతలు కలిగి అణుకువగా వుండాలి. తన భార్య గురించి అందరూ ఎంతో గొప్పగా చెప్పుకోవాలి అని అతని ఉద్దేశం.

సరే కోరికలు అందరికీ వుంటాయి. అవి నెరవేరాలి కదా! మృత్యుంజయరావుగారికి ఆలోచిస్తుంటే మతిపోతుంది.

ఉదయ్ కృష్ణకి ఇక పెళ్ళి ఎప్పుడు అవుతుంది!

ఇంటికి కోడలు వస్తే ఎంత అందంగా వుంటుందీ ఇల్లు!

గాఢంగా నిట్టూర్చారు.

తనే మంచి సంబంధంచూసి కొడుక్కి పెళ్ళి చేసేస్తే!

తనమాట వింటాడా!

వినడు అనుకుంటే ఎప్పటికీ వినడు. బలవంతంగా పెళ్ళి చేసేయుటమే మంచిది.

అతనికి తగిన అమ్మాయి ఎవరా అని ఆలోచిస్తుంటే ఆయన కళ్ళల్లో ఊర్మిళ కదిలింది.



వెంటనే కళ్ళు గట్టిగా మూసుకున్నారు.

ఊర్మిళ అందమైనది, చక్కనిది, గుణవంతురాలే కావచ్చు. ఆ అమ్మాయిని కొడుక్కి యిచ్చి ఎలా పెళ్ళి చెయ్యటం!

ఆ అమ్మాయి ఎవరో తెలిస్తే!

ఆపై మరి ఆలోచించలేకపోయారు.

ఊర్మిళకు, ఉదయ్ కృష్ణకూ పెళ్ళిజరగటం ఈ జన్మలో జరగనిపని అనుకున్నారు.

అందుకే ఆమెకు వేరే సంబంధాలు చూస్తున్నట్టే ఉదయ్ కృష్ణకు కూడా వేరే సంబంధాలు చూడడానికి నిశ్చయించుకున్నారు.

## 3

ఆ రోజు మృత్యుంజయరావుగారు ఊర్మిళని పిలిచి చెప్పారు.

“ఈరోజు రాత్రికి నా ఫ్రెండ్ ఒకాయన, ఆయన కొడుకూ మన ఇంటికి డిన్నర్ కి వస్తారు. వాళ్ళకి నిన్ను పరిచయం చేస్తాను. ఆయన చాలా మంచి అతను” అని.

ఆమె తల ఊపింది అలాగేనంటూ.

ఆయన తనువచ్చిన ఈ ఇరవై రోజుల్లో చాలా మందిని నాలుగయిదుసార్లు డిన్నర్‌కి పిలిచారు.

వాళ్ళందరికీ తనని ఆయనకి మేనగోడలునంటూ పరిచయం చేశారు.

అందుకే ఊర్మిళకి ఆయనఅలా చెప్పటంతో కొత్తగా ఏం అనిపించలేదు.

వంటవాళ్ళకి ఆ రాత్రి డిన్నర్‌కి ఏం వండాలో అన్నీ చెప్పింది.

వాళ్ళు అలాగే అని వంట ప్రయత్నం మొదలు పెట్టారు.

సాయంత్రం ఆరుగంటలు అవటంతో స్నానం చేసి ఆర్గండీవాయిల్ తెల్లచీర, తెల్లజాకెట్ వేసుకుని ముస్తాబు అయింది. నుదుట ఎర్రని గుండ్రని బొట్టు పెట్టుకుంది.

ఊర్మిళ పాలరాతి బొమ్మలా నాజూగ్గా వుంది.

ఏడున్నర అవటంతో ఆ తండ్రీకొడుకులు ఇద్దరూ వాళ్ళ యింటికి వచ్చారు.

మృత్యుంజయరారావుగారు వచ్చిన వాళ్ళకి ఊర్మిళని పిలిచి పరిచయం చేశారు మా మేనకోడలు అంటూ.

ఆ వచ్చినవాళ్ళు అందరిలా చిరునవ్వు నవ్వి వూరుకోలేదు. పెళ్ళి చూపులకి వచ్చినట్టు ఆమెవైపు పరీక్షగా చూశారు.



ఆ చూపుల్లో ఈ అమ్మాయి నచ్చింది అన్న భావం వెల్లడవుతుంది.

"ఏం చదువుకున్నావమ్మా!" వచ్చిన ఆయన అడిగారు.

"మెట్రిక్ పాసయ్యాను" మెల్లగా చెప్పింది.

ఒకగంట తరువాత వాళ్ళు డిన్నర్‌కి కూర్చున్నారు.

తరువాత వాళ్ళు మృత్యుంజయరావుగారితో చాలా సేపు మాట్లాడి వెళ్ళిపోయారు.

ఆయన ఆ రాత్రి వాళ్ళు పోయాక ఊర్మిళని తన గదిలోకి పిలిచి సోఫాలో కూర్చోమని చెప్పారు.

ఆ చెప్పటంలో నీతో చాలా విషయాలు మాట్లాడాలి అన్నట్టు వుంది.

ఆమె అర్థంచేసుకున్నట్టుగా ఆయన చెప్పినట్టు సోఫాలో కూర్చుంది. ఆయన చెప్పే మాటలు వినడానికి తను సిద్ధంగా వున్నట్టు చూసింది.

ఆయన మంచంమీద కూర్చున్నారు.

క్షణంసేపు మౌనం వహించి మెల్లగా అన్నారు.

"చూడమ్మా ఊర్మిళా నిన్ను ఈ యింటికి తీసుకు వచ్చింది నిన్ను ఈ యింట్లో కట్టిపడేయడానికి కాదు. నీకు స్వేచ్ఛ, సుఖం సంతోషం ఇవ్వడానికి నిన్ను నాకూడా తీసుకువచ్చాను. నువ్వు ఈ వయసులో పెళ్ళిచేసుకుని నీ భర్తతో సుఖంగా రోజులు వెళ్ళబుచ్చ వలసింది. అయితే

నీ దురదృష్టం నిన్ను వెంటాడుతూనే వుంది. ఇప్పుడు నీకు మంచిరోజులు వచ్చాయి అని నేను ఖచ్చితంగా చెప్పగలను, అందుకే నాకూడా తీసుకు వచ్చేశాను" అంటూ చెప్పటం ఆగి మెల్లగా ఊపిరి తీసుకుని తిరిగి చెప్పటం ప్రారంభించారు.

"ఇందాక వచ్చారే నా స్నేహితుడు, అతని కొడుకు వాళ్ళు కలకత్తాలో వుంటున్నారు. ఒక కంపెనీ పార్టనర్స కూడా. ఆ అబ్బాయి బి. ఇ. చదివి కలకత్తాలోనే ఉద్యోగం చేస్తున్నాడు. వాళ్ళకి ఇద్దరే కొడుకులు. ఈ అబ్బాయే పెద్ద. అతన్ని నేను ఇదివరలో రెండు మూడుసార్లు చూశాను. అతని మంచితనం నన్ను ఆకట్టుకుంది. నిన్ను చూడగానే అనుకున్నాను. శేఖర్‌కి నిన్ను ఇచ్చి చేస్తే బాగుంటుంది అని. ఆ విషయమే ఉత్తరం వ్రాసాను. అంతే తండ్రీ కొడుకులు ఇద్దరూ వచ్చేశారు. నిన్ను చూసి వెంటనే తమ అంగీకారం తెలియచేశారు. వాళ్ళు కోరినంత కట్నం నేను ఇస్తాను అని అమ్మాయి పెళ్ళి అయ్యాక రాకపోకలు అన్నీ నేను చూస్తాను అని చెప్పాను. వాళ్ళు అన్నిటికీ అలాగే అని ఒప్పుకున్నారు. నీ ఇష్టం నీ అభిప్రాయం చెపితే వాళ్ళతో మాట్లాడి పెళ్ళికి ముహూర్తం పెట్టించేస్తాను" అంటూ ఆమె ముఖంలోకి చూశారు.

ఊర్మిళ తలవంచుకు అలాగే కూర్చుంది బొమ్మలా కదలకుండా పలక్కుండా.

"ఊర్మిళా."



కళ్ళెత్తి ఆయనవైపు చూసింది

"చెప్పమన్నా నీకు ఇష్టం అయితేనే ఈ పెళ్ళి జరుగు సంబంధం తుంది. లేదా ఈ సంబంధం కాకపోతే మరో చూస్తాను. నువ్వు చెప్పడానికి ఏం సందేహించ వద్దు"

"మరి, మరి" అంటూ ఆగిపోయింది.

"ఏమిటి తల్లీ" ఆప్యాయంగా అడిగారు.

"వాళ్ళకి నా గురించి చెప్పేరా?" మెల్లగా అడి గింది.

"అది అంతా నీకు ఎందుకు ఆ విషయాలు అన్నీ నేను చూసుకుంటాను నీకు ఇష్టమా! కాదా! ఆసంగతి చెప్పు ముందు" ఆమె క్షణం ఆగి తల ఊపింది తనకి ఇష్టమే అని, ఆయన తేలిగ్గా నిట్టూర్చారు.

"నాకు ఒక సమస్య తీరింది. మరో సమస్య వుంది మా అబ్బాయి ఉదయ్‌కృష్ణకి కూడా మంచి సంబంధం కుదిరి పోతే ఈ రెండు పెళ్ళిళ్ళు ఒకేసారి జరిపించేస్తాను, ఇక నాకు ఏ బెంగా వుండదు" అన్నారు ఆయన ఆనందంగా.

ఊర్మిళకి ఉదయ్‌కృష్ణకి ఇద్దరికీ ఒకేసారి పెళ్ళి చేసేస్తున్నట్టు వూహించుకుంటూ మురిసిపోయారు.

"అయితే వాళ్ళకి చెప్పేస్తాను. వెంటనే ముహుర్తం కూడా నిశ్చయం చేసుకుందామని"

ఆమె మాట్లాడ లేదు.

ఆయన ఆ విషయాలే కొద్దిసేపు మాట్లాడి ఆ మెను పెళ్ళి పడుకోమని చెప్పారు.

ఆయన చెప్పాక ఆమె అక్కడనుండి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి ఆమె మంచంమీద పడుకున్నా మృత్యుంజయరావుగారి మాటలే చెవుల్లో మారు మ్రోగుతున్నాయి.

తనకి ఈ జన్మలో పెళ్ళే కాదు అనుకుంది.

అటువంటిది తను ఈ ఇంటికి వచ్చింది. మృత్యుంజయరావుగారి మాటలతో తను ఈ ప్రపంచంలో బ్రతగ్గలను అన్న ధైర్యం కలిగింది.

ఇప్పుడు ఆయన సంబంధంచూసి పెళ్ళి చేస్తాను అంటున్నారు ఇది తన అదృష్టమా!

లేకపోతే ఏమిటి? ఎక్కడ పుట్టింది? ఎక్కడ పెరిగింది?

ఎవరింటి కోడలు కాబోతుంది.

ఒక లక్షాధికారి ఇంటికి కోడలు కాబోతుంది.

ఒక ఇంజనీర్‌కి భార్య కాబోతుంది.

అతను అందంగా లేకపోయినా అనాకారి మాత్రం కాడు.

అయినా సరే తను సంతోషంగా పెళ్ళికి ఒప్పుకుంటుంది. తనకీ పెళ్ళి అయి ఇల్లాలు కాబోతుంది.

నలుగురిలో ఫలానా అతని భార్యగా గుర్తించి గౌరవింపబడుతుంది.

అంతకంటే అదృష్టం ఇంకేం వుంటుంది.

తేలిగ్గా నిట్టూర్చింది.

ఈ రోజునుండి కష్టాలకి కన్నీటికి స్వస్తి చెప్పేస్తుంది.

హాయిగా ఆనందంగా రోజులు గడిపేస్తుంది.

# 4

ఆరోజు ఉదయం శేఖర్ వచ్చాడు.

అతను వచ్చే టైముకి మృత్యుంజయరావుగారు ఇంటి వద్ద లేరు. అర్జంటుగా రమ్మని పార్టనర్ ఒకతను ఫోన్ చేస్తే అతన్ని కలుసుకోవడానికి వెళ్ళారు.

ఎవరో వచ్చారు అని నౌకరు వచ్చి చెప్పటంతో ఊర్మిళ ఎవరా! అని హాలులోకి వెళ్ళింది.

శేఖర్ నవ్వుతూ నిలబడ్డాడు మా అంకుల్ యింటి దగ్గర లేరా? అని అడుగుతూ.

అతన్ని చూస్తూనే ఆమె కొద్దిగా కంగారుపడింది. భుజాలచుట్టూ వున్న పైటచెంగుని కంఠానికి మరింత దగ్గరగా లాక్కుంది. "ఇప్పుడే అర్జంటుపని వుండి ఎక్కడికో వెళ్ళారు." అంది మెల్లగా. అతను ఆమె అందచందాలకి ముగ్ధుడవుతూ అలాగే రెప్పవాల్చకుండా క్షణంసేపు చూశాడు.

ఎంత అపురూప సౌందర్యం!

తనని వివాహం చేసుకోవడానికి ఒప్పుకుంది అంటే నిజంగా తన అదృష్టమే.

అని మనసులో అనుకోకుండా వుండలేకపోయాడు.

"ఆయన వచ్చేటప్పటికి ఎంతసేపు పడుతుంది?"

"ఏమో ఎంతసేపు అవుతుందో తెలీదు" అంది. ఆమెకు నిజంగానే తెలీదు.

"మేము రేపు వెళ్ళిపోతున్నాం నాన్నగారికి పనివుండి రాలేదు నన్ను వెళ్ళి మీ అంకుల్‌తో మాట్లాడి రమ్మన్నారు. ఆయన వచ్చేవరకూ కాస్సేపు ఇక్కడ కూర్చోవచ్చా." నవ్వుతూ కిల్లిగా అడిగాడు.

"అయ్యో కూర్చోండి అదీ నన్ను అడగాలా!" అంది మనసులో తన మతిమరుపుకు తనే తిట్టుకుంటూ.

వచ్చిన అతను ఎప్పుడు వెళ్ళిపోతాడా అన్నట్టు కూర్చోమని మర్యాదకయినా తను అనలేదు.

అతను ఏమనుకున్నాడో మనసులో సిగ్గుపడింది.

శేఖర్ నవ్వుతూ సోఫాలో కూర్చున్నాడు.

ఊర్మిళ అతనికి టీ తీసుకురావడానికి లోపలకు వెళ్ళబోతుంటే అతను అది ముందే గ్రహించినట్టుగా అన్నాడు.

"ఇప్పుడు నేను కాఫీ టిఫిన్ తీసుకునేవచ్చాను. మీరు ఇప్పుడు ఏం తీసుకురావద్దు. మీకు అభ్యంతరం లేకపోతే అలా సోఫాలో కూర్చోండి. మీతో కొంచెం మాట్లాడాలి" బ్రతిమాలినట్టే అన్నాడు.

ఊర్మిళ వెళ్తున్నదల్లా అతని మాటలు వింటూ తక్కున ఆగిపోయింది. తలతిప్పి అతనివైపుచూస్తూ ఏమనుకుందో ఏమో వచ్చి అతనికి ఎదురుగా సోఫాలో కూర్చుంది.

శేఖర్ క్షణం మౌనంగా కూర్చుని అన్నాడు.



"నాకు మీ అంకుల్ మేము ఈ వూరు ఎందుకు వచ్చామో చెప్పే వుంటారనుకుంటాను."

చెప్పారు అన్నట్టు తల ఊపింది

"మీకు ఇష్టమే అన్నట్టు చెపుతూ పెళ్ళికి ముహూర్తం పెట్టించేద్దాం అని ఆయన ఉదయమే మాకు హోటల్‌కి ఫోన్ చేసి చెప్పారు మా అబ్బాయి ఇష్టపడ్డాడు మీరు ముహూర్తం పెట్టించి మాకు తెలియచెయ్యండి. నాకు ఇప్పుడు రావడానికి తీరికలేదు. అర్జంటుగా పని వుంది. మా అబ్బాయి మీ ఇంటికి వస్తాడు అని మా నాన్నగారు చెప్పారు ఫోన్‌లో" అంటూ ఆమెవైపు పరిశీలనగా చూశాడు.

ఆమె ముఖంలో భావాలు జాగ్రత్తగా గమనిస్తూ ఊర్మిళ పైకి ఎలాంటి భావం ప్రకటించలేదు. ఎవరో తెలిసినవాళ్ళు యింటికి వస్తే ఎలా మాట్లాడుతుందో అతనితో అలాగే మాట్లాడింది.

శేఖర్‌కి ఎందుకో ఆ విషయం నచ్చలేదు.

ఆమె తనతో నవ్వుతూ చనువుగా మాట్లాడుతుంది అని ఆశించాడు.

అందుకు వ్యతిరేకంగా ఆమె వుండటంతో నిరాశ అనిపించింది.

ఈ అమ్మాయికి తనని వివాహం చేసుకోవడం ఇష్టమా! కాదా! అన్న ప్రశ్న అతని మనసులో ఉదయించింది.

ఒకవేళ మృత్యుంజయరావుగారి మాట తీసేయలేక ఒప్పుకుందా?

ఆయనకి ఒక కొడుకు వున్నాడు. చాలా అందంగా వుంటాడని వినటమేగాని ఎప్పుడూ చూడలేదు.

ఆయనకి ఈ అమ్మాయి చెల్లెలి కూతురు అని చెపుతున్నారు. వరస అయినప్పుడు అతనికే ఇచ్చి ఎందుకు చెయ్యకూడదు!

ఈ అమ్మాయి అతన్ని ప్రేమించలేదు కదా!

మృత్యుంజయరావుగారికి ఈ సంగతి తెలియక ఈ సంబంధం కుదురుస్తున్నారా! లేక తెలుసుండే తన కొడుక్కి ఈ అమ్మాయిని చేసుకోవటం ఇష్టంలేక ఈ పెళ్ళి చేసేస్తున్నారా!

అతని తెలివయిన బుర్ర ఇన్ని ఆలోచనలు ఆలోచించింది.

ఊర్మిళకి అతని ఎదురుగా కూర్చుని మాట్లాడాలి అంటే సిగ్గుతో ప్రాణం పోతున్నట్టుగా వుంది.

ఒక్కమాట మాట్లాడలేకపోతుంది.

అలా మౌనంగా తలవంచుకుని కూర్చుంది.

"నేను మిమ్మల్ని ఒక్క ప్రశ్న అడుగుతాను మీరు వున్నది వున్నట్టుగా జవాబు ఇవ్వాలి."

ఊర్మిళ తల ఎత్తకుండానే తల ఊపింది. అలాగే చెపుతాను అన్నట్టుగా.



Cultural Association NANDYAL 2718

"మీరు ఈ వివాహానికి మనస్ఫూర్తిగా ఒప్పుకున్నారా!"

అతని కంఠంలో ఆతృత తొంగి చూసింది. ఆమె ఏం సమాధానం చెబుతుందో అన్నట్టు.

ఆమె కళ్ళెత్తి అతనివైపు మౌనంగా ఒకసారి చూసి తల వంచేసుకుని మెల్లగా అంది.

"అంతా మా అంకుల్ ఇష్టం. వారు ఎలా చెపితే అలాగే. నా ఇష్టం అంటూ ఏం లేదు."

శేఖర్ మనసులో అనుమానం ఏదో నిజం అని తోచినట్టు అయింది.

"అయితే మీరు ఈ వివాహానికి ఇష్టపడి అంగీకరించారు అంటే మీ అంకుల్ మాట తీసేయలేక వారు చెప్పినట్టు మీరు ఒప్పుకున్నారు అన్న మాట."

అంతే అన్నట్టు తల ఊపింది.

శేఖర్ ముఖంలో నవ్వు మాయమయి గంభీరంగా మారిపోయింది.

ఆమెతో మాట్లాడవలసిన మాటలు ఇక ఏంలేవన్నట్టు "ఇక నేను వెళ్తానండీ ఆయన వచ్చేసరికి ఎంత టైము అవుతుందో" అంటూ లేచి నిలబడ్డాడు.

ఊర్మిళ ఆశ్చర్యంగా చూసింది. అతనివైపు మృత్యుంజయరావుగారు వచ్చిందాకా వుంటానని చెప్పి ఇప్పుడేమిటి వెళ్ళిపోతాను అంటున్నాడు అనుకుంది.

ఆమె మనసులో ఉద్దేశం కనిపెట్టినట్టు అన్నాడు.

"మళ్ళీ వస్తాను. ఓ ఫ్రెండుని కలుసుకోవాలి"

ఊర్మిళ తల ఊపింది.

అతను వెళ్ళిపోయాడు.

మృత్యుంజయరావుగారు వచ్చాక చెప్పింది, శేఖర్ వచ్చి వెళ్ళినట్టు.

అవును వస్తానని చెప్పాడు. నాకు అర్జంటు పనిమీద ఒకళ్ళతో మాట్లాడడానికి వెళ్ళాను. సాయంత్రం హోటల్‌కి వెళ్ళి కలుసుకుంటాను అని అన్నారు.

ఊర్మిళకు శేఖర్‌తో మాట్లాడిన తరువాత ఎందుకో అతనిపై వున్న మంచి అభిప్రాయం పోయిందనిపించింది.

దానికి కారణం ఆమెకే అర్థంకాలేదు. ఆలోచిస్తూ తన గదిలో అలా కూర్చుంది.

## 5

ఊర్మిళ ఆరోజు స్నానంచేసి ఇస్త్రీ చీరకట్టుకుంది. తన గదిలో డ్రెస్సింగ్ టేబుల్ వద్ద కూర్చుని తల దువ్వుకుంటుంది.

గారమ్మ పువ్వులు కోసి తెచ్చింది.

"దారం ఇవ్వండమ్మా మాల కట్టిస్తాను" అంది.



"టేబుల్ మీద వుంది తీసుకో" అంటూ తిరిగి తల దువ్వుకుంటుంది.

గారమ్మ పువ్వులు మాలకడుతూ వున్నట్టుండి తల పైకి ఎత్తి అడిగింది

"అమ్మా! చిన్నబాబుగారు ఎప్పుడు వస్తారు!"

"ఏమో నాకు తెలీదు" ముక్తసరిగా చెప్పింది.

"ఆ బాబుగారు ఆ వూళ్ళో వున్నమూలాన మళ్ళీ ఈ వూరు వస్తే పెద్దయ్యగారికి సుఖం వుండదు" అంది గారమ్మ పూల మాలపై శ్రద్ధగా చూస్తూ మాలకడ్తూ.

"అదేమిటి!" ఆశ్చర్యంగా తలతిప్పి అడిగింది.

"అదేమిటి అంటే నేను ఏం చెపుతానమ్మా ఆ తండ్రీ కొడుకులు ఇద్దరికీ ఋణంపడదు" అంది గొంతుక తగ్గించి రహస్యంగా.

"అంటే" అర్థంకానట్టు నుదురు చిట్లించింది.

"చిన్నబాబుగార్ని పెళ్ళిచేసుకోమంటారు. ఆ బాబు తండ్రిమాట వినరు. అదే ఇద్దరికీ పెద్ద దెబ్బలాట అయిపోతుంది."

"ఆయన తండ్రిమాట విని పెళ్ళి ఎందుకు చేసుకోరు!" అడిగింది.

అతను పెళ్ళిచేసుకోక పోవడానికి కారణం ఏమిటో ఆమె ఊహించలేక పోతుంది.

"ఏమోనమ్మా ఆ సంగతులు మాకు తెలియవు. ఆ బాబు ఎందుకు పెళ్ళి చేసుకోరో మాకు అర్థంకాదు" అంది.

ఊర్మిళ పనిమనిషిని మరిక ప్రశ్నించలేదు.

యింటి విషయాలు పని మనుష్యులతో చర్చించటం అంత తెలివి తక్కువతనం మరొకటిలేదు.

అందుకే మౌనంగా ఉండిపోయింది.

గౌరమ్మ పూలమాల కట్టటం పూర్తిచేసి మాల డ్రస్సింగ్ టేబుల్ మీద వుంచి వెళ్ళిపోయింది.

o o o o

మృత్యుంజయరావుగారు ఊర్మిళని పిలిచారు.

ఎందుకా అని గబగబా హాలులోకి వెళ్ళింది.

ఆయన ముఖం సంతోషంతో వెలిగిపోతుంది.

"రామ్మా అలా కూర్చో" అంటూ సోఫా చూపించారు.

ఆమె కూర్చుంది. ఏం చెపుతారో అన్నట్టు.

"మీ పెళ్ళికి ముహూర్తం పెట్టించేశాను. పై నెల పదిహేడవ తారీకు ఉదయం ఎనిమిదిగంటలకు పెళ్ళి ముహూర్తం" అంటూ చెప్పారు.

ఆమె మాట్లాడలేదు. "మరొక సంగతి!" అంటూ ఆయన చేతిలో వున్న కవరులోంచి రెండు ఫోటోలు తీసి ఆమెకు ఇస్తూ, "ఈ ఇద్దరు అమ్మాయిల్లో ఎవరు బాగున్నారు!" అని అడిగారు.

ఆ ఫోటోలు రెండూ పరిశీలనగా చూసింది.



ఇద్దరూ బాగానే వున్నారు

ఆ మాటే ఆయనతో అంది.

ఆయన ఆ మాటలకి నవ్వి అన్నారు. "మా అబ్బాయి ఉదయ్‌కృష్ణకి ఈ ఇద్దరి అమ్మాయిల్లో ఏ అమ్మాయి బాగుంటుందో చూసి ఆ సంబంధం నిశ్చయిద్దామని."

ఆయన మాటలకి ఆమె అంది.

"మనకి నచ్చటం ముఖ్యంకాదు ముందు వారికి నచ్చాలి ఈ ఫోటోలు వారికి చూపించండి."

ఆమెమాటలకి ఆయన గాఢంగా నిట్టూర్చి అన్నారు.

"వాడు అంత తేలిగ్గా పెళ్ళికి ఒప్పుకుంటే ఇకనేం ఏ సంబంధం చూసినా వద్దు అనేస్తుంటే ఏం చెయ్యాలో అర్థంకావటంలేదు. అబ్బాయి స్విడ్జర్లాండ్ నుండి రాగానే ఏదో సంబంధం కుదిర్చేసి ఎలా అయినా పెళ్ళి జరిపించేయాలని నా ఉద్దేశం."

"మంచిదేగాని మీరు ఏదో సంబంధం ఆయన్ని అడగకుండా నిశ్చయిస్తే ఆయన కాదు అంటే వాళ్ళదగ్గర మీ మాట పోతుంది" అంది మెల్లగా.

అంతదూరం ఆలోచించని ఆయన ఆమె మాటలు వింటూనే నిజమే సుమా, నేను అంతదూరం ఆలోచించలేదు అన్నట్టు చూశారు.

ఆమె చిరునవ్వు నవ్వింది.

"సరే అబ్బాయి వచ్చాక అడిగి సంబంధం నిశ్చయిస్తాను" అన్నారు ఆయన. ఆ మధ్యాహ్నం తన గదిలో కూర్చుని పుస్తకం చదువుకుంటున్నా ఆమెకు ఆ పుస్తకంలో అక్షరాలు ఏం కనిపించలేదు.

మనసు పరిపరి విధాలా పోయింది

శేఖర్‌తో తన పెళ్ళి నిశ్చయం అయిపోయింది అంటే ఒక పక్క సంతోషం కలుగుతుంది.

తన జీవితంలో పెళ్ళిరాతే లేదు అనుకుంది.

అటువంటిది తనకి పెళ్ళి అవుతుంది అంటే చాలా సంతోషం కలుగుతుంది.

మరొకవైపు శేఖర్ తనకి భర్త కాబోతున్నాడు అనుకుంటే ప్రాణం విలవిల్లాడుతుంది.

అతని వ్యక్తిత్వం తనకి ఎందుకో నచ్చలేదు.

శేఖర్‌కి చదువు, గుణం, ఆస్తివున్నా అందగాడు మాత్రం కాడు. ఫర్వాలేదు ఇతను బాగానే వున్నాడు అనుకుంటారు ఎవరైనా చూస్తే!

ఈ పెళ్ళి నేను చేసుకోను అని చెప్పేయాలని కాస్సేపు చెప్పేస్తే తను చేతికి అందబోయే అదృష్టాన్ని కాలదన్నినట్టు అవుతుంది. ఏమో తరువాత ఏడ్చి ప్రయోజనం లేదు అని కాస్సేపు ఆలోచిస్తుంది.

ఏమైనా తను మృత్యుంజయరావు గారు చెప్పినట్టు శేఖర్నే వివాహం చేసుకోడానికే నిశ్చయించుకుంది.



తనకి పెళ్ళి కావటమే మహాభాగ్యం.

ఆ పెళ్ళి ఎప్పుడు ఎవరితో అయినా సంతోషించవలసిందే.

తేలిగ్గా వూపిరి తీసుకుంది. ఆలోచనలు ఒక దారికి వచ్చినందుకు.

మనసు కుదుటపడినట్టు అయింది.

# 6

మృత్యుంజయరావుగారు ఊర్మిళని పిలిచి చెప్పారు. రేపు ప్లెయిన్‌లో అబ్బాయి వస్తున్నాడు అని.

ఆయన ఆ సంగతి సంతోషంగా చెప్పటం విని ఆనందించింది.

ఆయన చెప్పేశారు.

"రేపు మన ఇద్దరం ఎయిర్‌పోర్ట్‌కి వెళ్దాం నువ్వు సిద్ధంగా వుండు"

"నేనుకూడానా!" ఇబ్బందిగా ఆశ్చర్యంగా అడిగింది.

"నువ్వూనూ ఇద్దరం వెళ్దాం."

ఆమె మాట్లాడలేదు, అలాగే అన్నట్టు తల ఊపింది.

గదిలోకి వచ్చాక ఆమెకు ఆ ఆలోచన రాగానే గుండెలు దడదడలాడాయి.

అతన్ని తను ఫొటోలో చూడటమే ఎప్పుడూ చూడలేదు.

ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళాలి అంటే ఎలాగో అనిపిస్తుంది. రాను అంటే ఆయన ఏమనుకుంటారో అని భయం.

వెళ్తే ఈ అమ్మాయి ఎవరా అని అతను అనుకుంటాడని భయం ఎలా? ఆలోచిస్తుంది.

మర్నాడు మధ్యాహ్నం.

ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళక తప్పలేదు.

మంచి చీర కట్టుకుని ముస్తాబు అయి బయలుదేరింది.

మృత్యుంజయరావుగారు, ఊర్మిళ కారులో ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళారు ఉదయ్‌కృష్ణ కంపెనీ పనిమీద పైవూళ్ళకు గాని విదేశాలకుగాని వెళితే అతనువచ్చేది ఏ రోజో తెలిస్తే ఆయన తప్పక ఎయిర్‌పోర్టుకి వెల్తారు.

బొంబాయినుండి వచ్చే ప్లయిన్‌లో ఉదయ్‌కృష్ణ వస్తున్నాడు.

మృత్యుంజయరావుగారు, ఊర్మిళ కూర్చున్నారు.

ప్లయిన్ వచ్చేటైము అవటంతో ఎనౌన్స్‌మెంట్ వినిపించింది.

కొద్ది నిమిషాలలో బొంబాయినుండి వచ్చే ప్లయిన్ లాండ్ అవుతుంది అని!



అక్కడ కూర్చున్న కొందరితోపాటు మృత్యుంజయరావుగారు, ఊర్మిళ లేచి అవతలకు వెళ్ళారు.

ప్లయిన్ ఆగటంతో ప్లయిన్ దగ్గరికి మెట్లు తోసుకుని వెళ్ళారు.

ప్లయిన్ తలుపులు తెరుచుకున్నాయి.

ఒక్కొక్కళ్ళూ దిగుతున్నారు.

ఉదయ్‌కృష్ణ దిగుతూ ఇటు చూశాడు.

మృత్యుంజయరావుగారు కొడుకుని చూసి చెయ్యి వూపారు.

అతనుకూడా చిరునవ్వుతో చెయ్యి వూపాడు.

అతను చకచకా నడిచి ఇటే రావటం కళ్ళప్పగించి చూస్తుంది ఆమె.

ఉదయ్‌కృష్ణ తండ్రి నిలబడిన వద్దకు వచ్చాడు.

ఊర్మిళ అతనివైపు రెప్పవాల్చటం మరిచినట్టు అలా చూస్తుండిపోయింది.

బాగా పొడవుగా పొడువుకి తగిన ఒళ్ళుతో, బలంగా, ఆరోగ్యంగా, అందంగా హుందాగా వున్నాడు.

నన్ను మించిన అందమైన వాళ్ళు ఈ ప్రపంచంలో లేరు అని సవాల్ చేస్తున్నట్టు వుంది అతని అందమైన విగ్రహం.

ఆతనిలో అందం, ఆకర్షణ, హుందాతనం, నిండుతనం పోటీ పడుతున్నాయి. దానికి తోడు శరీరచాయ పచ్చగా మెరిసిపోతుంది.

ఇంత అందంగా వుండబట్టే ఇతనికి ఏ పిల్లా నచ్చటం లేదేమో అనుకుంది మనసులో.

తండ్రితో మాట్లాడుతున్న అతను ఆ పక్కనే బొమ్మలా కదలకుండా నిలబడ్డ ఆమెవైపు ఆశ్చర్యంగా ఎవరా అన్నట్టు చూశాడు

కొడుకు మనసులో ఉద్దేశం గ్రహించుకున్నట్టుగా అన్నారు.

"ఈ అమ్మాయి నా స్నేహితుడి కూతురు. అతను చనిపోతూ కూతురి బాధ్యత అంతా నాకు అప్పగించారు. తండ్రి పోవటంతో ఒంటరిదైపోతే ఆమెను ఓదార్చి మన ఇంటికి తీసుకువచ్చేను. అప్పటినుండి మన ఇంట్లోనే వుంటుంది" అంటూ ఇద్దరికీ పరిచయం చేశారు.

ఊర్మిళ మౌనంగా చేతులు జోడించి నమస్తే చేసింది.

ఉదయ్‌కృష్ణ నమస్తే చెయ్యలేదు తల వూపాడు.

ఆమెవైపు రెప్ప వాల్చకుండా క్షణంసేపు అలాగే చూశాడు.

పచ్చని పసిమిరంగు సన్నగా పొడవుగా రివటలా అందంగా నాజూగ్గా బొమ్మలా సుందరంగా వుంది.

ఆమె కళ్ళు కోలగా సోగగా వున్నాయి.

ఆ కళ్ళకి కాటుక రేఖలు తీర్చిదిద్దింది ఏమో ఆ కళ్ళు ఇంకా విశాలంగా కనిపిస్తూ లేడికళ్ళు గుర్తుకు తెస్తున్నాయి.

చిన్ననోరు పెదాలకి లైట్‌గా లిప్‌స్టిక్ వేసింది.

కొద్దిగా కోలగావుండే ముఖం గడ్డం మొన చేలినట్టు అందంగా వుంది.



సన్నగా గీతగీసినట్టు అందంగా వున్న కనుబొమ్మలు.

ఉంగరాల జుట్టు రింగురింగులుగా తిరిగి ఆమె చెంపలని తాకుతుంటే ఆమెకు వింత అందాన్నిచ్చాయి.

బాగా పొడవుగా వున్న జడ

లైట్‌గ్రీన్ ప్లెయిన్ చీర అదేరంగు పొడవు చేతుల జాకెట్ వేసుకుంది.

ఎడంచేతికి వాచీ, కుడిచేతికి ఎర్రరాళ్ళ గాజులు నాలుగు వేసుకుంది.

మెడలో ఎర్రరాళ్ళ నెక్లెస్ చెవులకి కొద్ది కోలగా వుండే జూకాలు ఎర్రరాళ్ళవి పెట్టుకుంది

నుదుట లైట్‌గ్రీన్ శింగార్ కుంకుమబొట్టు పెట్టుకుంది.

ముట్టుకుంటే కందిపోయేంత సౌందర్యరాశి ఆమె.

గట్టిగా గాలివేస్తే పడిపోయే పూలతీగలా నాజూగ్గా సుకుమారంగా వుంది.

ఆ సౌందర్యాన్ని మళ్ళీ చూడాలనిపిస్తున్నా అలా చూడటం సభ్యత కాదని చూపులు మరోవైపుకి తిప్పేసుకున్నాడు

ముగ్గురూ కారువేపు నడిచారు.

* * * *

మృత్యుంజయరావుగారు వెళ్ళి తన గదిలో పడుకున్నారు.

కొడుకుతో మాట్లాడి తన గదిలోకి వెళ్ళి పడుకునే సరికి సాయంత్రం అయిదుగంటలు అవుతుంది.

ఇక ఆవేళ ఎక్కడికీ వెళ్ళలేను అనుకున్నారు.

ఊర్మిళ ఎయిర్‌పోర్టుకి వెళ్ళేముందు ఉదయ్‌కృష్ణ గది తలుపులు తాళం తీయించేసి గది మరోసారి నీటుగా సర్దేసింది.

తండ్రితో మాట్లాడి అతను తిన్నగా మేడమీదకు వెళ్ళాడు. గది గుమ్మం దగ్గరకు వెళ్ళగానే అతని పాదాలు ముందుకి మరి కదలనట్టు అలా ఆగిపోయాడు.

గదితలుపులు తెరిచి వున్నాయి.

తను వూళ్ళోలేనప్పుడు ఆ గది తలుపులు మూసేసి వుంటాయి. అలా మూసేసి వుంచమని నౌకర్లందరికీ గట్టిగా చెప్పేశాడు. తను చెప్పినట్టే వాళ్ళు తలుపులు మూసేసి వుంచుతారు. ఎన్నడూ లేంది ఈరోజు ఏమిటి తలుపులు తెరిచి వున్నాయి.

ఉదయ్‌కృష్ణకి పట్టరాని కోపం ముంచుకు వచ్చేసింది.

"ఎవరక్కడ! రంగన్నా!" అంటూ గట్టిగా కేక వేశాడు.

నౌకర్లందరూ కంగారుపడుతూ భయంగా పరిగెత్తుకు వచ్చారు.

"తలుపులు ఎవరు తెరిచారు?" తీక్షణంగా చూస్తూ కోపంగా అడిగాడు.

నౌకర్లకి వెంటనే ఏం చెప్పాలో తోచలేదు.

చేతులు కట్టుకుని మౌనంగా భయంగా నిలబడ్డారు.

"మాట్లాడరేం!" గద్దించి అడిగాడు.



"వాళ్ళని అడిగితే వాళ్ళేం చెపుతారు! నన్ను అడిగితే నేను చెపుతాను" అంటూ వినిపించింది ఓ మృదువైన కంఠస్వరం.

ఉదయ్‌కృష్ణ చటుక్కున తలతిప్పి చూశాడు.

నౌకర్లందరూ కూడా తలతిప్పి చూశారు.

ఊర్మిళ మేడమీద పై మెట్టుమీద నిలబడివుంది.

ఆమె నౌకర్లవైపుచూసి వాళ్ళని అక్కడినుండి వెళ్ళిపొమ్మన్నట్టు కళ్ళతోనే చెప్పింది.

వాళ్ళు అర్థంచేసుకున్నట్టుగా అతనివేపు ఒకసారి భయంగాచూసి అక్కడనుండి మెల్లగా వెళ్ళిపోయారు.

అతను ఆమెవైపు అలా పరిశీలగా చూడసాగాడు.

"మీ గదినీ, గదిలో సామానులని నీటుగా అందంగా సర్దించడానికిగాను తలుపులు నేనే తెరిపించాను. తప్పయితే క్షమించండి" అంది మెల్లగా.

ఆమె నోటినుండి వెలువడే ఆఖరి మాటలు వింటూ అతని మనసులో కలిగిన కోపం అంతా ఆవిరిలా మాయమై పోయింది.

అంత అందాలరాశి తనకి క్షమార్పణలు కోరటమా!

ఆమె కళ్ళ ఎదురుగా నిలబడితే చాలు పురుష జన్మ ఎత్తిన ప్రతీ మగవాడికీ మతిపోతుంది.

ఆ అందమైన నాజూకు సుందరిని దగ్గరకు లాక్కొని గుండెలకు హత్తుకోవాలి.

ఆ కోలకళ్ళలోకి అలాగే చూడాలనీ,

ఆమె గడ్డంపట్టి పైకెత్తి ఆమె కనుపాపల్లో తన బొమ్మని చూడాలని.

ఉంగరాల జుట్టు ఆమె చెంపలని అల్లరిగా తాకుతుంటే ఆ జుత్తుని అపురూపంగా సవరించి, ప్రేమతో ఆమె లేత చెంపలని నిమిరి తన చేతుల్లో ఆమెను బందీచేయాలని ప్రతీ పురుషుడూ కలలు కంటాడు.

ఆ కల నిజం అయ్యేది ఏ ఒక్క అదృష్టవంతుడికో.

అతని వేపు చిరునవ్వుతో చూసింది. ఆమె చిరునవ్వు అతని గుండెల్లోకి చొరబడి చిరుగంటలు మ్రోగించింది.

మనసు అంతా దూది పింజలా మారి గాలిలోకి ఎగర సాగింది.

ఇక అక్కడ నిలవలేక గదిలోకి దారితీశాడు.

ఆ రాత్రి పడుకున్నా అతనికి నిద్రపట్టలేదు.

అతని గుండెలో ఆమె నాట్యం చేయసాగింది.

ఆమె కాలిగజ్జెల మ్రోతలు అతని మనసులో మధురమైన ఊహాలు తలఎత్తాయి.

ఆమె అందమైన కళ్ళు అతన్ని కవ్విస్తూ పలకరిస్తున్నట్టే అనిపించసాగింది.

ఉదయ్‌కృష్ణ మనసులో ఎన్నడూ పెళ్ళిమాటే తల ఎత్తలేదు. ఎంత అందమయిన అమ్మాయిని చూసినా ఆమెలో తనకి నచ్చని గుణం ఏదో ఒకటి కనిపించేది.

భార్య అంటే ఇలాంటి అమ్మాయా! అన్న ఊహ రాగానే అతనికి అసహ్యం కలిగేది

ఇన్ని సంవత్సరాలు తను స్వప్నంలో ఊహించుకున్న ఊర్వశి ఇప్పుడు కళ్ళ ఎదుట నిలిచినట్టు అయింది.



ఈ అందాలరాశి తన భార్య అయితే!

ఉదయ్‌కృష్ణ మనసు అంతా వెన్నెల పరుచుకుంది. మనసులో ఏవో మధురమైన ఊహాలు నాట్యం చెయ్యసాగాయి.

## 7

మృత్యుంజయరావుగారు ఆ ఉదయం పనివుండి ఎక్కడికో వెళ్ళిపోయారు.

ఉదయ్‌కృష్ణ ఎనిమిది గంటలు అయినా లేవలేదు.

అతను ఎప్పుడూ ఆలస్యంగానే లేస్తాడు.

అతనికి మెలుకువ రాగానే అలారం బెల్ వినిపిస్తుంది.

బెల్ వినిపించగానే నౌకర్లు మేడమీదకు పరుగెత్తారు.

ఉదయ్‌కృష్ణ కళ్ళువిప్పి చూస్తూనే పట్టి చేతుల్తో నిలబడ్డ నౌకర్లు కనిపించారు.

"ఏం నా అలవాటు ఏమిటో మర్చిపోయారా!" అంటూ గద్దించి అడిగాడు.

"మిమ్మల్ని స్నానంచేసి కాఫీ త్రాగమని అమ్మాయిగారు చెప్పమన్నారండి" అంటూ నౌకరు వినయంగా చెప్పాడు. దీనిలో తన తప్పు ఏంలేదు అన్నట్టు.

"ఆవిడ చెప్తే మీరువచ్చి నాకు చెపుతున్నారా! ఇడియట్స్ వెళ్ళి కాఫీ తీసుకురండి" కోపంగా అరిచాడు.

నౌకర్లు వెళ్ళిపోయారు.

ఆవిడగారు చెప్పిందట. వీళ్ళు అక్షరాలా అమలు

పరుస్తున్నారు. మనసులో తిట్టుకుంటూ వెల్లకిలా పడుకున్న వాడల్లా అటు తిరిగి బోర్లా పడుకున్నాడు.

అయిదు నిమిషాల తరువాత గుమ్మందగ్గర గాజులు గలగల్లాడిన శబ్దం వినిపించటంతో చివ్వున తల ఎత్తి అటు చూశాడు.

గుమ్మంవద్ద ఊర్మిళ చిరునవ్వుతో నిలబడి ఇటే చూస్తుంది.

లైట్ బ్లూ చీర అదేరంగు పొడవుచేతుల జాకెట్ సెక్ ది వేసుకుంది.

మెడలో ఒంటిపేట ముత్యాలహారం చెవులకి ముత్యాల రింగులుతో ఎంతో అందంగా కనిపించింది.

ఆమె అతని కంటికి నీలి మేఘమాలికలా అత్యంత సుందరంగా కనిపించింది.

“బెడ్ కాఫీ తీసుకోవటం అంత మంచిది కాదు అని నేనే నౌకర్లని కాఫీ పట్టుకెళ్ళనివ్వ లేదు.”

అతను మాట్లాడ లేదు.

“మీ యిష్టం మీదే అయితే నేను వెళ్ళి కాఫీ తెస్తాను” అంది.

ఆ అనడంతో మీ ఇష్టం మీరు ఎలా చెపితే అలా చేస్తాను అన్నట్టు వుంది.

ఆమె అలా అంటుంటే చెయ్యిచాపి ఆమెను చప్పున దగ్గరకు లాక్కుని నాకు ఏ బెడ్ కాఫీ వద్దు నీ అధరామృతం కావాలి అని గట్టిగా చెప్పి ఆ పని వెంటనే చేసేయాలని పించింది.

“కాఫీ తెమ్మంటారా!”



“వద్దు స్నానంచేసి తాగుతాను” అంటూ మంచం మీదనుండి లేచాడు.

ఊర్మిళ అక్కడినుండి వెళ్ళిపోయింది.

తను కళ్ళువిప్పగానే ప్రతి ఉదయం ఆమె కనిపిస్తే!

అతనికి నవ్వు వచ్చింది.

తన వూహాలు ఎన్నడూలేంది రాకెట్‌లా ఆకాశంలోకి దూసుకుపోతున్నాయి. అనుకున్నాడు మనసులో.

ఉదయ్‌కృష్ణ స్నానంచేసి బట్టలు మార్చుకుని తయారవుతుంటే నౌకర్లు కాఫీ, టిఫిన్ ట్రేలతో వరసగా పట్టుకొని అక్కడ టేబుల్‌వద్ద ఉంచి వెళ్ళిపోయారు.

అతను టిఫిన్ తీసుకుంటూ ఊర్మిళ వస్తుంది ఏమో అని చూశాడు.

కాని ఆమె ఆ చాయలకే రాలేదు.

తను కాఫీ, టిఫిన్ తీసుకోవటం ముగించి నౌకరుకు చెప్పేసి తన కారు తీసుకుని వెళ్ళిపోయాడు.

* * * *

మృత్యుంజయరావుగారు ఆ రోజు పోస్టులో వచ్చిన ఉత్తరాలు ఊర్మిళని పిలిచి చదవమని చెప్పారు

ఆయన కళ్ళద్దాలు పెట్టుకుని చదవలేక.

ఆమె ఉత్తరాలు చదివి ఆయనకు వినిపిస్తుంది

ఆయన సోఫాలో వెనక్కి చేరబడి కళ్ళుమూసుకుని వింటున్నారు.

అదే సమయంలో ఉదయ్‌కృష్ణ ఎక్కడినుండో వచ్చాడు.

లోపలికి అడుగు పెడుతూనే ఆమెను చూసి క్షణం నిశ్చ
ఆలా నిలబడి పోయాడు.

ఉత్తరం చదువుతున్న ఆమె ఎవరో వచ్చినట్టు అలి కిడి అవటంతో తల ఎత్తి అటు చూసింది.

ఒక్క క్షణం ఇద్దరి చూపులు పెనవేసుకు పోయాయి.

ఒకరి కన్నుల్లో అనురాగం నిండుగా పొంగులు వారు తుంది.

మరొకరి కన్నుల్లో కంగారు ద్యోతకమవుతుంది.

ఒకరి పెదవులు చిరునవ్వుతో విప్పారుతుంటే మరొకరి పెదవులు భయంతో సిగ్గుతో వణక సాగాయి.

ఊర్మిళ ఉత్తరం చదువుతున్నదల్లా ఎందుకు చదవ టం ఆపేసిందో ఆయనకి అర్ధం కాలేదు.

వెంటనే కళ్ళు తెరిచి ఆమెవైపు చూశారు.

ఆమె చూపులు ఇక్కడ లేవు

అటు చూశారు కొడుకు నిలబడి వున్నాడు. అతని చూపులు ఆమెను హత్తుకుని వున్నాయి.

వాళ్ళిద్దర్నీ తను గమనించినట్టు వాళ్ళకి తెలియ చెయ్యటంకోసం పొడి దగ్గు దగ్గుతూ సోఫాలో నిటారుగా కూర్చున్నారు.

దాంతో ఆయన ఊహించినట్టుగా వాళ్ళిద్దరూ కంగారుపడి సర్దుకున్నట్టు అయ్యారు.

ఊర్మిళకి ఎవరో తరుముకు వచ్చినట్టు పాఠం చదివి నట్టుగా ఉత్తరం గబగబా చదవసాగింది.

ఉదయ్‌కృష్ణ పెద్ద పెద్ద అంగలతో మేడమెట్లువైపు దాటేశాడు.



ఉత్తరాలు చదవటం పూర్తి అయిందనిపించి ఆయనకి తన ముఖం చూపలేను అన్నట్టుగా అక్కడనుండి పారిపోయి నట్టుగా వెళ్ళిపోయింది.

మృత్యుంజయరావుగారు ఆమె వెళ్ళిన వైపే చూస్తూ గాఢంగా నిట్టూర్చారు.

వాళ్ళిద్దరూ వయసులో వున్నారు.

ఒకే యింట్లో వున్న తరువాత వారిద్దరి మధ్యా ఆకర్షణ పెరక్కుండా వుంటుందా?

ఉదయ్‌కృష్ణకి అసలు ఏ అమ్మాయిని చూసినా నచ్చదు.

అటువంటిది ఆమెను చూస్తూనే ఆమె ఆకర్షణలో పడుతున్నాడు అంటే.

నిజంగా తను మనస్ఫూర్తిగా సంతోషించ వల సిందే

ఊర్మిళ అందచందాలు అటువంటివి.

తనకొడుకు కళ్ళకి ఈ అమ్మాయి నచ్చుతుంది వాడి ఊహాసుందరిలా వుంది అనుకున్న మాట నిజమే

అయితే ఈ అమ్మాయిని తనయింటి కోడలిగా చేసు కోవటం ఎలా?

ఆ ఒక్క విషయం తప్పితే ఆ అమ్మాయిలో ఈ ఇంటి కోడలిగా కావలసిన అన్ని అర్హతలు వున్నాయి.

అయితే ఆమె ఈ ఇంటికి కోడలు ఎలా అవుతుంది

చూస్తూ చూస్తూ తను ఈ పెళ్ళి ఎలా చేయ గలడు!

ఇప్పుడు ఏమిటి చెయ్యటం!

వీళ్ళిద్దరిమధ్యా ఆకర్షణ పెరక్కుండా మొదట్లోనే తుంచివెయ్యాలి.

ముందు ఊర్మిళ పెళ్ళి శేఖర్‌తో జరిగిపోవాలి.

ఈ సంగతి ఉదయ్‌కృష్ణకి తెలియాలి.

తనకి ఊర్మిళపై కోపం ఏమీ లేదు పైగా ఆ అమ్మాయి అంటే జాలివుంది.

ఆ ఒక్క విషయం తలుచుకుంటుంటే మనసు కలుక్కుమంటుంది.

ఆమె ఈ ఇంటికి కోడలు కాకపోవడానికి కారణం అది ఒక్కటే. కళ్ళమీద చెయ్యి ఆన్చుకున్నారు.

ఆలోచనలతో తల వేడెక్కిపోతుంటే—

## 8

మృత్యుంజయరావుగారు ఆ రాత్రి భోజనాలయ్యాక హాలులో కూర్చుని కొడుకుని రమ్మని కబురు చేశారు.

ఉదయ్‌కృష్ణ తండ్రి దగ్గరకు వచ్చి, పిలిచారా అన్నట్టు చూశాడు.

అలా కూర్చో నీతో మాట్లాడాలి అంటూ చెప్పటంతో తండ్రికి ఎదురుగా సోఫాలో కూర్చున్నాడు.

ఆయన ఏం చెపుతారా అన్నట్టు చూస్తూ—

ఆయన రెండు ఫోటోలు అతని చేతికిచ్చి ఆ యిద్దరి అమ్మాయిల్లో ఎవరు బాగున్నారో చెప్పమన్నారు.

ఫోటోలు చూస్తూనే అతనికి అర్థమైపోయినట్టుగా ముఖం గంభీరంగా మారిపోయింది.



ఫోటోలు అందుకుని సరిగ్గా చూడకుండానే అక్కడ టీపాయ్ మీద పడేశాడు.

"నీకు ఆ ఇద్దరిలో ఎవ్వరూ నచ్చలేదా?" ఆయన కళ్ళల్లో ఆశ్చర్యం తొంగిచూసింది.

నచ్చలేదు అన్నట్టు తల విదిలించాడు.

ఆయన మాట్లాడలేదు. ఇలా వినటం ఆయనకి కొత్త ఏమీ కాదు. పాతకథే మళ్ళీ మొదలయ్యింది.

"ఉదయ్, నీకు ఇక ఏ అమ్మాయి నచ్చుతుంది చెప్పు! ఎన్నాళ్ళు యిలా పెళ్ళి చేసుకోకుండా ఒంటరిగా ఉంటావు చెప్పు!"

అతను మాట్లాడలేదు.

"నీకు ఏ అమ్మాయి అయినా నచ్చితే చెప్పు! వెంటనే వెళ్ళి మాట్లాడుకువచ్చి ముహూర్తం పెట్టించేస్తాను చెప్పు బాబూ!"

తండ్రి అలా అంటుంటే అతని కళ్ళముందు ఊర్మిళ ప్రత్యక్షం అయి చిరునవ్వులు చిందించింది.

ఊర్మిళ తన మనస్సును ఎంతగానో ఆకట్టుకుంది. ఆ విషయం తండ్రికి చెప్పేస్తే?

ఆయన అందుకు అంగీకరిస్తారా?

ముందు ఆమె మనసులో ఉద్దేశం తెలుసుకోవద్దూ!

తనకి ఆమె నచ్చింది, ఆమెకు తను నచ్చాలిగా!

మెల్లగా ఆమె మనసులో ఉద్దేశం కనుక్కోవాలి.

మనసులో అనుకున్నాడు. తండ్రిదగ్గర అసలు ఆమె మాట రానివ్వలేదు.

మృత్యుంజయరావుగారు కొడుకువేపు పరిశీలన చూశారు.

కొడుకు అంతరాంతరాల్లో ఏముందో కనుక్కోవా అన్నట్టు.

ఉదయ్‌కృష్ణ ముఖంలో ఎలాంటిభావం ద్యోతకమ లేదు. అయినా ఊర్మిళ గురించి చెప్పేయటమే మంచి అని ఆయన నిశ్చయించుకుని చెప్పసాగారు.

"ఊర్మిళ తండ్రి, నేనూ చాలా స్నేహంగా వుం వాళ్ళం. ఆ తరువాత అతను ఎక్కడికి వెళ్ళిపోయాడ నాకు కనిపించలేదు. మళ్ళీ పాతిక సంవత్సరాల తరువా అతను నాకు కనిపించాడు. ఎలా అంటే తింటానికి కూడ తిండిలేని పరిస్థితుల్లో వున్నాడు. అతనికి పెళ్ళి అయింది పాతికేళ్ళ కూతురు వుంది భార్యపోయి పది సంవత్సరాల అవుతుందని చెప్పాడు."

"వ్యాపారంలో మొదట చాలా డబ్బు గడించినా తరువాత నష్టం వచ్చి దివాలాతీశాడు. అతను మంచంమీ ఇవాళో రేపో అన్నట్టు వున్నాడు. తన పరిస్థితి అంతా చెప్పి కూతురి బాధ్యత అంతా నాకు అప్పగించి కళ్ళు మూశాడు. ఇక ఆ అమ్మాయికి నా అనేవాళ్ళు లేని ఒంట రిదైపోతే నాకూడా ఇంటికి తీసుకు వచ్చేశాను" అంటూ క్షణం ఆగిమళ్ళీ చెప్పసాగారు.

"కలకత్తాలో వున్న నాస్నేహితుడు కొడుకు శేఖర్‌తో ఆమెకు పెళ్ళి నిశ్చయించేను. రేపు నెలలో పెళ్ళి, ఆ అమ్మా యికి పెళ్ళిచేసి పంపేస్తే నాకు ఇక ఏ బాధ్యత వుండదు" అంటూ కొడుకు ముఖంలోకి చూశారు.



తండ్రి చెప్పే మాటలు వింటూనే అతని ముఖ కవళికలు మారి పోయాయి.

ఏమిటి ఊర్మిళకు పెళ్ళి నిశ్చయం అయిపోయిందా!

ఆకాశంకూలి మీదపడినట్టు అయింది.

ఆ అందాలసుందరి పరాయి సొత్తు అయిపోతుంది అన్నబాధ అతని గుండెల్ని తొలవసాగింది

తండ్రి చెపుతున్న విషయాలు శాంతంగా వింటున్నట్టు నటించటం అతని వశం కావటంలేదు.

ఆయన చెపుతున్నారు, తను ఊ కొడుతున్నాడు.

"ఆ అమ్మాయి వెళ్ళిపోతే ఈఇల్లు మరీ చిన్నబోతుంది. నువ్వు పెళ్ళి చేసుకోక ఎన్నాళ్ళు వుంటావు చెప్పు! నీ పెళ్ళిఅయి నీ భార్య ఈ ఇంట్లో అడుగుపెడ్తే ఈ ఇల్లు ఎంత కళకళ లాడుతుందో నేను వేరే చెప్పనవసరం లేదు."

"నీవు త్వరగా పెళ్ళి చేసుకుని ఈఇంటి బాధ్యతలు మీభార్యాభర్తలు ఇద్దరూ స్వీకరించాలి. అదే నా కోరిక" అన్నారు ఆయన.

ఆయన కంఠస్వరం బరువుగా భారంగా ధ్వనించింది.

ఉదయ్‌కృష్ణ మెల్లగా చెప్పాడు.

"నాన్నగారు! నాకు ఆలోచించుకోవడానికి టైము ఇవ్వండి.

"అలాగే బాబూ! ఆలోచించుకునే చెప్పు" అన్నారు.

ఉదయ్‌కృష్ణ అక్కడినుండి మెల్లగా లేచి నిలబడ్డాడు.

అతని మనసు అంతా ఎలాగో అయిపోతుంది.

కొడుకువైపు చూస్తూ ఆయన చెప్పారు.

"ఊర్మిళ పెళ్ళి దగ్గరకు వచ్చేస్తుంది. నీవు ఏర్పాట్లు కాస్త చూడాలి!"

అతను అలాగే అన్నట్టు తలఊపి అక్కడనుండి గదిలోకి వెళ్ళిపోయాడు.

తను సిద్ధార్థుడు వెళ్ళినట్టు అయితే!

ఈ ఊర్మిళ తనకి అర్ధాంగి అయివుండేది.

ప్చ తనకి ఆ అదృష్టం లేదు.

ఆలోచిస్తున్న అతనికి మెరుపులాంటి ఆలో వచ్చింది.

ఊర్మిళ మనసులో ఉద్దేశం తెలుసుకుంటే!

ఆమెకు ఇష్టం అయితే అప్పుడు ధైర్యంగా తన ని యం తండ్రికి తెలియచెయ్యొచ్చు

ఆమె మనసు తెలుసుకోవటం ఎలా?

ఇన్నాళ్ళు అయింది ఆమె ఎప్పుడూ అనవసరంగ కలిపించుకుని మాట్లాడదు.

ముక్తసరిగా రెండు మాటలు మాట్లాడుతుం అంతే.

అలాంటి అమ్మాయి మనసు తెలుసుకోవాలి అంటే బహుకష్టం. తనే ముఖాముఖీ అడిగి తేల్చేస్తే!

ఆ సంగతి మీ నాన్నగార్ని అడగండి అంటే!

కష్టమే ఇలాంటి అమ్మాయిలతో అన్నీ చిక్కే.

అందంగావున్న అమ్మాయిలు అతిగా మాట్లాడరేమో పలుకే బంగారంలా తూచితూచి మాట్లాడతారు.

అదే అందంగాలేని అమ్మాయిలు మగవాడు పిస్తే చాలు వడవడ వాగి సంగిరి, సంగిరి మాట్లాడతారు.



ఉదయ్‌కృష్ణ మనసులో నిరాశ తొంగిచూసింది.

ఈ పెళ్ళి ఊర్మిళకు ఇష్టం అయితే ఈ పెళ్ళి ఆపించటం బ్రహ్మతరం కూడా కాదు.

ఆలోచిస్తూ అలా మంచంమీద పడుకున్నాడు.

అతని మస్తిష్కంలో అపరిమితమైన అశాంతి చెలరేగింది.

ఆద్యంతాలు లేని ఆలోచనలతో అలా ఆ రాత్రి అంతా గడిపాడు.

# 9

మృత్యుంజయరావుగారు ఊర్మిళ పెళ్ళిపనులు చకచకా చేయిం చేస్తున్నారు.

ఉదయ్‌కృష్ణకి ఎటూ తోచటంలేదు.

ఆ రోజు రాత్రి అతను ఇంటికి వచ్చేసరికి పదిన్నర అయింది.

అందరూ పడుకున్నారు.

ఊర్మిళమాత్రం పడుకోలేదు.

అతని రాకకోసం ఎదురుచూస్తూ కూర్చుంది.

ఉదయ్‌కృష్ణ రావటంతో డైనింగ్ హాలులోకి వెళ్ళింది.

అతను బట్టలు మార్చుకుని డైనింగ్ హాలులోకి వెళ్ళాడు.

ఊర్మిళ ప్లేటుల్లో అన్నీ వడ్డిస్తుంది.

అతను ఆమెవైపు చూస్తూ డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాడు. అన్నం కలుపుకుని నోట్లో పెట్టుకోబో

తూంటే అతనికి గుర్తువచ్చింది. ఆమె భోజనం చేసిందా! లేదా! అని.

ఆమాటే పైకి అన్నాడు.

"మీరు భోజనం చేశారా!"

"లేదు!"

"ఏం ఎందుకంత ఆలస్యం!"

"మీరు భోజనం చేశాక చేద్దామని" అంటూ మెల్లగా చెప్పింది.

ఆమె చెప్పటం ఆ చెప్పేప్పుడు తలవంచుకోవటం అతని మనసులో కోటి కోరికలు తలఎత్తాయి.

ఆమె తన అర్ధాంగి అయినట్టు.

తనకోసం ఆమె భోజనం చెయ్యకుండా ఎదురుచూసినట్టు సినిమా రీల్సులా కళ్ళముందు కదిలింది.

ఆమెమాటలు అతని చెవుల్లో అమృతం పోసినట్టు అయింది.

అయితే అది క్షణంసేపు మాత్రమే.

ఆమె తనకి పరాయి అన్న వూహ రాగానే మత్తు తొలగిపోయి తన మనసులో భ్రమ మాయమయింది.

అతను మౌనంగా భోజనం చేస్తున్నాడు.

ఆమె అతనికి ఏం కావాలో వడ్డిస్తుంది.

కూరలు అతను వద్దు అని చెయ్యి అడ్డుపెట్టినా ఆమె వినకుండా వడ్డించేస్తుంది అతను సరిగ్గా భోజనం చెయ్యటం లేదని గ్రహించి.

ఉదయ్‌కృష్ణ ఆమె చెయ్యి చటుక్కున పట్టి ఆపాడు.

అంతే!



ఆమె అలా బొమ్మలా నిటారుగా నిలబడిపోయింది.

అతని చేతిలో ఆమె చెయ్యి ఇంకా అలా ఇరుక్కునే వుంది.

తలఎత్తి ఆమె కళ్ళలోకి చూశాడు.

అతని చూపులతో తన చూపులు ముడివెయ్యలేనట్టు కనురెప్పలు క్రిందకు వాల్చేసింది.

ఉదయ్‌కృష్ణకి క్షణంసేపు తను ఎక్కడవున్నాడో తెలియని అయోమయ పరిస్థితిలో పడిపోయాడు

ఊర్మిళ చేతిస్పర్శ అతని రక్తంలోకి విస్తరించి గుండెల్లోకి దూసుకుపోయి ఆశలు, కోరికలు, ఆనందం, ఉద్రేకం, ఉద్వేగం ఒక్కసారిగా పొంగి పొర్లిపోయింది

ఆ చేతినిపట్టి దగ్గరకు లాక్కొని గుండెలకు హత్తుకోవాలన్న బలమైన కోరిక అతని హృదయంలో తలఎత్తింది. అతి ప్రయత్నంమీద ఆ కోరికను మనసులోనే గుప్తంగా దాచుకుని ఆమె చెయ్యి వదిలేశాడు.

ఊర్మిళ సిగ్గుతో తల ఎత్తలేక పోయింది.

చెంపలు ఎర్రగా గులాబీల్లా అయ్యాయి

ఇక అక్కడ నిలవలేక పక్కగదిలోకి వెళ్ళిపోయింది.

అతను భోజనం ఎలా ముగించాడో, సింక్ దగ్గరికి వెళ్ళి ఎలా చెయ్యి కడుక్కున్నాడో అతనికి తెలియలేదు. అలవాటు ప్రకారం అతనికాళ్ళు తన గదివైపు నడిచాయి.

* * * *

ఊర్మిళకి ఆ రోజు భోజనం చెయ్యబుద్ధి కాలేదు. చల్లటి మంచినీళ్ళు కడుపునిండా గడగడా త్రాగేసి తలుపులు

దగ్గరకు చేరేసి తన గదిలోకి వెళ్ళి తలుపులు మూసుకుంది. ఆమెకు పడుకోవాలన్న ధ్యాసలేదు.

అలా మంచంమీద కూర్చుంది.

మాటిమాటికి తన కుడిచేతి మణికట్టు దగ్గర చూసుకో సాగింది.

అతని చేతిస్పర్శ ఇంకా అలాగే వున్నట్టు అనిపించ సాగింది. ఆ సంఘటన తలుచుకుంటుంటే ఆమె చెంపలు మాటిమాటికి ఎర్రబడ సాగాయి.

ఏమిటి ఈరోజు ఎన్నడూ లేంది తన మనసు ఇలా అయిపోతుంది!

తనని చేరదీసి ఇంట్లో పెట్టుకున్నందుకు వాళ్ళ అబ్బాయినే తను ప్రేమించటమా!

ఉదయ్‌కృష్ణ ఎక్కడ? తను ఎక్కడా! తన మనసులో ఈ ఆలోచన ఎవరికైనా తెలిస్తే నలుగురూ నవ్వుకోరూ!

ఏమిటి ఈరోజు తన మనసు చిత్రంగా మారిపోయింది.

ఏ పురుషుడ్ని చూసి చలించని తన మనసు ఇంత తేలిగ్గా లొంగిపోతుంది ఏమిటి?

బురదలో పుట్టిన ఎర్రకలువను.

అతను ఆకాశంలో అందరాని చందమామ.

అతన్ని తన మనసు కోరుకోవటమా!

కలువలు ఎప్పుడూ చంద్రుడ్ని ప్రేమించటం నిరా పడి వడిలివాడి పోవటం సహజం.



తెలిసి తెలిసీ తనూ అదే దారిలో నడవటం తెలివి తక్కువ తనం. మృత్యుంజయరావుగారు చెప్పినట్టు శేఖర్ని పెళ్ళి చేసుకుని జీవితం సాగించటమే ఉత్తమం.

అదే మంచిమార్గం.

మనసులో గట్టిగా నిశ్చయించుకుంది.

అయినా పడుచు గుండెలో కోరికలకి కళ్ళేలు వుండవు.

కాస్త అదిలిస్తే చాలు జాంమని పరుగు లంకించుకుంటాయి.

ఊర్మిళ అతన్ని ఎంత మరిచిపోవాలన్నా సాధ్యం కావటం లేదు.

ఆమె గుండెలో చోటుచేసుకుని గుసగుస లాడ సాగాడు.

వారంరోజుల తరువాత.

మృత్యుంజయరావుగారు ఊర్మిళని పిలిచి డబ్బు ఇచ్చి నీకు నచ్చిన చీరలు కొని తెచ్చుకోమన్నారు.

ఆమె మౌనంగా ఆ డబ్బు తీసుకుంది.

ఆయనమాట కాదనే ధైర్యం లేదు.

బీరువాలో చాలా చీరలువున్నాయి. ఇంకా కొనుక్కోవటం దేనికి?

అయిష్టంగా తీసుకుంది ఆ డబ్బు.

జాలితో చాలాడబ్బు ఖర్చుచేసి పెళ్ళి చేస్తున్నారు. ఇంకా వాళ్ళచేత డబ్బు ఖర్చుచేయించటం ఆమెకు ఇష్టం లేదు.

ఈ పెళ్ళి ఏదో త్వరగా అయిపోతే బాగుండును అనిపిస్తుంది.

అతని చూపులు అతని చిరునవ్వు తనని ఇరవై నాలుగు గంటలూ వెంటాడుతూనే వుంటాయి

అతన్ని పూర్తిగా మర్చిపోవాలి అంటే ఈ పెళ్ళి జరిగిపోవాలి.

శేఖర్ ప్రేమలో తను కరిగిపోవాలి.

అంతే అప్పుడే తను ఉదయ్‌కృష్ణని మర్చిపోగలుగుతుంది.

బరువుగా శ్వాస తీసుకుంది.

ఏమిటి! తన జీవితం అనుకోని మలుపు ఇలా తిరిగింది.

ఈ పెళ్ళి జరగటం తన అదృష్టమా!

నిజం చెప్పాలి అంటే శేఖర్‌ని పెళ్ళి చేసుకోవటం తనకి ఇష్టంలేదు. అయినా పెళ్ళిచేసుకోక తప్పదు.

ఉదయ్‌కృష్ణ రూపం కళ్ళముందు నిలిచింది.

ప్రేమానురాగాలతో తనవైపే చూస్తున్నట్టుగా అనిపిస్తుంది ఆమెకు.

## 10

ఆరోజు సాయంత్రం షాపుకి వెళ్ళడానికి ఊర్మిళ ముస్తాబు అవసాగింది.

స్నఫ్‌కలర్ జార్జెట్ చీరకు లైట్ బోర్డర్‌పైన డార్క్ పింక్ ఫ్లవర్స్‌వున్న చీర కట్టింది. దానికి మ్యాచింగ్ స్నఫ్ కలర్ పొడవుచేతుల జాకెట్ వేసుకుంది.



మెడలో డార్క్ పింక్ పూసలదండ, దానికి మ్యాచింగ్ పూసల లోలాకులు పెట్టుకుంది.

కుడిచేతికి బంగారు గాజులతోపాటు స్నఫ్‌కలర్, లైట్ డార్క్ పింక్ గాజులు వేసుకుంది.

ఎడంచేతికి వైట్‌స్ట్రాప్‌తో రవుండ్ వాచీ పెట్టుకుంది.

నుదుట డార్క్ పింక్ శింగార్ కుంకుమ పెట్టుకుంది.

పెదవులకి లిప్‌స్టిక్, కళ్ళకి కాటుక తీర్చిదిద్దింది.

ఆ అలంకరణలో ఆమె ఇంకా అందంగా, బొమ్మలా మెరిసిపోతుంది.

ముస్తాబు ముగించి డ్రెసింగ్ టేబుల్ దగ్గరనుండి లేచింది.

మృత్యుంజయరావుగారు పనిమీద ఎక్కడికో వెళ్తూ ఆమెకు చెప్పారు.

నేను వెళ్ళి కారు పంపిస్తాను. నీవు షాపుకి వెళ్ళి నీకు ఏం కావాలో కొని తెచ్చుకో అని!

ఆమె అలాగే అంది.

ఆ టైముకి ముస్తాబు అయి సిద్ధంగావుంది.

అయినా కారు రాలేదు.

టైము అవుతుంది. అయినా డ్రైవర్ కారు తీసుకురాలేదు.

ఉదయ్‌కృష్ణ అరగంట క్రితమే యింటికి వచ్చాడు.

ఎవరో ఫ్రెండ్స్ వస్తే హాలులో కూర్చుని మాట్లాడుతున్నాడు.

అంతలో ఫోన్ రింగ్ అయితే వెళ్ళి రిసీవర్ అందుకున్నాడు "హాల్లో" అంటూ.

"నేనండీ డ్రైవర్ అప్పారావుని మాట్లాడుతున్నాను" అన్నాడు ఫోన్‌లో అతివినయంగా.

"ఊ ఏమిటి!" అడిగాడు.

"అమ్మాయిగారు షాపుకి వెళ్ళాను కారు తెమ్మన్నారండి. అయ్యగార్ని దిగబెట్టేసి కారు తీసుకు వస్తుంటే కారుకి చిన్న రిపేరు వచ్చిందండి. బాగవడానికి కనీసం గంట అయినా పడుతుందండి. ఆ విషయం అమ్మాయిగారికి చెపుదామనే ఫోన్ చేశానండి" అంటూ ఫోన్ పెట్టేశాడు.

ఉదయ్‌కృష్ణ ఫోన్ పెట్టేస్తూ క్షణంసేపు ఆలోచించాడు.

తనలోతను ఏదో ఆలోచిస్తున్నట్టుగా తలపంకించి వెళ్ళి సోఫాలో కూర్చున్నాడు.

వచ్చిన ఫ్రెండ్స్ పావుగంట కూర్చుని వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళిన తరువాత అతను ఆమె గది వద్దకు వెళ్ళి "ఊర్మిళా!" అంటూ పిలిచాడు.

ఆ పిలుపు వింటూనే ఆమె ఉలిక్కిపడింది. ఆ కంఠస్వరం ఎవరిదో గుర్తించి.

ఈ యింటికి వచ్చి ఇన్ని రోజులు అయినా ఒక్కసారి అతను తనని పేరుపెట్టి పిలవలేదు, గదివద్దకు రాలేదు.

ఆశ్చర్యంగా గుమ్మంవద్దకు వెళ్ళింది.

అతను ఆమె అలంకరణను ఒక్క క్షణం రెప్పవాల్చకుండా చూశాడు.



Cultural Association NANDYAL - 518

వెంటనే అతని ముఖం గంభీరంగా

"కారుకి రిపేరు వచ్చిందట బాగవడానికి ఒకగంట పడుతుందట అప్పారావు ఫోన్ చేసి చెప్పాడు."

"అలాగా ఇంకా కారు తీసుకువస్తాడని నేను చూస్తున్నాను" అంది ఏదో ఆలోచిస్తూ.

"నీకు అభ్యంతరం లేకపోతే నా కారులో తీసుకెళతాను" వస్తావా అన్నట్టు చూశాడు

అతను నీవు అనటంలో తనపై అతనికేదో అధికారం ఉన్నట్టే మాట్లాడుతున్నట్టు అనిపించసాగింది.

అతనితో వెళితే మృత్యుంజయరావుగారు ఏమైనా అనుకుంటారేమో!

కారుకి రిపేరువస్తే! కారు బాగయినదాకా వుండకుండా తన కొడుకు కారులో షాపుకి వెళ్ళింది అనుకుంటే! అది తనకు ఇష్టంవుండదు.

ఉదయ్‌కృష్ణకి ఏం చెప్పాలో అర్థంకాక క్షణంసేపు తటపటాయించి మెల్లగా అంది.

"ఈరోజే వెళ్ళాలనిలేదు పోనీ రేపు వెళతాను" అంటూ చిన్నగా నవ్వింది.

"ఇప్పుడు నాకూడా వస్తే ఏం! నన్నూ ఒక డ్రైవర్‌గానే అనుకోండి" అన్నాడు.

అతని మాటలకి చివ్వున తలెత్తి చూసింది.

ఉదయ్‌కృష్ణ నవ్వుకున్నాడు.

అతని నవ్వు వెన్నెల కురిసినట్టు అందంగా వుంది.

ఆ నవ్వు ఆమె గుండెలోకి దూసుకుపోయి మెత్తగా తాకినట్టు వుంది.

"ఏమిటి ఆలోచిస్తున్నావు! వస్తావా రావా?" అంటూ చొరవగా ఎన్నిరోజులగానో చనువున్నట్టు మాట్లాడటంతో ఇక అతనిమాట తీసేయలేక బయులు దేరింది.

ఆమె కారు వెనుక సీట్లో కూర్చోబోతుంటే,

అతను ఫ్రంట్ డోరు తెరిచి పట్టుకున్నాడు.

ఇక తప్పదు అన్నట్టు ముందు సీట్లో కూర్చుంది.

ఉదయ్ కృష్ణ కారు డోరుమూసి అటు తిరిగివచ్చి డ్రయివింగ్ సీట్లో కూర్చుని కారు స్టార్టు చేశాడు.

కారు తిన్నగా బీచ్ రోడ్ పట్టింది.

ఊర్మిళకి మొదట అతను కారు ఎటు తీసుకెళుతున్నాడో అర్థంకాలేదు.

అర్థం అయ్యాక అతనివైపు కంగారుగా చూసింది.

ఇదేమిటి కారు యిటు పోనిస్తున్నారు? మనం వెళుతున్నది పాపుకి కాదా! అన్నట్టున్నాయి ఆమె చూపులు.

ఉదయ్ కృష్ణ తలతిప్పి చిరునవ్వు నవ్వుతూ ఎడం చెయ్యి చాపి ఆమె చెయ్యందుకున్నాడు.

"ఊర్మిళా! నీతో ప్రత్యేకంగా మాట్లాడాలి, అన్న ఉద్దేశ్యంతో నా వెంట తీసుకువచ్చాను. పాపుకి రేపు వెళదాం" అంటూ ఆమె చేతిని మృదువుగా నొక్కి విడిచి పెట్టాడు

ఊర్మిళ మాట్లాడలేదు.

కారు తిన్నగా బీచ్ కి దారితీసింది.

ఒక పక్కగా కారాపి యిద్దరూ కారుదిగి నడిచి వెళ్ళారు. జనం ఎవ్వరూ లేనిచోట నిర్మానుష్యంగా వున్న చోట ఇద్దరూ కూర్చున్నారు.



అంభోధి అంచులకి ఎగిసిపడుతున్న కెరటాలవైపు అలా రెప్పవాల్చకుండా చూస్తూ మౌనమూర్తిల్లా కూర్చున్నారు.

ఆ అగాధ సాగరంలా ఊర్మిళ మనసులో లోతు తెలుసుకోవడం కష్టమనిపించసాగింది అతనికి.

ఇతనితో పరిచయం పెంచుకుని చనువు పెంచుకుంటే!

ఆ చనువు ప్రేమగా మారి ప్రేమ పెళ్ళికి దారితీస్తే!

మృత్యుంజయరావుగారు తన గురించి ఏమనుకుంటారు?

దిక్కులేనిదాన్ని జాలితో చేరదీస్తే ఆఖరికి పాముకి పాలుపోసినట్టు అయింది అని అనుకోరూ!

అలలవైపు చూస్తూ ఆలోచనలో పడిపోయింది ఆమె.

"ఊర్మిళా!" మార్దవముతో నిండిన ఆ కంఠస్వరంలో మమతానురాగాలు నిండుగా తొణికిసలాడుతున్నాయి.

అతని పిలువు ఆమె చెవులో అమృతం పోసినట్టు మధురాతి మధురంగా వినిపించింది.

గుండెల్లో పన్నీటిజల్లు కురిసినట్టు అయింది.

శేఖర్ తో మాట్లాడుతుంటే కలగని అనుభూతి ఇతనితో మాట్లాడుతుంటే మనసు గాలిలో దూది పింజంలా పైకి ఎగిరిపోతుంది.

"నీతో ఒక విషయం మాట్లాడాలని" అంటూ ఆమె వైపు చూశాడు.

"చెప్పండి ఏమిటో!" అతి మెల్లగా వినీ వినిపించనట్టుగా అంది.

"శేఖర్‌తో నీ పెళ్ళి నిశ్చయం అయిందని నాన్నగారు చెప్పారు."

ఆమె తల భూమిలోకి కృంగిపోయినట్టు అయింది.

ఆ పెళ్ళిమాట తలుచుకుంటుంటే తనకే ఎలాగో వుంది. అతని నోటి వెంట వినటం ఆమె విని భరించలేక పోతుంది.

మౌనంగా తలవంచి అలా కదలకుండా బొమ్మలా కూర్చుంది

"నీవు ఈ పెళ్ళికి మనస్ఫూర్తిగా ఒప్పుకున్నావా?" సూటిగా వచ్చిన ఆ ప్రశ్నకి ఆమెకు వెంటనే ఏం సమాధానం చెప్పాలో తోచలేదు.

"చెప్పు ఊర్మిళా!"

"చెప్పినందువలన ప్రయోజనం!" ఈసారి ఆమె సూటిగా ప్రశ్నించింది.

ఆమె ప్రశ్నకి అతను ఈసారి తడబడినట్టు అయ్యాడు

"స్నేహితుడిగా నీకు నేను ఏమయినా సహాయము చెయ్యగలనేమో అని" అంటూ చూపులు మరోవైపుకి తిప్పుకున్నాడు. ఆమెవైపే చూస్తే దొరికిపోతానేమో అన్నట్టు.

"సహాయం అంటే?"

ఈసారి అతను మాట్లాడలేదు. మౌనంగా వుండిపోయాడు.



తెలివయిన అమ్మాయితో మాట్లాడటం బహుకష్టం. వాళ్ళతో మాటల్లోకి దిగటం అంత తెలివితక్కువతనం మరొకటి ఉండదేమో.

ఈమెను తనతో ఇక్కడికి తీసుకురావటం తెలివి తక్కువ పని చేశానేమో అని మనసులో విసుక్కున్నాడు.

అతను మౌనంగా వుండిపోవటం చూసి మెల్లగా అంది. "చూడండి ఉదయ్‌కృష్ణగారూ! పెళ్ళి అనేది ఎప్పుడు ఎవరితో ఎక్కడ ముడిపడుతుందో ఎవ్వరికీ తెలీదు. అది మన చేతిలో లేదు, మన ఇష్టం కాదు. ఇప్పుడు ఈ పెళ్ళి నాకు ఇష్టం లేదు అని చెప్పినంతలో ఆగిపోతుంది అంటారా! నాకు ఫలానా అతను ఇష్టం అని చెపితే ఆ పెళ్ళి జరిగిపోతుంది అంటారా! అంతా నుదుటిరాత. ఆ రాతలో ఎలావుందో అలా జరుగుతుంది. అంతే" ఆమె ఆ మాట ఎంతో శాంతంగా చెప్పినా ఆ మాటల్లో నిజం ఎంతో వుంది.

తను అడిగిన ప్రశ్నకే సమాధానం చెప్పింది.

అయితే ఆమె మనసులో ఉద్దేశం మాత్రం తెలియ చెయ్యలేదు.

ఎంత తెలివిగా మాట్లాడింది.

ఇక ఇప్పుడు ఈ అమ్మాయితో నువ్వు అంటే నాకు ఇష్టం అని ఏం చెపుతాడు!

చెప్పినా ఒకటే సమాధానం వస్తుంది.

ఇలాటి అమ్మాయిలతో ఒంటరిగా మాట్లాడి మనసులో విషయం తెలుసుకోవాలని ఆరాటపడటం హాస్యాస్పదమే అవుతుంది.

ఇక ఈ విషయం ఇంతటితో ఆపేస్తే మంచిదేమో! తనపెళ్ళా! ఇక ఈ జన్మకి అంతే.

ఇలాటి అమ్మాయికోసం తను ఎన్నాళ్ళో గాలిం చాడు.

తీరా అలాంటి అమ్మాయి కనిపించేసరికి, ఆమె పరాయిసొత్తు అయిపోతుంది.

ఇక ఈ అమ్మాయితో పెళ్ళి గురించి మాట్లాడి తర్కించటం అనవసరం అని గట్టిగా నిశ్చయించుకున్నాడు.

కాస్సేపు ఇద్దరిమధ్యా మౌనం రాజ్యం చేసింది.

కొద్దిసేపు ఎవ్వరూ ఏం మాట్లాడుకోలేదు.

మొదట ఉదయ్ కృష్ణే అన్నాడు

“టైము అయింది, ఇక ఇంటికి వెళ్దామా!”

ఆమె తలవూపి లేచి నిలబడింది. చీరకంటిన ఇసుక దులుపుకని చీర కుచ్చిళ్ళు సరిచేసుకుంది.

అతను లేచి నిలబడ్డాడు.

కోటు చేతిమీద వేసుకుని ఠీవిగా ఒక్కో అడుగు వేస్తూ ముందుకి నడవసాగాడు.

ఊర్మిళ పొడవుగా వున్నప్పటికీ అతని దగ్గర పొట్టి అనే అనిపిస్తుంది.

ఒడ్డూ, పొడుగులో దర్జాగావున్న అతని పక్క సన్నగా, నాజూగ్గా బొమ్మలా నడుస్తుంటే,

బీచ్ కి వచ్చినవాళ్ళు వీళ్ళ జంటని మెచ్చుట చూడసాగారు.

అది అతను, ఆమెకూడా గమనించలేదు.



కారులో ఇంటికి బయలుదేరారు. కారులో ఇద్దరూ ఒక్కమాట కూడా మాట్లాడుకోలేదు.

ఇద్దరూ ఇంటికి వెళ్ళేసరికి మృత్యుంజయరావుగారు ఇంకా ఇంటికి రాలేదు.

ఆయన వచ్చేసరికి రాత్రి పన్నెండు గంటలు అయింది.

# 11

మృత్యుంజయరావుగారు ఇంటికి ఆలస్యంగావస్తే అంతవరకూ ఊర్మిళ నిద్రపోకుండా భోజనం చెయ్యకుండా కూర్చుంటుంది.

ఆయన అది గమనించి ఆమెకు చెప్పారు.

నేను రాత్రి పది తరువాత ఇంటికివస్తే భోజనం చెయ్యను. నాకోసం చూడొద్దు అని.

ఆమె అలాగే అని తల వూపింది.

అప్పటినుండి ఆయన ఇంటికి ఆలస్యంగా వస్తే ఆమె ఎదురు చూడటం మానేసింది.

మృత్యుంజయరావుగారికి ఊర్మిళ అంటే రాను రాను మంచి అభిప్రాయం ఏర్పడసాగింది.

ఆ అమ్మాయి మంచితనం గుర్తిస్తూ జాలి, అభిమానం ఎక్కువ కాసాగాయి

ఆరోజు వాళ్ళు ఇద్దరూ కలిసి వెళ్ళటం ఆయనకి తెలీదు.

మర్నాడుకూడా ఆ విషయం ఆయనతో ఎత్తలేదు ఊర్మిళ కూడా చెప్పలేదు.

ఆయనకి చెపుదామని నోటిదాకావచ్చి ఆగిపోయింది చెపితే ఆయన ఏమనుకుంటారో అన్న భయం ఆమె మనసులో మెరమెరలాడింది.

మృత్యుంజయరావుగారు ఆరోజు ఎక్కడికో వెళుతూ ఆమెకు చెప్పారు.

"నిన్న నువ్వు షాపుకి వెళ్ళలేదు అనుకుంటాను డ్రైవర్ చెప్పాడు. కారు రిపేరుకి ఇవ్వటంవలన ఇంటి కారు తీసుకెళ్ళలేదని ఈరోజు కారు పంపిస్తాను షాపు వెళ్ళు" అంటూ. ఊర్మిళ అలాగే అన్నట్టు తల వూపింది.

* * * *

ఊర్మిళ ఆరోజు సాయంత్రం ఒక్కర్తే కారులో వెళ్ళింది షాపుకి.

టైము ఎనిమిదిన్నర అవుతుండగా ఆమె షాపునుండి తిరిగి వచ్చింది. ఆమె ఇంటికి వచ్చేసరికి మృత్యుంజయరావుగారు వచ్చేసి తన గదిలో పడుకుని వున్నారు.

రాగానే నౌకర్ని అడిగింది.

"అయ్యగారు ఇంటికి వచ్చేశారా?"

"అవునమ్మా, ఒంట్లో బాగోలేదని పడుకున్నారు"

"అరే" అంటూ ప్యాకెట్లు తీసుకెళ్ళి గదిలో పెట్టమని నౌకర్‌కి చెప్పి ఆమె ఆయన గదిలోకి వెళ్ళింది కంగారు పడుతూ.

ఆయన కళ్ళు మూసుకుని పడుకున్నారు.



"మావయ్యగారూ!" అంటూ పిలిచింది.

"ఏమమ్మా!" అంటూ కళ్ళువిప్పి చూశారు.

"మీరు ఒంట్లో బాగోలేదని నౌకర్లు చెప్పారు."

ఆయన చిన్నగా నవ్వారు.

"కొద్దిగా జ్వరం తగిలినట్టువుంటే ఇంటికి వచ్చేశాను. కాస్సేపు పడుకుంటే అదే తగ్గిపోతుంది" నువ్వు కంగారు పడవలసింది ఏంలేదు, మామూలుగానే వుంది అన్నట్టు తేలిగ్గా చెప్పారు.

"మీరు ఈ మధ్య వేళకి సరిగ్గా భోజనం చెయ్యటం లేదు" అంది. ఆ జ్వరం అందుకే వచ్చింది అన్నట్టు.

ఆయన నవ్వారు. ఆ నవ్వులో నేను అంటే నీకు ఎంత అభిమానం! అన్న భావం వెల్లడవుతుంది.

"కొద్దిగా జ్వరం తగిలింది అంతే. నాకు బాగానే వుందమ్మా!"

"ఇప్పుడు మీరు ఏం తీసుకుంటారు?"

"వట్టి హార్లిక్స్ తీసుకుంటాను అంతే."

తలవూపి వెనుతిరగబోతూ ఆగి అంది.

"ఉండండి, డాక్టర్‌గారికి ఫోన్ చేసి వస్తాను. వారు చూసి వెళ్ళాక హార్లిక్స్ తీసుకుందురుగాని."

"ఎందుకమ్మా ఇప్పుడు డాక్టర్‌కి ఫోన్ చెయ్యటం. నాకు బాగానే వుందని చెపుతున్నాగా!" అన్నారు తెచ్చి పెట్టుకున్న విసుగుతో.

ఊర్మిళ ఆయన మాటలని లక్ష్యపెట్టలేదు.

వెళ్ళి డాక్టర్‌కి ఫోన్ చేసివచ్చి ఆ గదిలో కూర్చుంది.

పావుగంట తరువాత డాక్టర్ వచ్చి చూశాడు.

"లైట్ ఫీవర్. అంతే. మరేం కంగారుపడవలసింది లేదు." అంటూ ఆయనకి ఇంజక్షన్ చేశాడు.

మందులు వ్రాసియిచ్చి మూడుపూటలా వాడమన్నాడు.

ఆయన్ని కదలకుండా నాలుగురోజులు మంచంమీదే అలా రెస్టు తీసుకోమన్నాడు.

డాక్టర్ వెళ్ళిపోతుంటే అప్పుడే ఉదయ్‌కృష్ణ ఇంటికి వచ్చాడు.

డాక్టర్‌ని చూస్తూనే అతను కంగారుపడ్డాడు.

తండ్రికి కొద్ది జ్వరం తగిలింది అంతే. అని డాక్టర్ తనకి ధైర్యం చెప్పిందాకా అతని మనసు కుదుటపడ లేదు.

డాక్టర్ అరవింద్‌కుమార్‌కి, ఉదయ్‌కృష్ణకి బాగా స్నేహం. ఇద్దరిదీ ఇంచుమించు ఒకటే వయసు. అతనికి పెళ్ళి అయింది. ఇద్దరు పిల్లలుకూడా ఉన్నారు.

అరవింద్‌కుమార్ తండ్రికూడా డాక్టరే మృత్యుంజయరావుగారికి ఆయనకి బాగా స్నేహం. వీళ్ళ ఫేమిలీ డాక్టర్ ఆయన.

ఆయన పోవటంతో కొడుకు చూసుకుంటున్నాడు హాస్పటల్‌ని. డాక్టర్ వెళ్ళిపోయాడు.

ఉదయ్‌కృష్ణ తండ్రి గదిలోకి వెళ్ళి కాస్సేపు ఆయనతో మాట్లాడి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

ఊర్మిళ మాత్రం ఆయనకు ఏం కావాలో చూస్తూ ఆ రాత్రి అంతా ఆమె నిద్రపోలేదు.

ఉదయ్‌కృష్ణకి నిద్రపట్టక గది బయటకు వచ్చి మేడ మీదనుండి క్రిందకు చూశాడు.



తండ్రి గది తలుపులు దగ్గరికి చేరేసివున్నాయి.

ఇవతల పైటచెంగు పరుచుకుని క్రిందపడుకుని వుంది ఊర్మిళ. ఆయన దేనికయినా పిలిస్తే తను గదిలో వుంటే వినిపించదు అని గుమ్మం ఇవతల క్రింద పడుకుంది.

ఉదయ్‌కృష్ణలో ఆమెపట్ల కృతజ్ఞతాభావం నిండిపోయింది.

కన్న కొడుకుకంటే ఆమె ఎక్కువగా ఆయన్ని శ్రద్ధగా చూస్తుంది.

ఊర్మిళ ఈ ఇంటికి కోడలు అయితే!

ఈ ఇల్లు ఎంత మారిపోతుంది!

ఈ ఆలోచన తన తండ్రికి తట్టలేదా? కొడుక్కి ఎక్కడో సంబంధం చూడడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఇంత అభిమానంగా ఈయన్ని చూసినట్టు మరే అమ్మాయి చూస్తుంది!

ఆలోచిస్తూ ఆమెవైపు ఒకసారిచూసి తిరిగి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

మృత్యుంజయరావుగారికి ఆమె రాత్రి అంతా గది అవతల క్రింద పడుకుందని తెలియదు.

అయినా ఆమె తనయందు అభిమానంతో శ్రద్ధగా సేవచెయ్యటం చూసి మనసులో ఎంతగానో ఆనందించారు.

ఆయన మంచంమీదనుండి లేచి మామూలుగా తిరుగుతుంటే ఊర్మిళ ఒప్పుకోలేదు.

ఆయన్ని మంచం దిగనివ్వకుండా ఒక వారంరోజులు అలా మంచం మీదనుండి కదలనివ్వకుండా సేవచేసింది.

మృత్యుంజయరావుగారికి ఇప్పుడు ఒంట్లో కులాసాగానే వుంది.

ఆయన మామూలుగా తన పనులు తను చూసుకుంటున్నారు.

ఉదయ్‌కృష్ణ మనసులో ఊర్మిళగూర్చిన ఆలోచన చెరిగిపోలేదు.

ఆమె మనసు తెలుసుకోవటం ఎలా!

ఇదే ప్రశ్న అతన్ని ఇరవైనాలుగు గంటలూ వేధిస్తుంది.

## 12

మృత్యుంజయరావుగారు అర్జంటు పనిమీద పూనా వెళ్ళవలసి వచ్చింది.

వాళ్ళతో కొన్ని విషయాలు పర్సనల్‌గా మాట్లాడవలసిన కారణంగా ఆయన ఆ మర్నాడు ప్రయాణం అయి వెళ్ళారు.

పెళ్ళిపనులు ఏమేమి చేయాలో అన్నీ కొడుక్కి చెప్పి వెళ్ళారు.

ఊర్మిళ ఉదయ్‌కృష్ణ ఇంట్లో వున్నంతసేపూ అతని కళ్ళకి కనిపించకుండా తన గదిలోనే వుంటుంది.

లేదా వంటవాళ్ళకి ఆరోజు ఏం వండాలో చెపుతుంది. అక్కడినుండి ఇవతలకి రాదు.



తండ్రి పూనా వెళ్ళటం అతనికి మనసులో చాలా సంతోషం అయింది.

ఆయన వైజాగ్ రావడానికి ఒక వారంరోజులు అయినా పడుతుంది.

ఊర్మిళతో చనువుగా మాట్లాడవచ్చు అనుకున్నాడు.

అయితే అతని ఊహలు అన్నీ తలక్రిందులైనట్టు ఆమె అసలు మాట్లాడటం లేదు సరికదా, కళ్ళకు కనిపించటం మానేసింది.

ఆరోజు పదకొండు గంటలకు ఎక్కడికో వెళుతూ నౌకర్ని పిలిచి ఒక కప్పు టీ తీసుకురమ్మన్నాడు.

లోపలకు వెళ్ళిన నౌకరు వట్టి చేతుల్తో తిరిగివచ్చాడు.

టీకోసం చూస్తున్న అతను నౌకరు వట్టి చేతులతో నిలబడటం చూసి కోపంగా అడిగాడు.

"నీకు నేను ఏమని చెప్పాను!"

"టీ తీసుకురమ్మని చెప్పారు కాని అమ్మాయిగారు టీ ఇవ్వను అనేశారండీ!"

ఏం ఎందుకు ఇవ్వను అంది అన్నట్టు చూశాడు.

"అస్తమానూ టీ త్రాగటం ఆరోగ్యానికి మంచిది కాదు. వెళ్ళి నేను చెప్పేనని చెప్పు అన్నారండి."

ఉదయ్‌కృష్ణ ఇక ఏం మాట్లాడలేదు.

తన అలవాట్లు అన్నీ చాలా మార్పించేసింది.

అందమైన అమ్మాయిలు ఏం చెప్పినా వినవలసిందే కాబోలు. వాళ్ళు ఏం మంత్రం వేస్తారో! వాళ్ళ మాటకి ఎదురు చెప్పబుద్ధి పుట్టదు.

తనలో తను నవ్వుకుని టీ మాటమరిచి వెళ్ళిపోతుంటే మరో నౌకరు వచ్చి చెప్పాడు.

"మిమ్మల్ని భోజనానికి త్వరగా వచ్చేయమ్మని అమ్మాయిగారు మీతో చెప్పమన్నారండీ!"

అలాగే అన్నట్టు తలఊపి వెళ్ళిపోయాడు.

* * * *

ఆ రోజు సాయంత్రం ఉదయ్‌కృష్ణ ఎక్కడికో వెళ్ళి మళ్ళీ వెంటనే యింటికి వచ్చేశాడు.

ఊర్మిళ ఎవరు వస్తున్నారా అని హాలులోకి తొంగి చూసింది.

ఉదయ్‌కృష్ణ ఎటూ చూడకుండా తిన్నగా లోపలికి రావటం కనిపించింది.

అర్జంటు పనివుంది వెళ్తాను అన్న మనిషి ఎందుకు తిరిగొచ్చేసినట్లు ఆమెకు అర్థంకాలేదు.

నుదురు చిట్లించి అతనివైపే చూడసాగింది.

అతను ఇదేం గమనించనివాడిలా మేడ మెట్లవైపు దారితీశాడు.

పర్లే ఏదో మర్చిపోయి వుంటాడు. అందుకే తిరిగి వచ్చాడు అని ఆమె వెనుతిరిగింది.

అంతలో మేడమెట్లుఎక్కుతున్న వాడల్లా "అమ్మా!" అన్నాడు గుండెలపై చెయ్యి వేసుకుంటూ.

ఊర్మిళ చటుక్కున తలతిప్పి చూసింది.



అతను గుండెలపై ఎడంచెయ్యి ఆన్చుకుని కుడిచేత్తో రైలింగ్ పట్టుకుని ఒక్కో మెట్టూ మెల్లగా అతికష్టం మీద ఎక్కుతున్నాడు.

ఏమైంది అతనికి! ఊర్మిళ కంగారుగా ఒక గెంతు గెంతినట్టు మేడమెట్లు దగ్గరకు పరుగున వెళ్ళి,

"ఏవండీ! ఏమైంది!" అనడిగింది.

అతను జవాబు ఇవ్వలేదు. తల విదిలించాడు ఏంలేదు అన్నట్టు.

ఆమెకు ఏం అనాలో తోచలేదు.

ఉదయ్‌కృష్ణ నాలుగు మెట్లు మెల్లగా ఎక్కాక మళ్ళీ "అమ్మా!" అన్నాడు భరించరాని బాధగా.

ఈసారి ఊర్మిళ అలా నిలబడలేదు గబగబా మేడ మెట్లు ఎక్కి అతని చెయ్యి పట్టుకుంది.

"ఏమిటి అలా అంటున్నారు!" అడిగింది కంగారుగా.

"గుండెల్లో కొద్దిగా నొప్పి వస్తుంటే" అన్నాడు మెల్లగా.

"పదండి కాస్సేపు పడుకుందురుగాని" అంటూ అతని చెయ్యి పట్టుకుని గదిలోకి తీసుకెళ్ళింది.

మంచంమీద అలసటగా పడుకున్నాడు కళ్ళు మూసుకుని.

ఊర్మిళ మెల్లగా అతని కాళ్ళ బూట్లువిప్పి మేజోళ్ళు తీసింది. ఆమె బూట్లు విప్పుతున్నా అతనికి తెలివిలేనట్టు పడివున్నాడు. బూట్లుతీసి జోళ్ళ స్టాండ్ మీద పెట్టి అతని దగ్గరగా వెళ్ళి గుండెలపై చెయ్యివేసి మెల్లగా రాసింది.

అతను కళ్ళువిప్పి ఆమెవైపు చూశాడు.

"ఎలా వుంది? నొప్పి తగ్గిందా?" ఆతృతగా అడిగింది. లేదన్నట్టు తల తిప్పాడు.

"ఉండండి. డాక్టర్‌కి ఫోన్ చేసి వస్తాను" అంది వెళ్ళబోతూ. చటుక్కున ఆమె చెయ్యిపట్టి ఆపి మెల్లగా అన్నాడు.

"వద్దు అంతగా కావలిస్తే రేపు చేద్దువుగాని"

"ఉండండి రేపు ఏమిటి! అంతవరకూ ఇలా బాధపడతారా!" కాస్త కోపంగా అని అతని చెయ్యి వదిలించుకుని అవతలకు వెళ్ళింది.

డాక్టర్‌కి ఫోన్ చేసివచ్చి అక్కడ కుర్చీలో కూర్చుంది.

పావుగంట దాటిన తరువాత డాక్టర్ అరవింద్ కుమార్ వచ్చాడు.

వస్తూనే స్నేహితుడ్ని చూసి ఆశ్చర్యపోయాడు.

"నీకు గుండెల్లో నొప్పి రావటం ఏమిటి!" అంటూ మంచంమీద కూర్చుని స్టెతస్కోప్ అతని గుండెలపై ఆన్చి పరీక్షించసాగాడు.

పరీక్షిస్తున్న అతని కనుబొమ్మలు ఎందుకనో ఒక్కసారి ముడిపడ్డాయి.

"నీకు గుండెల్లో నొప్పి ఇంతకుముందు ఎప్పుడయినా వచ్చిందా? లేక ఇదే రావటమా?"

"లేదు యిదే రావటం" అంటూ ముక్తసరిగ చెప్పాడు. డాక్టర్ అతన్ని ఊపిరి గట్టిగా పీల్చమని చెప్పి పరీక్షించసాగాడు.



ఊర్మిళకు ఏం అర్థంకాలేదు.

మనసులో ఏదో భయంగా అనిపించింది.

ఇంత ఆరోగ్యంగా బలంగా వున్న మనిషికి ఎప్పుడూ లేంది ఇప్పుడు గుండెనొప్పి రావటం ఏమిటి?

డాక్టర్ అతన్ని పరీక్షిస్తుంటే అతను ఏం చెపుతాడో అని భయం కలిగింది.

డాక్టర్ స్టెతస్కోప్ మెడలో తగిలించుకుని ఏదో ఆలోచిస్తున్నట్లుగా అరచేతితో గడ్డంపై రాసుకుంటూ క్షణంసేపు అలా కూర్చున్నాడు.

అతను మాట్లాడక పోవటంతో ఆమెకు ఇంకాభయం వేసింది. ఉదయ్‌కృష్ణ మాత్రం డాక్టర్‌వైపు మామూలుగా చూశాడు. డాక్టర్ తనలో తను ఏదో ఆలోచించుకున్నట్టుగా తలపంకించి.

ఊర్మిళవైపు తిరిగి "కొద్దిగా వేడినీళ్ళు తీసుకు వస్తారా?" అన్నాడు.

ఆమె తలఊపి అక్కడినుండి వెళ్ళిపోయింది. పదినిమిషాల తరువాత ఊర్మిళ వేడినీళ్ళు పట్టుకుని ఆ గదిలోకి ప్రవేశించింది

డాక్టర్ అతనికి యింజక్షన్ చేశాడు.

ఉదయ్‌కృష్ణ ఆమెకు చెప్పాడు డాక్టర్‌గారికి హార్లిక్స్ కలిపి తీసుకురమ్మని.

ఆమె తలఊపి వెళ్ళిపోయింది.

ఒక పదినిమిషాల్లో ఆమె కప్పుతో హార్లిక్స్ పట్టుకు వచ్చింది.

అతను హార్లిక్స్ త్రాగి కాఫీకప్పు టేబుల్ పై వుంచి "నేను వెల్తాను. రేపు ఉదయంవచ్చి చూస్తాను" అంటూ వెళ్ళిపోతుంటే.

ఊర్మిళ అవతలకు వెళ్ళాక అతన్ని అడిగింది.

"డాక్టర్! ఆయనకి ఏం ఫర్వాలేదా?" అంటూ

అతను వెంటనే సమాధానం చెప్పలేదు.

క్షణం ఆగి మెల్లగా అన్నాడు.

"ఈ గుండెనొప్పి గనుక మరో రెండుసార్లు వస్తే ఇక అంతే అనుకోవాలి"

"ఆ" అంది ఆమె. ఆ అనటంలో కంగారు, భయం కొట్టవచ్చినట్టు కనిపించసాగాయి.

గాలి వేస్తున్నా ఆమెకు చెమటలు పోయసాగాయి.

"మరేం కంగారు లేదు. అందుకే ముందే మనం జాగ్రత్తపడటం మంచిది. ఈ నొప్పి మళ్ళీ రాకుండా చెయ్యాలి" ఆమె ముఖంలోకి చూస్తూ అన్నాడు.

ఎలా అదికూడా మీరే చెప్పండి అన్నట్టు బేలగా చూసింది.

"ఒకటి అతని మంచంమీదనుండి కదలనివ్వకూడదు. రెండు అతని మనసుకి కష్టంకలిగించే విధంగా ఎవ్వరూ ప్రవర్తించకూడదు. మూడు రాత్రి, పగలూ అతన్ని ఒంటరిగా వదలకూడదు. జాగ్రత్తగా దగ్గరుండిచూస్తే అతనికి ఈ నొప్పి మళ్ళీరాదు ఆ గ్యారంటీ నేను ఇస్తాను. రేపు ఉదయం మళ్ళీ వస్తాను" అంటూ అతను వెళ్ళిపోయాడు.



డాక్టర్ వెళ్ళినవైపే అలా చూస్తూ శిలాప్రతిమలా నిలబడిపోయింది.

ఆరోగ్యంగా తిరుగుతున్న అతనికి గుండెనొప్పా?

ఆ నొప్పేదో తనకి వచ్చినా బాగుండేది.

తను ఏమైపోయినా బాధపడేవాళ్ళు ఉండరు.

భగవంతుడా ఆయన్ని కాపాడు. కావలిస్తే నా ప్రాణం తీసుకో అంటూ దేముడికి దండం పెట్టుకుంటూ మనసులోనే దుఃఖించింది.

మెల్లగా అతని గదిలోకి నడిచింది.

గుమ్మం దగ్గరకు వెళ్ళగానే ఆమె పాదాలు నేలకు అంటుకుపోయినట్టు ముందుకి అడుగుపడ లేదు.

ఎలాగో శక్తికూడదీసుకుని మెల్లగా అతని మంచం సమీపించింది

ఆమె వచ్చిన అలికిడి అవటంతో అతను కళ్ళు తెరిచి చూసి చిరునవ్వు నవ్వాడు.

ఆమె నవ్వలేదు, అక్కడ కుర్చీ మంచం దగ్గరగా లాక్కొని కూర్చుంది.

# 13

"అరవింద్ వెళ్ళిపోయాడా!" మెల్లగా హీనస్వరంతో ప్రశ్నించాడు.

వెళ్ళిపోయాడు అన్నట్టు తల వూపింది.

"నాగురించి ఏం చెప్పాడు?" అదోరకంగా నవ్వాడు.

ఆ నవ్వులో జీవంలేదు.

"ఏం చెప్పలేదు. తగ్గిపోతుంది ఫర్వాలేదు అని చెప్పారు. రేపు ఉదయం మళ్ళీవస్తానని చెప్పి వెళ్ళారు"

"డాక్టర్లంతా అలాగే చెపుతారు. ప్రాణం పోతున్న వాడికికూడా నీకు ఏం ఫర్వాలేదు బ్రతుకుతావు అనే చెపుతారు అలా చెప్పక ఎలా చెపుతాడు! నా విషయంలో అంతే అనిపిస్తుంది" అంటూ ఇంకేదో చెప్పబోయాడు.

ఆమె అతన్ని మరి మాట్లాడనివ్వలేదు. చటుక్కున చేయి చాపి అతని నోరుమూసింది.

"మీరు ఇక ఏం మాట్లాడవద్దు. మాటాడితే నామీద ఒట్టే ఇప్పుడు ఏమయింది! కాస్త గుండెనొప్పి వచ్చినంతలో అలా అయిపోతారా!" అంది వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ, పైకి కోపం తెచ్చిపెట్టుకుంటూ.

అతను తన పెదవులకి ఆన్చివున్న ఆమె లేత అరచేతిని ముద్దుపెట్టుకుని ఆ చేతిని చేతుల్లోకి తీసుకుని చిరునవ్వు నవ్వాడు.

అతని ముఖంలో కళాకాంతి లేదు. తనకీ విషయం ఏదో ముందే తెలుసు అన్నట్టు వుంది.

ఆమె మాట్లాడలేదు. డాక్టర్ చెప్పినమాటలే చెవుల్లో మారుమ్రోగుతున్నాయి.

"ఊర్మిళా!"

కళ్ళెత్తి అతనివైపు చూసింది.

"భగవంతుడి దయుంటే నేను లేచి తిరుగుతాను. సరే లేదా! నాకు నాన్నగారి గురించి బెంగగా వుంది. వారిని నువ్వు జాగ్రత్తగా చూసుకుంటావు కదూ!" మెల్లగా వినిపించింది అతని కంఠస్వరం.



"ఏమిటా మాటలు చిన్న అబ్బాయిలా!" అంటూ ఒక్క కసురు కసిరింది.

"పోనీలే ఇక అలా మాటాడను" అంటూ నవ్వి.

"నువ్వు ఈ రాత్రంతా నాదగ్గరే కూర్చుంటావు కదూ!" అంటూ చిన్న అబ్బాయిలా అమాయకంగా అడిగాడు ఆమె చెయ్యి వదలకుండా.

"ఇక్కడే మీ దగ్గరే కూర్చుంటాను" అంటూ అతని చేతిని తన రెండు చేతులతో కలిపి పట్టుకుంది.

అతను తేలికగా శ్వాస తీసుకున్నాడు.

ఇక తనకి ఏం ఫర్వాలేదు అన్నట్టు.

అతని చేతిని వదిలి, "కళ్ళుమూసుకుని కాసేపు పడుకోండి" అంది

అతను తలవూపి కళ్ళుమూసుకుని పడుకున్నాడు.

ఆమె అక్కడే అలా కుర్చీలో కూర్చుంది.

ఆమె మనసంతా ఎలాగో వుంది.

కళ్ళుమూసుకుని పడుకున్న అతని ముఖంలోకి అలా చూస్తూ కూర్చుంది.

టైము అవటంతో అతన్ని లేపింది.

"భోజనం చేయండి" అంటూ.

అతను భోజనం చెయ్యను అన్నా వినలేదు. డాక్టర్ గారు మిమ్మల్ని భోజనం మానొద్దు అన్నారు అని చెప్పి భోజనం మేడమీద అతని గదిలోకి తెప్పించింది.

ఉదయ్‌కృష్ణ దిండుకి చేరబడి కూర్చున్నాడు.

ఆమె దగ్గరవుండి వడ్డిస్తే అతను మెల్లగా స్పూన్‌తో తిన్నాడు.

* * * *

రాత్రి టైము పదకొండు గంటలు అయింది.

ఉదయ్‌కృష్ణకి నిద్రరాలేదు అలా కళ్ళుమూసుకుని పడుకున్నాడు.

ఆమె అలా అక్కడే కుర్చీలో కూర్చుంది.

ఉన్నట్టుండి అతను గుండెలపై చేయి వేసుకున్నాడు. "అమ్మా!" అంటూ.

ఊర్మిళ కంగారుగా కుర్చీలో నుండి ఒక్క ఉదుటున లేచి మంచందగ్గరగా వెళ్ళింది.

"ఏమండీ!" అంది కంగారుగా.

"ఊ" పళ్ళబిగువున బాధ ఆపుకుంటున్నట్టుగా కళ్ళు గట్టిగా మూసుకున్నాడు.

"మళ్ళీ నొప్పివస్తుందా!" ఆతృతగా అడిగింది.

"ఊర్మిళా!" ఆమె చెయ్యి గట్టిగా పట్టుకుని మంచం మీదకు లాగాడు.

కొద్దిగా వంగి అతని వైపు చూస్తుంది ఏమో అతను లాగినలాగుకి తూలి అతని గుండెలపై పడింది.

ఉదయ్‌కృష్ణ ఆమెను లేవనివ్వలేదు. రెండు చేతుల్తో గట్టిగా పట్టుకున్నాడు ఆమెను.

"నువ్వులేవద్దు ఊర్మిళా! నాకేదో భయంగా ఉంది. మీ అందర్నీ వదిలి వెళ్ళిపోతానేమో అనిపిస్తుంది. నువ్వు ఇలా నా గుండెలపై తల ఆన్చుకుని పడుకుంటే నాకేదో



ధైర్యం చిక్కినట్టుగా వుంది" ఆమెను రెండు చేతులతో చుట్టేసి వదలకుండా అన్నాడు.

ఊర్మిళకు పైటసర్దుకోవడానికి కూడా వీల్లేకపోయింది కదలడానికిగానీ, ఊపిరి తీసుకోవడానికిగాని వీలు అవలేదు.

"నేను ఇక్కడే కూర్చుంటాను." అంటూ అతని చేతులు విడిపించుకోవటానికి చూసింది.

నిజమా నిన్ను నమ్మమంటావా అన్నట్టు ఆమె కళ్ళల్లోకి నీరసంగా చూశాడు.

ఆ చూపుల్లో భావాలు గమనించినదానిలా, "నిజం నేను ఇక్కడే కూర్చుంటాను" అంది తనమాట నమ్మమన్నట్టు.

అతను మెల్లగా ఆమెను వదిలిపెట్టాడు.

ఆమె పైట సర్దుకుంటూ లేచి, సరిగ్గా కూర్చుంది అతని పక్కన మంచం మీద.

"ఊర్మిళా! నువ్వు ఇలా నా దగ్గరగా కూర్చుంటే నాకు ఎంత ధైర్యంగా వుందో తెలుసా!"

ఆమె మాట్లాడలేదు. అతని గుండెలపై చెయ్యివేసి రాస్తుంది. అతను మూలుగుతూ కళ్ళు మూసుకుపడుకున్నాడు.

కాసేపటికి అతను నిద్రపోయాడు.

ఊర్మిళకి అతను అలా బాధపడుతుంటే జాలితో, బాధతో కళ్ళనీళ్ళు తిరిగాయి.

అప్రయత్నంగా అతని క్రాప్‌లోకి వేళ్ళుపోనిచ్చి మెల్లగా దువ్వింది.

భగవంతుడా! ఇతనికి కులాసాగా వుండేటట్టు చెయ్యి. అంటూ మనసులోనే దేముణ్ని ప్రార్థించింది.

మృత్యుంజయరావుగారు కూడా ఇంటివద్ద లేరు.

ఆయన వారం పదిరోజులకిగాని రారు.

వెంటనే రమ్మని వైర్ ఇప్పిస్తే!

ఆయన కంగారు పడిపోతారేమో!

ఎలా?

డాక్టర్‌ని చూస్తే ఏదో చెప్పడానికి సందేహిస్తున్నట్టుగా వున్నాడు.

ఏమిటి చెయ్యటం!

గుండెనొప్పి అనేది ఎవరికైనా ఎప్పుడైనా వస్తుంది. అంత కంగారు పడవలసిన పనిలేదు.

బాగా ఉధృతంగావస్తే అది వేరు. మరి ఈ గుండె నొప్పి ఏమిటో ఆమెకు అర్థంకాలేదు.

## 14

తెల్లవారి ఉదయ్‌కృష్ణకు కులాసాగానేవుంది. స్నానం చేసి బట్టలు మార్చుకుని కాఫీ టిఫిన్ తీసుకుని కూర్చున్నాడు.

టైము తొమ్మిదిగంటలు అవుతుంది.

డాక్టర్ అరవింద్‌కుమార్ ఉదయ్‌కృష్ణని చూడడానికి వచ్చాడు.

"ఎలావుంది ఒంట్లో! రాత్రి బాగా నిద్రపట్టిందా! నొప్పిరాలేదు కదా!" నవ్వుతూ ప్రశ్నించాడు.

"రాత్రి కొద్దిగావచ్చి మళ్ళీ వెంటనే సర్దుకుంది."



"నేను ముందే అనుకున్నాను, రాత్రికి మళ్ళీ ఒకసారి వస్తుంది అని."

ఉదయ్‌కృష్ణ జవాబు ఇవ్వలేదు. మౌనంగా కూర్చున్నాడు.

"డాక్టర్?" అంటూ ప్రశ్నార్థకంగా చూసింది ఊర్మిళ అతని వైపు.

"ఏం ఫర్వాలేదమ్మా ఇలాటి గుండె నొప్పులు రావటం మామూలే అయితే కాస్త జాగ్రత్తగా ఉండాలి, రాత్రి, పగలూ అతన్ని ఒంటరిగా వుంచకూడదు, ఎప్పుడూ సరదాగా నవ్వుతూ వుండేటట్టు చూడాలి. ఒక వారం పది రోజులు అలా మంచం మీదనే వుంచాలి. కదలనివ్వకూడదు, బాగా రెస్టు కావాలి" అంటూ ఆమెకు ధైర్యం చెప్పాడు.

ఊర్మిళ డాక్టర్ చెప్పిన మాటలు శ్రద్ధగా వింటున్నట్టు అలాగే అన్నట్టుగా తలవూపింది.

"మళ్ళీ రేపు ఉదయం వచ్చి చూస్తాను" అంటూ డాక్టరు వెళ్ళిపోయాడు.

డాక్టరు అలా చెప్పాక ఆమె మనసు కాస్త కుదుట పడింది.

ఆమె స్నానం చేసి బట్టలు మార్చుకుని ముస్తాబు అయి అతని గదిలోకివచ్చి కూర్చుంది.

పాల నురుగులాంటి తెల్లని చీరలో చల్లని దేవతలా కనిపించింది అతని కళ్ళల్లోకి.

ఉదయ్‌కృష్ణ మనసు మరి ఆగలేదు.

"ఊర్మిళా!"

"ఊ" అంది అతనివైపు చూస్తూ.

"నాకు ఈ దిండుమీద తలపెట్టుకుని పడుకోవాలంటే విసుగేస్తుంది" అన్నాడు ముఖం అదోలా పెడ్తూ.

"మరి!" ఎక్కడ పడుకుంటారు అన్నట్టు చూసింది.

"నీ ఒడిలో తలపెట్టుకుని నిద్రపోవాలని వుంది." తన మనసులోని కోరిక తెలియచేశాడు.

అతని కోరిక వింటూనే ఆమె చెంపలు ఎర్రబడ్డాయి.

కనురెప్పలు క్రిందకు వాల్చేసింది. తన వడిలో అతను తలపెట్టుకుని పడుకోవటమా? ఈ సంగతి ఎవరికైనా తెలిస్తే!

"పోనీలే, నీకు ఇష్టంలేకపోతే వద్దు. ఎలాగూ కొద్ది రోజుల్లో ఈ బంధాలన్నీ త్రెంచేసుకుంటాను అని ఏదో పిచ్చిగా వాగాను. తప్పు అయితే నన్ను క్షమించు" అన్నాడు. అతని కంఠం జీరబోయింది.

తప్పు చేసినట్టు ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

ఆమె మాట్లాడలేదు.

అతను మాట్లాడకుండా మౌనంగా వుండిపోయాడు.

కొద్ది క్షణాలు అయ్యాక అతను గుండెమీద చెయ్యి వేసుకున్నాడు "అమ్మా!" అంటూ.

ఊర్మిళ గుండె గుభేలుమంది.

డాక్టర్ చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి.



"అతను ఎప్పుడూ నవ్వుతూ సరదాగా వుండేటట్టు చూడాలి అని." ఇతనికి కొంచెం కూడా బాధ కలిగేటట్టు ప్రవర్తించకూడదు అనుకుంది.

అతను మళ్ళీ "అమ్మా!" అన్నాడు బాధపడుతూ.

చటుక్కున లేచి మంచం దగ్గరగా వెళ్ళి తలవైపు కూర్చుని అతని తలని ఒడిలోకి తీసుకుంది.

ఉదయ్‌కృష్ణ వద్దు అన్నట్టు చేత్తో సైగచేసి తల వెనక్కు పెట్టుకోబోయాడు.

ఆమె అతని తలని కదలనివ్వకుండా పట్టుకుని కుడి చెయ్యి చాపి అతని గుండెలపై మెల్లగా రాస్తూ అతన్ని మాటలలోకి దించింది.

"మీరు పూనా ఎప్పుడైనా వెళ్ళారా!" అడిగింది.

"వెళ్ళేను" అంటూ చెప్పాడు.

"మీ నాన్నగారు ఎప్పుడు వస్తారు!" ఆమెకు తెలిసినా అడిగింది.

అతను చెప్పాడు.

అలా కబుర్లలో పెట్టి అతన్ని కాస్సేపు నవ్వించింది.

ఉదయ్‌కృష్ణకి నొప్పి సర్దుకున్నట్టు అయింది.

పువ్వులావున్న ఆమె వొడిలో హాయిగా తల పెట్టుకుని ఆమెతో సరదాగా కబుర్లు చెప్పసాగాడు.

ఆ రోజు అంతా ఇద్దరూ సరదాగా కబుర్లతో గడిపేశారు.

* * *

ఆ మర్నాడు ఉదయం డాక్టర్ వచ్చి చూసి వెళ్ళాడు. "సాయంత్రంవేళ చల్లగాలికి అలా ఒక గంటసేపు కారులో ఎక్కడికి అయినా తీసుకెళ్ళండి. ఒకర్ని మాత్రం పంపించకండి కూడా మీరూ వెళ్ళండి" అంటూ చెప్పాడు డాక్టర్.

ఊర్మిళ మేడమీద అతని గదిలోనే కూర్చుంటుంది.

పదకొండు గంటల ట్రైనులో శేఖర్ తండ్రి కలకత్తా నుండి వచ్చాడు.

వస్తూనే నౌకర్ని అడిగారు మృత్యుంజయరావుగారు వున్నారా అని.

ఆయనకి ఆ యింట్లో నౌకర్లు తప్ప ఎవ్వరూ కనిపించలేదు ఇంట్లో వున్నారా! లేదా! అన్న అనుమానం వచ్చింది.

నౌకరు చెప్పాడు. "పెద్దయ్యగారు వూరు వెళ్ళారు. చినబాబుగారికి ఒంట్లో బాగోలేదు. మేడమీద వున్నారు. ఊర్మిళమ్మగారు ఎక్కడున్నారో చూడలేదండి పిలుస్తాను ఉండండి" అంటూ వెళ్ళబోయాడు.

"వద్దు నేనే మేడమీదకి వెల్తాను" అంటూ ఆయన మేడమెట్లవైపు దారితీశారు,

పెళ్ళికూతురికి వస్తువులకి, బట్టలకి డబ్బు ఇవ్వటానికి వచ్చారు. వచ్చే ముందు వుత్తరం వ్రాయాలనుకుని అప్పటికప్పుడు అర్జంటుగా బయలుదేరి వచ్చేశారు. హోటల్లో దిగి అప్పుడు వచ్చారు.

ఉదయ్‌కృష్ణ గదివైపు వెళ్ళారు.



ఆ గదిలో మాటలు వినిపించటంతో ఒక్కక్షణం ఆగిపోయారు

"నాకెప్పుడూ నీ ఎదురుగా ఇలాగే వుండాలనిపిస్తుంది. నీ అందమైన కళ్ళల్లోకి అలాగే చూడాలనిపిస్తుంది." ఆ మాటలుబట్టి అది ఉదయ్‌కృష్ణ కంఠస్వరం అని గుర్తించటానికి ఆయనకు ఎంతోసేపు పట్టలేదు.

అతని మాటలకి జవాబుగా నవ్వు వినిపించింది.

ఆ నవ్వు ఊర్మిళదని గ్రహించుకున్నారు.

ఆయన ఏదో ఆలోచిస్తున్నట్టుగా తలపంకించి గదిలోకి అడుగుపెట్టి అలా ఆగిపోయారు.

ఊర్మిళ టేబుల్ దగ్గర అటుతిరిగి నిలబడింది. ఫ్రూట్ జ్యూస్‌లో గ్లూకోస్ కలుపుతూ.

ఉదయ్‌కృష్ణ ఆమెకు దగ్గరగావెళ్ళి మెడచుట్టూ రెండు చేతులూవేసి దగ్గరగా తీసుకుంటూ ఆమె తలపై తన గడ్డం ఆన్చి.

"ఇప్పుడు నీకు ఏ మనిపిస్తుంది!" అడిగాడు నవ్వుతూ.

"మీరు కదలకుండా ఆ మంచంమీద కూర్చుంటే బాగుంటుంది అనిపిస్తుంది" అంటూ అతని చేతులు విడిపించుకోవడానికి ప్రయత్నిస్తుంది.

అతను ఆమె మాటలకి గట్టిగా నవ్వేశాడుగాని ఆమెని మాత్రం వదలి పెట్టలేదు.

గుమ్మంలో నిలబడిపోయి అవాక్కై అయి అలా కళ్ళప్పగించి చూస్తున్న ఆయన తనకితాను సర్దుకుని వెనక్కి ఒక్కడుగు వేశారు.

అప్పుడే మేడమెట్లు ఎక్కివస్తున్నట్లుగా "ఉదయ్ కృష్ణా" అంటూ పిలిచారు.

ఆ పిలుపు వింటూనే వాళ్ళిద్దరూ ఒక్కసారి ఉలిక్కిపడ్డట్లు అయ్యారు.

ప్రశ్నార్థకంగా ఒకరి మొఖాలు ఒకరు చూసుకుని ఇద్దరూ విడిపోయారు.

ఉదయ్‌కృష్ణ ఎవరువచ్చారా అన్నట్లు గుమ్మంవేపు రెండడుగులు వేశాడు.

ఆయన లోపలికొచ్చారు.

"నీకు ఒంట్లో బాగాలేదని నౌకర్లు చెప్పారు. చూద్దామని మేడమీదకు వచ్చాను" అన్నారు ఆయన.

ఉదయ్‌కృష్ణ ముఖం తెల్లగా పాలిపోయినట్లు అయింది.

ఆయన తమ ఇద్దర్నీ చూడలేదని అనుకున్నా చూశారేమో! అని మనస్సు పీకసాగింది. నవ్వాలన్నా నవ్వురాలేదు.

ఆయన్ని కూర్చోమని తనూ కూర్చున్నాడు.

ఊర్మిళ అయితే అక్కడ నిలవలేక అవతలకు వెళ్ళిపోయింది.

ఈయనకి గుండెల్లో నొప్పి కాదుగాని నా ప్రాణాలు తోడుతున్నారు అనుకుంది.

అనుక్షణం తనని అంటిపెట్టుకుని వుంటున్నాడు.

ఆలా వుండొద్దు అని తను దూరంగా తొలగిపోతుంటే అతను బాధపడతాడు మరుక్షణంలో వెంటనే గుండెనొప్పి వచ్చేస్తుంది.



తనకి ఇష్టంలేకపోయినా తప్పనిసరిగా అతనికి దగ్గిరగా వుండవలసి వస్తుంది.

కొద్దిరోజులలో శేఖర్‌తో తనకి పెళ్ళి కాబోతుంది.

డాక్టర్ మాటలుబట్టి ఉదయ్‌కృష్ణకి భార్యలా సేవ చేయవలసి వస్తుంది.

శేఖర్ తండ్రి తమ ఇద్దర్నీ చూడలేదుకదా!

చూస్తే ఇంకేమయినా వుందా!

మృత్యుంజయరావుగార్కి తెలిస్తే ఆయన ఏమనుకుంటారు!

ఈ ఉదయ్‌కృష్ణ చూస్తే గుండెనొప్పి వంకతో తనని రోజుకు నాలుగుసార్లు అయినా గుండెలమీదకు లాక్కొనిదే నిద్రపోడు. అతన్ని తప్పించుకోవటం మహా కష్టంగా వుంది.

ఊర్మిళకి ఆరోజు ఉదయ్‌కృష్ణపై కోపం ముంచుకు వచ్చింది.

అతనికి దూరంగా వుండాలని గట్టిగా నిశ్చయించుకుంది.

శేఖర్ తండ్రి కాసేపు కూర్చుని అతనితో మాట్లాడి వెళ్ళిపోయారు

ఊర్మిళ అతని గదిలోకి వెళ్ళలేదు.

అతను పిలవలేదుకూడా.

ఆ రాత్రి అతను త్వరగా నిద్రపోయాడు. అతనికి ఆరోజు గుండెల్లో నొప్పిరాలేదు.

ఊర్మిళ అతను పడుకున్నాక గది ఇవతల క్రింద చీర కొంగు పరుచుకుని పడుకుంది.

పడుకున్నా ఆమెకు నిద్రపట్టలేదు. ఏరాత్రివేళ అతనికి ఏం కావలసి వస్తుందో అని.

# 15

ఆరోజు ఉదయం అతను స్నానంచేసి బట్టలు మార్చుకుని కూర్చున్నాడు.

నౌకరువచ్చి మీకు ఫోన్ వచ్చింది అని చెప్పటంతో లేచి వెళ్ళాడు.

వెళ్ళి పది నిమిషాలలో తిరిగి వచ్చాడు.

ఆమె కాఫీ టిఫిన్ తీసుకుని అతని గదిలోకి వచ్చింది.

ఉదయ్‌కృష్ణ ఊర్మిళవేపు క్షణంసేపు పరీక్షగా చూశాడు.

ఆమె అందచందాలు చూస్తుంటే అతని మనసులో కోరికలు అలలు రేగాయి.

"నాకు కాఫీవద్దు" అన్నాడు ముఖం ప్రక్కకు తిప్పుకుంటూ.

"ఏం ఎందుకవద్దు!" అంది ఆశ్చర్యంగా.

"నాకు వద్దు అంతే" అన్నాడు మొండిగా.

"ఇప్పుడు ఏమయింది! కాఫీ త్రాగకుండా ఎంతసేపు వుంటారు!" అడిగింది కోపంగా.

"ఎంతసేపయినా వుంటాను నీకేం!"



"పోనీ హార్లిక్స త్రాగుతారా?"

"ఊహు"

"మరి ఏం తీసుకుంటారు?"

"నేను అడిగితేమాత్రం నువ్వు ఇస్తావా!"

"ఏం కావాలో చెప్పండి ఇస్తాను" అంది అతని ముఖంలోకి చూస్తూ.

అతను ఆమె కళ్ళల్లోకి సూటిగా చూస్తూ కుడిచేయి పెదవులమీద ఆనించుకుని "ప్చ్" అన్నాడు నవ్వి.

అతనిసైగ ఆమెకు అర్థమైపోయింది.

అతనికి కావలసింది ఏమిటో తెలియగానే ఆమె ముఖం ఎర్రగా కందిపోయింది.

క్షణంసేపు మాటలు రానట్టు అగా బొమ్మలా వుండిపోయింది.

"నేను అప్పుడే చెప్పాను నేను అడిగితే మాత్రం నువ్వు ఇస్తావా! ని"

అతని మాటలతో ఆమె రుసరుస లాడినట్టుగా అయింది

"నాలుగు రోజులనుండి చూస్తున్నాను మీ గుండెలో నొప్పి ఏమిటో నాకు అర్థం కావటంలేదు" అంది కోపంగా.

"పోనీలే కోపం తెచ్చుకోకు. నేను ఇంట్లో వుండనులే వెళ్ళిపోతాను. నాకు రెస్టువద్దు. ఏం వద్దు. మామూలుగా నాపని నేను చూసుకుంటాను" అంటూ లేచి బట్టలు మార్చుకుని తలదువ్వుకుని టై కట్టుకుని కాలికి బూట్లు వేసుకుని కోటు అందుకున్నాడు.

ఆమె కంగారుగా చూసింది. అతనికి కోపం వచ్చి నిజంగానే వెళ్ళిపోతున్నాడు.

"ఏమండీ" అంది దగ్గరగా వెళ్ళి చెయ్యిపట్టుకుని.

ఏమిటి అన్నట్టు ఆగి చూశాడు.

"మీరు ఎక్కడికీ వెళ్ళొద్దు. డాక్టర్‌గారు మిమ్మల్ని కదలొద్దు అని చెప్పారా! ఇప్పుడు కదిలితే మళ్ళీ గుండె నొప్పి వస్తుంది. ప్లీజ్ నామాట వినండి" అంది ప్రతిమాలుతున్నట్టు ముఖం పెట్టి.

"నన్ను వదులు. నేను ఇంట్లోవుంటే నీకు కోపం. అందుకే వెళ్ళి నాపని నేను చూసుకుంటాను. ఇక నా గుండెలో నొప్పి అంటావా వస్తే రానియ్య నాకు లక్ష్యం లేదు." అన్నాడు నిర్లక్ష్యంగా.

"నా మాట వినరా!"

"నా మాట నువ్వు విన్నావా!"

ఆమె మాట్లాడలేదు.

"నా మాట నువ్వు వింటే నీమాట నేను వింటాను. ఇంట్లోనే వుంటాను కదలకుండా."

అతని మాటలకి తలఎత్తి కోపంగా చూసింది.

ఉదయ్‌కృష్ణ నవ్వుతున్నాడు. కళ్ళు కొంటెగా మెరిశాయి.

ఊర్మిళ ఆ కొంటెతనానికి తను తట్టుకోలేనట్టు గిరుక్కున వెనుతిరిగి వెళ్ళిపోయింది.

అతను నవ్వుకుంటూ అర్జంటు పనిమీద ఒకచోటికి వెళ్ళిపోయాడు.



అతను ఊర్మిళమీద కోపంతో వెళ్ళిపోలేదు. అతన్ని రమ్మని ఫోన్ వస్తే వెళ్ళాడు.

ఆమెను ఏడిపించడానికిగాను అలా అన్నాడు.

* * * *

ఊర్మిళకి ఆలోచిస్తుంటే అతని గుండెనొప్పి నిజమూ అబద్ధమూ! అనిపిస్తుంది.

మరి డాక్టర్ వచ్చి ఇంజక్షన్ ఇస్తున్నాడు. కదలకుండా రెస్ట్ తీసుకోమని చెపుతున్నాడు.

ఆలోచిస్తుంటే నిజమే అనిపిస్తుంది.

అబద్ధం అయితే మరి అంతలా నీరసంగా వుండడే. నొప్పి వచ్చినప్పుడే అలా నీర్సంగా అయిపోతాడు.

పాపం నిజంగానే నొప్పివస్తుంది ఏమో?

ఏమయిపోతానో అన్నభయంతో తనని గట్టిగా పట్టేసుకుంటాడు. అంతే అతని మనసులో మరో ఉద్దేశం లేదేమో!

తను చిన్న విషయానికి పెద్దగా ఆలోచిస్తుంది అనుకుంది.

ఆరోజు సాయంత్రం అరవింద్‌కుమార్ ఊర్మిళకి ఫోన్ చేశాడు.

"నేను యింటికి రావటం వీలుపడదు ఉదయ్‌కృష్ణ ఎలావుందని."

ఆమె చెప్పింది తనమాట వినకుండా పనివుంది ఎక్కడికో వెళ్ళారు అని.

అతను నవ్వి "ఉదయ్ చాలా మొండిమనిషమ్మా. నువ్వు కాస్త విసుక్కోకుండా చూశావు అంటే ఒక వారం రోజులలో అతనికి పూర్తిగా తగ్గిపోతుంది."

"అది కాదు డాక్టర్ గారూ!" అంటూ చెప్పబోయింది.

"నేను రేపు ఉదయం వస్తాను. ఉదయ్‌కృష్ణని ఈ రోజు సాయంత్రం అలా షికారుకి ఎక్కడికి అయినా తీసుకెళితే అతని మనసుకి బాగుంటుంది."

"ఏమ్మా!"

"అలాగేనండీ!"

"సాయంత్రం షికారుకి తీసుకెళ్ళు రేపు వస్తాను" అంటూ ఫోన్ పెట్టేశాడు.

ఊర్మిళ గుండె గుభేలుమంది అతనితో ఒంటరిగా షికారుకి వెళ్ళాలి అంటే.

ఆ దేమిటో తను ఒంటరిగా కనిపిస్తే చాలు అతను మనసూ, చేతులు పూరుకోవు

అతని పట్టు విడిపించుకోవటం చాలా కష్టం.

ఎంత గింజుకున్నా ఆ చేతులు పట్టు వదలవు.

ఏమైనా అంటే గుండెనొప్పి ఒకటి, తనకి ఏం అనాలో తోచటం లేదు.

ఉదయం అయితే ఎలాగో తప్పించుకుంది.

ఇప్పుడు షికారు కెళితే తప్పించుకో గలదా!

అతని కొంటె వేషాలకి మతిపోవటమే కాదు, మనసు కూడా గతితప్పుతుంది.



శేఖర్‌తో పెళ్ళి జరగకుండా తప్పిపోతే బాగుండును అనిపిస్తుంది.

ఆమెకు తెలియకుండానే మనసు ఉదయ్‌కృష్ణ గురించి తలపోస్తూ రసార్ద్రమైంది.

ఆ చిరుదరహాసం కొంటెతనం చిందులు వేసే ఆ కళ్ళు అన్నిటికీ మించిన ఆ సుందర మంగళ విగ్రహం ఆమె కళ్ళల్లో ప్రతిక్షణం కదలసాగింది.

అతని చేతులమధ్య జీవితం అంతా అలా వుండిపోతే!

అతని నీడలో బ్రతుకంతా వెళ్ళిపోతే!

బరువుగా వూపిరి తీసుకుంది తనకు అంత అదృష్టం కూడానా.

అంత అదృష్టం ఏ స్త్రీకి వుందో!

## 16

సాయంత్రం అయిదు గంటలు అయ్యేసరికి ఊర్మిళ సిల్కు చీర కట్టుకుని ముస్తాబు అయి కూర్చుంది.

ఉదయ్‌కృష్ణ రావటంతో చెప్పింది.

అలా ఎక్కడి కయినా వెల్దామని.

అతను అలాగే అని స్నానం చేసి బట్టలు మార్చుకుని కాఫీ, టిఫిన్ తీసుకుని ఆమెతో బయలుదేరాడు.

కారులో అవుట్ హార్బర్ వైపు వెళ్ళారు.

కారు ఒకచోట ఆపి మెల్లగా ఇద్దరూ నడుచుకుంటూ అలా ముందుకి వెళ్ళారు.

నిర్మానుష్యంగా వున్న చోటికి వెళ్ళి అక్కడ వరసగా గట్టులా వుంటే ఆ గట్టుమీద ఇద్దరూ కూర్చున్నారు.

వీచేగాలి రయ్యిన వీస్తుంది.

ఊర్మిళ పైట చెంగు రెపరెపలాడుతూ పైకి ఎగిరిపోతుంది.

విసుగ్గా పైటకొంగు ఎగరకుండా పట్టుకుని గాలికి రేగుతున్న ముంగురులు ఒకచేత్తో సర్దుకుంది.

"ఉదయం నా కోరిక తీరనేలేదు" అతను ఎంత మామూలుగా అన్నా కళ్ళల్లో కొంటెతనం తళుక్కుమని మెరిసింది

ఆమె గుండె ఆగినంతపని అయింది.

అతను ఆ సంభాషణ మొదలుపెట్టాడు అంతే ఇక తనపని అంతే! కదల్లేదు మెదల్లేదు కళ్ళు పైకి ఎత్తలేదు. మెడ తిప్పలేదు ఏమిటీ మనిషి! విసుక్కుంది మనసులో.

ఈ మనిషి బలవంతంగా అయినా తనమాట చెల్లించుకుంటాడేమో! కాదంటే గుండెనొప్పి మొదలు.

ఊర్మిళ మనసులో భయంతో అలా ముడుచుకుని మొగ్గలా కూర్చుంది.

కొద్దిక్షణాలు గడిచినా ఆమె వూహించినట్టు ఆమె భుజాలు పట్టి దగ్గరకు లాక్కుని అతనికోరిక నెరవేర్చుకోలేదు.

తనకి దూరంగానే కూర్చున్నాడు.



గండం గడిచిపోయినట్టు ఆమె వూపిరి తీసుకుంది.

శరీరం అప్పుడే చలనం వచ్చినట్టుగా కొద్దిగా కదిలి సర్దుకు కూర్చుంది.

"ఊర్మిళా నిన్నొక్క ప్రశ్న అడుగుతాను. సమాధానం చెప్పాలి. చెప్పకపోయావో నాకు గుండెల్లోనొప్పి వచ్చేస్తుంది" అన్నాడు బెదిరిస్తున్నట్టుగా.

అతనివైపు చురుగ్గా చూసింది.

ఏమిటీ బెదిరింపు అన్నట్టు.

అతను నవ్వాడు. "నేను అంటే నీ మనసులో ఎలాంటి అభిప్రాయం వుంది. నా గురించి నువ్వు ఏమనుకుంటున్నావు?" సూటిగా అడిగాడు.

ఆమె వెంటనే జవాబు ఇవ్వలేదు.

"చెప్పకపోతే నాకు గుండెనొప్పి వచ్చేస్తోంది" మళ్ళీ చెప్పాడు. ఇదెక్కడి గుండెనొప్పి. తన ప్రాణం తియ్యడానికి కాకపోతే తన మనసులో ఏముందో తెలుసుకోవాలని అతని ఉద్దేశంలా వుంది.

నిజం చెప్పినందువలన ప్రయోజనం!

తనకి కొద్దిరోజులలో శేఖర్‌తో పెళ్ళి జరిగిపోతుంది.

ఆ పెళ్ళి ఎవరూ ఆపలేరు.

ఈ మాత్రానికే బయటపడటం అనవసరం.

మీరు నాకు సోదరసమానులు అని చెప్పేస్తే ఇక తనకి ఎలాంటి ఇబ్బందీ వుండదు.

ఆ మాటే పైకి అంది.

"మీరు చాలా మంచివారని, అర్థం చేసుకున్నవాళ్ళకి మంచి అన్నగారు కాగలరు అని మీరూ నాకు అంతే" అని మెల్లగా చెప్పింది

ఆమె మాటలు వింటూనే అతను క్షణంసేపు నోట మాట రానట్లు ఉండిపోయాడు.

ఏదో ఆలోచించుకున్నవాడిలా వెంటనే ఫక్కున నవ్వాడు. అతని నవ్వు ఆమెని గేలిచేస్తున్నట్టుగా అనిపించింది.

ఆమెకు మనసులో ఉక్రోషం కలిగింది.

"అన్నయ్యతో మాట్లాడితే ఏ చెల్లెలి ముఖం ఎర్రబడదు. సిగ్గుపడదు. అన్నయ్యదగ్గర చూపించే చనువు వేరు. మనసుకు నచ్చినవాడి దగ్గర చూపించే చనువు సిగ్గు వేరు."

ఆమె మాట్లాడలేదు.

"ఇంకా చెప్పాలి అంటే నువ్వు ఎన్నిసార్లు నా చేతుల్లో బంధీ కాలేదు. బంధీ అయిన క్షణంలో నన్ను అన్నయ్యగానే భావించేవా! ఇంకా" అంటూ ఇంకేదో చెప్పబోయాడు.

ఆమె అతన్ని చెప్పనివ్వలేదు.

"ఇంక మీరు ఏం చెప్పినా నేను వినను" అంటూ చెవులు మూసుకుంది.

"ఇప్పుడు చెప్పు, నేను అంటే సోదర సమానమేనా!"

ఆమె మాట్లాడలేదు.

నిజమే అతని ప్రతీమాటలో ఎంతో నిజం దాగివుంది.

అతను తనని ఎన్నిసార్లు హృదయానికి హత్తుకోలేదూ! అలా హత్తుకునేటప్పుడు ఇద్దరి హృదయాలు దగ్గరై



చీమకూడా చొరబడలేనంతగా పెనవేసుకుపోవడం అలా అన్నీ గుర్తుకువస్తూ ఆమె ముఖం ఎర్రగా కందిపోయింది.

"ఊర్మిళా!" అతని కంఠస్వరం మృదుమధురంగా వినిపించింది.

"నీ మనసు ఏమిటో నాకు తెలిసిపోయింది. నువ్వు నా అర్థాంగివి కావాలని నా మనసు కోరుకుంటుంది. నాన్నగారు పూనానుండి వచ్చాక మన విషయం చెప్పి వారి అనుమతితో నిన్ను వివాహం చేసుకోవాలనుకుంటున్నాను" శాంతంగా చెప్పాడు. "కాని" అంటూ ఆగిపోయింది.

"నాకు తెలుసు నీ సందేహం ఏమిటో. శేఖర్‌తో నీ పెళ్ళి నిశ్చయం అయింది పెళ్ళికికూడా ముహూర్తం పెట్టేశారు అనికదూ! ఆ విషయాలు అన్నీ నేను చూసుకుంటాను."

ఆమె మాట్లాడలేదు.

"నీకు ఇష్టమేకదూ! నాన్నగారితో మాట్లాడమంటావా!"

"ముందు మీ నాన్నగార్ని అడిగి చూడండి. వారు ఏమంటారో!"

"ఏమీ అనరు. నేను పెళ్ళి చేసుకోడానికి ఒప్పుకోవడమే చాలు అనుకుంటారు. నాన్నగార్ని నేను ఒప్పిస్తానుకదూ!" ఆమె మాట్లాడలేదు. మౌనంగా వుండిపోయింది.

చీకటి పడడంతో ఇద్దరూ మెల్లగా కారువైపు దారితీశారు.

అతను డ్రైవింగ్ సీట్లో కూర్చుని కారుస్టార్టు చేస్తుంటే ఆమె అంది. డ్రైవర్ని తీసుకురావలసింది అని.

ఏం అన్నట్టు చూశాడు ఆమెవైపు.

"ఎక్కువ కదిలితే మీకు గుండెనొప్పి వస్తోంది అని."

"వస్తే నువ్వు పక్కన వున్నావుగా నీ భుజంమీద తల వాల్చేసి మెల్లగా డ్రైవ్ చేస్తాను" అంటూ నవ్వాడు.

ఆమె ముఖం తిప్పుకుంది.

కారు పోర్టికోలో ఆగింది.

ఇద్దరూ కారుదిగి లోపలకు వెళ్ళిపోయారు.

## 17

ఆరోజు ఉదయం డాక్టర్ అతన్ని చూడడానికి వచ్చాడు

ఉదయ్‌కృష్ణ గదిలో ఇద్దరూ కూర్చున్నారు.

"నీ గుండెనొప్పి ఎంతవరకు వచ్చింది!" అంటూ నవ్వాడు డాక్టర్.

"ఇప్పుడిప్పుడే దారిలోకి వస్తోంది" అంటూ నవ్వాడు,

అప్పుడే గదిలోకి అడుగుపెట్టిన ఊర్మిళ చెవిలో ఆ మాటలు పడ్డాయి.

తృళ్ళిపడినట్టుగా ఇద్దరివైపూ మార్చిమార్చి చూసింది.

స్నేహితులు యిద్దరూ ఒక్కసారి సర్దుకున్నట్లు అయ్యారు.



ఎందుకో ఆ క్షణంలో వారిద్దర్నీ చూస్తుంటే వీరు తోడుదొంగలు అనిపించింది.

డాక్టర్ అడిగే తీరు ఇతను చెప్పేతీరు చూస్తోంటే— ఉదయ్‌కృష్ణకి అసలు గుండెనొప్పి లేదేమో అనిపిస్తోంది.

ఆలోచిస్తోంటే అంతా నటన అని తేలిపోతుంది.

ఊర్మిళకి ఒక్కసారి ఒళ్ళు మండిపోయింది.

డాక్టర్ హార్లిక్స్ తీసుకుని వెళ్ళిపోతూ అన్నాడు.

"రేపు వస్తాను మళ్ళీ" అని.

ఆమె వెంటనే అంది. "డాక్టర్‌గారూ! రోజూ మీ పని మానుకుని రావటం దేనికి చెప్పండి! మీరు రోజూ వస్తోంటే ఆయనకి గుండెనొప్పి ఎప్పటికీ తగ్గదు. మీరు రావడం మానేస్తే అదే తగ్గిపోతుంది. పైగా ఆయన కంపెనీ పనులుకూడా చూసుకోవలసి వుంది. ఎన్నాళ్ళు యింట్లో కూర్చుంటారు? ఈ రోజునుండి ఆయన కంపెనీ పనులు చూడడానికి వెళ్తారు."

స్నేహితులు ఇద్దరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

అరవింద్‌కుమార్ తలవూపి వెళ్ళిపోయాడు.

"డాక్టర్ని రావద్దు అన్నావు నాకు గుండెనొప్పివస్తే!"

"వస్తే నా దగ్గర మందుంది."

ఏమిటామందు అన్నట్టు చూశాడు.

"ఆముదం ఒకగ్లాసు, పచ్చి ఉల్లిపాయరసం ఒకగ్లాసు ఇస్తే ఇలాటి నొప్పులు టక్కున మాయం అవుతాయి" అంది

గొప్పగా. చూశారా మీ గుండెనొప్పికి నేను మందు కనిపెట్టాను అన్నట్లు చూసింది.

బాబోయ్ అన్నట్టు భయంగా చూశాడు.

"దెబ్బకు చచ్చి పూరుకుంటాను" అన్నాడు కోపంగా.

ఊర్మిళ అతనివైపు సీరియస్‌గా చూస్తూ నిలబడింది.

ఉదయ్‌కృష్ణ వస్తున్న నవ్వు అతికష్టంమీద దాచుకుంటూ ఆమెవైపు అలాగే చూశాడు.

"మీకు నిజంగా గుండెనొప్పి వచ్చిందా!" సూటిగా ప్రశ్నించింది.

"రాలేదా!"

"నన్నడిగితే నేను ఏం చెపుతాను! ఆ సంగతి మీకు తెలియాలి" అంది కోపంగా.

"మరి డాక్టర్ వచ్చి ఇంజక్షన్ చేశాడు"

"చేస్తాడు ఎందుకు చెయ్యడు! అందుకే ఆరోజు డాక్టర్‌కి ఏం అర్థంకాక అలా వుండిపోయాడు. నేను వేడినీళ్ళకోసం వస్తే ఆ డాక్టర్‌కి మీరు ఏం చెప్పారో! ఇద్దరూ కలసి నాటకం ఆడారు" అంది ఉక్రోషంగా.

అతను గట్టిగా నవ్వేశాడు. "చాలా తెలివయిన దానివిసుమా" అన్నాడు.

"ఉండండి మీ నాన్నగారు వచ్చాక చెప్పకపోతే మీ పని" అంది బెదిరిస్తూ.

అతను నవ్వుతూ "కోపం వచ్చిందా!" అంటూ ఆమె చెయ్యి అందుకోబోయాడు.



అతని చేతిని విసిరికొట్టింది "నన్ను ముట్టుకోవద్దు" అంటూ.

అలా అంటూ విసిరికొట్టే అందమైన అమ్మాయిని చూస్తూ ఏ పురుషుడి మనసు ఆగుతుంది.

ఒక్క అడుగు ముందుకువేసి ఆమెను అందుకోవాలని ప్రయత్నించాడు.

ఆమె అది గ్రహించి ప్రక్కకు తప్పుకుంది.

"దగ్గరికి వచ్చారో కేకలు పెట్టేస్తాను జాగ్రత్త" అంది కోపంతో వుడికిపోతూ.

అతను లెక్కచెయ్యలేదు. నవ్వుకుంటూ ఆమె దగ్గరకు వెళ్ళి ఆమె గింజుకుంటున్నా లెక్కచేయక ఆమె భుజాల చుట్టూ ఒక చెయ్యి మోకాళ్ళక్రింద ఒక చెయ్యివేసి పైకి అవలీలగా ఎత్తి గుండెలకి అపురూపంగా పొదవి పట్టి మంచం దగ్గరగా తీసుకెళ్ళి పడుకోబెట్టి అతను కొద్దిగా ముందుకు వంగాడు.

ఆమె మాట్లాడడానికి అవకాశం చిక్కలేదు.

కొద్దిక్షణాలు ఇద్దరూ స్వప్నావస్థలో తేలిపోయారు.

ముందుగా అతనే మేలుకొన్నట్లు ఆమెను వదలి నిలబడ్డాడు.

అతనివైపు చూడలేక ముఖం పక్కకు తిప్పుకుంది.

ఉదయ్‌కృష్ణ విజయగర్వంతో నడుంమీద చేతులు ఆనించుకుని కొంటెగా ఆమెవైపు చూశాడు.

అతని నవ్వు నడుంమీద చేతులు ఆనించుకుని ఆ నిలబడే తీరు, కొంటెదనం చిందులువేసే ఆ చూపులు.

గంభీరంగా, ఎత్తుగా, ఆరోగ్యంగా, దృఢంగావుండే అతని శరీరాకృతి చూస్తూ క్షణం మైమరచిపోయింది.

మధురమయిన కోరికలు మదిలో తలఎత్తుతూ హృదయాన్ని కదలించసాగాయి.

"ఊర్మిళా." లాలనగా పిలిచాడు.

ఆమె పలకలేదు.

ఉదయ్‌కృష్ణ బట్టలు మార్చుకుని తలదువ్వుకుంటూ అన్నాడు.

"మరి నన్ను ఇంట్లో వుండొద్దు అన్నావుగా వెళ్ళిపోతున్నాను"

ఆమె మాట్లాడలేదు అటు తిరిగి పడుకుంది.

దగ్గరగా వచ్చి "నేను వెళ్ళిపోతున్నాను" అన్నాడు.

ఊర్మిళ పలకలేదు. ఇటు తలతిప్పి చూడలేదు.

అతనువంగి ఆమె చెంపమీద సున్నితంగా పెదవులతో ఒత్తి నవ్వుతూ అక్కడనుండి వెళ్ళిపోయాడు.

* * * *

ఆరోజు ఊర్మిళ అతనికంటికి అసలు కనిపించలేదు. మర్నాడు కనిపించలేదు.

ఉదయ్‌కృష్ణకి నవ్వు వచ్చింది.

ఈ అమ్మాయికి ఎంతెంత పౌర్షాలు!

తన గుండెనొప్పి అని నాటకం ఆడినందుకు ఆమెకు తనమీద బాగా కోపం వచ్చింది అని తెలుస్తుంది.

ఈకోపం ఎన్నాళ్ళు!



తండ్రి పూనానుండి వచ్చాక తన మనసులో మాట చెప్పేస్తే ఆయన తన మాటలకి ఆనందించి శేఖర్ తండ్రికి ఏదోవిధంగా నచ్చజెప్పి పెళ్ళి ఆపుచేయించి ఊర్మిళకి తనకి పెళ్ళి జరిపిస్తారు

అప్పుడు ఆమె కోపం అంతా ఏమౌతుంది.

తన చేతులలో బందీ అయిపోయి కరిగిపోతుంది.

ఉదయ్‌కృష్ణ మనసంతా సంతోషంతో నిండిపోయింది.

# 18

మృత్యుంజయరావుగారు పూనానుండి వచ్చేశారు. ఊర్మిళ మామూలుగానే ఆ ఇంట్లో తిరుగుతుంది.

ఉదయ్‌కృష్ణ ఎదుటపడినా తల పక్కకు తిప్పుకుని వెళ్ళిపోతుంది

అతను నవ్వుకుంటూ వెళ్ళిపోతాడు.

ఆరోజు ఉదయం మృత్యుంజయరావుగారు హాలులో కూర్చుని ముందురోజు సాయంత్రం వచ్చిన వుత్తరాలు ఒక్కొక్కటి చదవసాగారు.

దానిలో ఒక వుత్తరం శేఖర్ తండ్రి వ్రాసినది.

పెళ్ళిగురించి ఏదో వ్రాసివుంటారు అని చదవసాగారు.

ఒక్కొక్క వాక్యం చదివేకొద్దీ ఆయన కనుబొమ్మలు కోపంతో ముడుచుకున్నాయి.

ఉత్తరం పూర్తిగా చదివి మడతపెట్టి కవర్లో పెట్టేశారు.

ఆయనకు కోపం ఎంత ఆపుకోవాలన్నా ఆగటంలేదు. అతికష్టంమీద కోపం ఆపుకున్నారు.

ఆ రాత్రి భోజనాలు అయ్యాక కొడుకుని హాలులోకి పిలిచి తనకి ఎదురుగా సోఫాలో కూర్చోమని చెప్పారు.

ఉదయ్‌కృష్ణ మనసులోనే ఆనందించాడు. తండ్రితో ప్రత్యేకంగా మాటాడే అవకాశం ఆయనే కలిపించినందుకు.

తన మనసులోమాట చెప్పడానికి ఇదే సమయం అని తలచాడు. మృత్యుంజయరావుగారు కొడుకు ముఖంలోకి పరిశీలనగా చూశారు క్షణంసేపు.

కొడుకు ముఖం సంతోషంతో యింత దీప్తివంతంగా ప్రకాశించటం ఆయన ఎప్పుడూ చూడలేదు.

కారణం చూచాయిగా గ్రహించినా అది అవునా కాదాఅని నిర్ధారణ కాలేదు.

చేతిలో ఉత్తరం కొడుకు చేతిలో పెట్టారు.

"ఎవరు వ్రాశారు!" అడిగాడు.

"శేఖర్ తండ్రి వ్రాశాడు. చదువు నీకే తెలుస్తుంది" అన్నారు ఆయన.

ఉదయ్‌కృష్ణకి ఏదో అనుమానం వచ్చింది.



తనకు వచ్చిన ఉత్తరం ప్రత్యేకంగా తీసుకువచ్చి తనకి చదవమని ఇవ్వటం ఆశ్చర్యం కలిగి ఉత్తరం చదివాడు.

"మీరు పూనా వెళ్ళారని నాకు తెలీదు. మీ మేనకోడలకి వస్తువులకి బట్టలకి డబ్బు ఇవ్వడానికిగాను వైజాగ్ వచ్చాను. ఈ పెళ్ళి జరగటంలేదని ఈ వుత్తరంలో మీకు తెలియచేస్తున్నాను. మా అబ్బాయి శేఖర్‌కి అదే ముహూర్తానికి నాకు తెలిసినవాళ్ళ అమ్మాయితో పెళ్ళి జరిపించడానికి నిశ్చయించాను.

ఈ నిశ్చయానికి నేను తొందరపడి రాలేదు మీ యింట్లో మీ మేనకోడల్ని నేనూ మా అబ్బాయి చూసి ఇష్టపడే పెళ్ళికి ముహూర్తం నిశ్చయించుకున్నాం.

అయితే ఇప్పుడు ఆ నిశ్చయం మారిపోయింది. అది మా తప్పుకాదు అని మనవి చేసుకుంటున్నాం.

నేను మొన్న వైజాగ్ వచ్చినప్పుడు, మీ అబ్బాయి ఉదయ్‌కృష్ణకి ఒంట్లో బాగాలేదు మేడమీద ఉన్నారని నౌకర్లు చెపితే నేనే మేడమీదకు వెళ్ళాను.

ఆ గదిలో మీ అబ్బాయి ఊర్మిళ వున్నారు. వాళ్ళ చనువుని నేను కళ్ళారా చూశాను. ఇది ఒకళ్ళు చెప్పిందీ, విన్నదీకాదు, నా కళ్ళారా నేను చూశాను.

అందుకే ఆమెను నా కోడలిగా చేసుకోవాలన్న నా నిర్ణయం మార్చుకున్నాను.

మీ అబ్బాయితో ఆ అమ్మాయి చనువుగా వుండటంచూసి ఈ పెళ్ళి గనుక చేసేస్తే ఇటు మా అబ్బాయి, అటు మీ అబ్బాయి, ఆ అమ్మాయి ముగ్గురి జీవితాలు నాశనం అయినట్టే, వాళ్ళిద్దరికీ ఒకరిమీద ఒకరికి అంత ఇష్టంవున్నట్టు మీకు తెలీదా! తెలిసీ ఈ పెళ్ళి చెయ్యడానికి సిద్ధపడ్డారా!

నాకు నా కొడుకు జీవితం ముఖ్యం. వాడికి మరో అమ్మాయితో పెళ్ళి జరిగితే వాడు సుఖపడతాడు.

మీరుకూడా వాళ్ళిద్దరికీ పెళ్ళి జరిపించేస్తే మంచిది అని నా ఉద్దేశం. అదే మీ ఉద్దేశంకూడా అవ్వాలని నా కోరిక! మాట ఇచ్చి తప్పినందుకు మన్నించమని కోరుకుంటున్నాను" అని ఆయన వ్రాశారు.

ఆ ఉత్తరం సాంతం చదవటంతో ఉదయ్‌కృష్ణ ముఖం ఒక్కసారి గంభీరంగా మారిపోయింది.

అతనిముఖం ఎర్రగా అయిపోయింది.

తండ్రికి ముఖం చూపించలేనట్టుగా ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

"అతను వ్రాసింది నిజమేనా!" ఆయన ముఖం గంభీరంగా వుంది.

ఉదయ్‌కృష్ణ మాట్లాడలేదు.

"నీకు ఒంట్లో బాగోలేదా! ఆ సంగతి నాకు ఎందుకు తెలియపర్చలేదు! పోనీ నేనువచ్చాక అయినా చెప్పవచ్చుగా!" ఆయన కంఠం కంగ్‌మంది.

ఈసారికూడా జవాబు ఇవ్వలేదు అతను.



"ముహూర్తం పెట్టుకున్నాక పెళ్ళి ఆగిపోతే ఆడపిల్లకి ఎంత చెడ్డపేరో ఆలోచించావా!"

"తండ్రీ, తల్లీ లేనిపిల్లని ఈ యింటికి తీసుకువచ్చాను. పెళ్ళిచేసి అత్తవారింటికి పంపిస్తానని ఆశపెట్టాను. ఆ ఆశని నా కొడుకే గంగపాలు చేశాడని తెల్సి నేనెంత కృంగిపోతున్నానో తెలుసా!"

"నాన్నగారూ!" అతని కంఠం శాంతంగా పలికింది.

మృత్యుంజయరావుగారు కొడుకువైపు చూశాడు.

"మాటపట్టింపులో గౌరవ మర్యాదల్లో మీ ప్రతిరూపాన్ని. ఆ అమ్మాయికి నావల్ల ఎలాటి అన్యాయం జరగదు. ఆమెను నేను పెళ్ళి చేసుకుంటాను" ధృఢంగా పలికింది అతని కంఠస్వరం.

ఆయన వెంటనే మాట్లాడలేదు

"ఈమాట నువ్వు ఎప్పుడో ఒక అప్పుడు అంటావని నాకు తెలుసు" అన్నారు.

ఉదయ్‌కృష్ణ మాట్లాడలేదు.

"ఉదయ్ నీకు ఆ అమ్మాయితో పెళ్ళి జరుగుతుంది అని కలలోకూడా అనుకోకు" అన్నారు చాలా శాంతంగా.

"నాన్నగారూ!" విస్తుపోయినట్టుగా అన్నాడు.

"ఇంతవరకూ మీరు నా పెళ్ళిగురించి కలవరించారే తీరా నాకు నచ్చిన అమ్మాయి కనిపించాక నేను పెళ్ళిచేసుకుంటాను అంటే మీరు కాదు అంటున్నారు ఎందుకో నాకు అర్థంకావటం లేదు."

"ఆ అమ్మాయికి మన ఇంటికోడలు కాగల అర్హత లేదు అంతే."

"అర్హత అంటే!" రెట్టించినట్టుగా అడిగాడు.

ఆయన మాట్లాడలేదు.

"ఆస్థి, అంతస్థా!" అదోరకంగా నవ్వాడు. ఆ నవ్వులో అర్థం మీరు కూడా ఆస్థి, అంతస్థులని ముడిపెట్టుకుని కూర్చున్నారా! అన్నట్టుంది.

"ఆస్థి అంతస్థులు గురించి నేను ఎప్పుడూ ఆలోచించలేదు ఉదయ్!"

"మరి ఏ విషయంలో సందేహిస్తున్నారు!"

"నన్ను ఆ విషయాలు ఏం అడగొద్దు. నాకు చెప్పటం ఇష్టంలేదు."

"అంటే" అర్థంకాక నుదురు చిట్లించాడు.

"ఇక నన్ను నువ్వు ఏం అడక్కు. నీకు ఆ అమ్మాయితో మాత్రం పెళ్ళి జరగదు" ఖచ్చితంగా చెప్పేశారు.

"నాన్నగారూ!" అతని కంఠం పట్టుదలగా పిలిచింది.

"పెళ్ళి అంటూ చేసుకుంటే ఊర్మిళనే చేసుకుంటాను. లేదా ఇక ఈ జీవితంలో పెళ్ళిమాటే తలపెట్టను" అంటూ తండ్రికి ఖచ్చితంగా చెప్పేశాడు.

"ఉదయ్" ఆయన నిశ్చేష్టులైపోయారు.

అతను బాధను అంతా గుండెల్లో దాచుకోడానికి ప్రయత్నించసాగాడు.

"నువ్వు ఊర్మిళను కాక ఏ అమ్మాయిని అయినా సరే చేసుకుంటాను అంటే నేను కాదనను. ఆ అమ్మాయి మాట మర్చిపో. నేను ఎందుకు చెపుతున్నానో విను" కొడుక్కి నచ్చచెప్పడానికి ప్రయత్నించారు.



'మీరు ఎన్ని అయినా చెప్పండి, నా నిశ్చయం ఇక మారదు."

"ఉదయ్!" కోపంగా పిలిచారు.

"అర్థాంగిని ఎన్నుకోవటంలో పురుషుడు ఎప్పుడూ తెలివి తక్కువగా ప్రవర్తించకూడదు. తరువాత ఈ పెళ్ళి ఎందుకు చేసుకున్నామా అని విచారిస్తారు."

తండ్రి మాటలకు అతను నవ్వాడు.

"నేను ఎప్పుడూ పొరపడను. నా జీవితంలోకి రాబోయే అమ్మాయిలో నేను కోరుకున్న గుణాలు వూహించుకున్న అందాలు ఊర్మిళలో నాకు కనిపించాయి. ఆమె నాకు తగిన అర్థాంగి. ఈ మాట మీరు ఇప్పుడు కాకపోయినా తరువాత అయినా అంటారు." అంటూ లేచి నిలబడ్డాడు.

"అయితే ఈ విషయంలో నీ మనసు మారదా!"

నా కంఠంలో ప్రాణంవుండగా మారదు" అంటూ అక్కడనుండి వెళ్ళిపోయాడు.

కొడుకు వెళ్ళినవైపు చూస్తుండిపోయారు.

## 19

మృత్యుంజయరావుగారికి కొడుకు పట్టుదల విషయంలో మతిపోకుంది.

ఆయనకి ఆ రాత్రి అంతా నిద్రపట్టలేదు.

ఊర్మిళ జాలిగా చూస్తూ తన కళ్ళెదుట నిలిచినట్లు అయింది.

భరించలేని ఆవేదనతో కళ్ళు గట్టిగా మూసుకున్నారు.

ఊర్మిళ నిజంగా అమాయకురాలు.

ఆ సంగతి తనకు తెలుసు. ఆమె అమాయకత్వం, మంచితనం, గొప్పగుణం చూసే జాలితో తన యింటికి తీసుకురావటం జరిగింది.

అయితే ఆ అమ్మాయిని తన కోడలిగా చేసుకునే ఉద్దేశంతో తీసుకురాలేదు.

ఎంత డబ్బుపోసి అయినాసరే ఆ అమ్మాయికి మంచి సంబంధం చూసి పెళ్ళిచెయ్యాలని తలపెడితే ఆ పెళ్ళి ఇలా బెడిసి కొట్టింది. ఉదయ్ కృష్ణ ఇప్పుడు ఆ అమ్మాయి ఆకర్షణలోపడి పెళ్ళిచేసుకుంటాను అంటుంటే.

తను ఇప్పుడు ఏమిటి చెయ్యటం!

ఆ అమ్మాయి గురించి అంతా తనకి తెలుసు.

తెలిసి ఆమెను తన కోడలిగా ఎలా చేసుకోవటం!

తెలియకపోతే అది వేరేసంగతి.

ఇప్పుడెలా?

ఇదీ సంగతి అని కొడుక్కి తను చెప్పలేదు.

చెప్పకపోతే ఉదయ్ పట్టువిడవడు.

ఇప్పుడు ఏమిటి చెయాలి?

కొడుక్కి తెలియకుండా ఊర్మిళతో చెపితే!

నా కొడుకు నిన్ను తప్ప ఎవ్వర్ని పెళ్ళి చేసుకోను అంటున్నాడు.



వాడు నిన్ను అడిగితే నాకీ పెళ్ళి ఇష్టంలేదు అని చెప్పమంటే అలాగే చెపుతుంది. ఆమెది అంత మంచిమనసు.

కాని అలా చెప్పించటం అన్యాయమే అవుతుంది. ఊర్మిళకూడా మనిషేకదా. అందరిలాగే ఆమెకూ ఒకమనసు వుంటుంది.

ఉదయ్ ఆమెను పెళ్ళిచేసుకుంటాను అని పట్టుపడుతున్నాడు అంటే ఇద్దరిమధ్యా ఆకర్షణ పెరగకుండా వుందా?

ఏ స్త్రీ కూడా తనకి ఇష్టంలేని పురుషుడ్ని దగ్గరకు రానివ్వదు శేఖర్ తండ్రి తనకి ఉత్తరంలో వ్రాసిన దాన్ని బట్టి.

వాళ్ళిద్దరిమధ్యా చనువు పెరిగి వుంటుంది.

అది మాత్రం నిజం.

ఆ అమ్మాయి అంటే తనకి ఏ మాత్రం కోపంలేదు.

నిజానికి అలాటి అమ్మాయి ఈ యింటికి కోడలుగా రావటం అదృష్టంకూడా.

అయితే ఆ ఒక్క కారణం గురించే తన ఆలోచన అంతా.

ఊర్మిళని తన కొడుక్కి చేసుకోకపోవడానికి అదే కారణం.

అందుకే ఈ పెళ్ళి జరగదు.

ఈ విషయంలో కొడుక్కి ఎలా నచ్చ చెప్పటం!

ఆయన ఆలోచిస్తూ పడుకున్నారు.

నిద్రమాత్రం రావటంలేదు.

మర్నాడు ఉదయం.

ఊర్మిళ మామూలుగా తన పనులు తను చూసుకుంటుంది. ఆమెలో మార్పు లేదు.

మృత్యుంజయరావుగారికి రోజూలాగే వేళకు ఏం కావాలో చూస్తుంది.

ఆమెను చూస్తుంటే ఆయనకి జాలి కలగసాగింది.

పాపం ఈ అమ్మాయికా అన్యాయం చెయ్యటం!

మాయామర్మం తెలియని అమాయకురాలు తను ఎలా అంటే అలాగే అంటుంది.

ఆయనకు ఎటూ పాలుపోలేదు.

ఊర్మిళకి రాత్రి తండ్రీ కొడుకులమధ్య జరిగే ఘర్షణ గురించి తెలీదు.

శేఖర్ తండ్రి అలా ఉత్తరం వ్రాసినట్లూ తెలీదు.

ఆరోజు తండ్రీ కొడుకులు ఇద్దరూ మాట్లాడుకోలేదు.

ఆ సంగతి ఊర్మిళకు వింతగా ఏమీ అనిపించలేదు.

తండ్రీ కొడుకులు ఇద్దరూ ఇంటిదగ్గరవుండేదే చాలా తక్కువ. వాళ్ళు మాట్లాడుకోవటం కూడా అంతంత మాత్రమే. అందుకే ఆ విషయంలో ఆమెకు అనుమానం రాలేదు.

ఒక వారం రోజులు వరకూ తండ్రీకొడుకులు మాట్లాడుకోలేదు.

మృత్యుంజయరావుగారికి ఆలోచిస్తుంటే ఏం చెయ్యాలో అర్థంకాలేదు.

కొడుకు పట్టుదల చూస్తుంటే ఆ అమ్మాయితో వాడి పెళ్ళి జరిపించేస్తే అనిపిస్తుంది ఒక్కోసారి.



Cultural Associa… NANDYAL-518

ఒక్కోసారి ఆలోచిస్తుంటే ఆ అమ్మాయిని ఈ యింటికి కోడల్ని చెయ్యటం మంచిదికాదు అనిపిస్తుంది.

కొడుకు ఇష్టపడుతున్నాడని ఇప్పుడు వాళ్ళిద్దరికీ పెళ్ళిచేసేస్తే ఉదయ్‌కి ఆ తరువాత నిజం తెలిస్తే!

ఒక పచ్చని సంసారం కూలిపోతుంది.

గాఢంగా నిట్టూర్చారు.

* * * *

ఆరోజు మృత్యుంజయరావుగారు కొడుకుని తన గదిలోకి పిలిచారు.

ఎందుకు పిలిచారు అన్నట్టు అతను ఆ గదిలోకి అడుగుపెట్టాడు.

అలా కూర్చో నీతో మాట్లాడాలి అని చెప్పటంతో అక్కడున్న సోఫాలో కూర్చున్నాడు.

ఏమిటో చెప్పండి అన్నట్టుగా చూస్తూ.

అతని ముఖం గంభీరంగానూ లేదు, అలా అని శాంతంగానూ లేదు.

"నేను చెప్పిన విషయం గురించి ఏం ఆలోచించావు!"

"ఆలోచించేదేముంది! నా నిర్ణయం మారదని మీకు ఆరోజే చెప్పేశాను" మామూలుగా అన్నాడు.

"అంటే నువ్వు ఊర్మిళని చేసుకోవడానికే నిర్ణయించుకున్నావన్న మాట."

అతను తల ఊపాడు అవునన్నట్టు.

"ఉదయ్ నేను నీ మంచికోరి చెపుతున్నాను. నువ్వు ఆ అమ్మాయిని మర్చిపో" ఆయన శాంతంగా చెప్పారు.

"నాన్నగారూ! అది ఈ జన్మలో జరగనిపని."

"అయితే నామాట వినవా!"

"ఏమాట అయినా వింటాను. ఈ మాట తప్పించి."

"ఊర్మిళకూ నీకూ పెళ్ళి జరిపిస్తే నీవు ఆమెను అర్థం చేసుకుంటావా! అని నా అనుమానం"

"ఎందుకు అర్థంచేసుకోను! భార్యాభర్తలు అయ్యాక ఒకర్ని ఒకరు అర్థంచేసుకోకపోతే ఆ పెళ్ళికి ఇక అర్థం ఏముంటుంది!"

మృత్యుంజయరావుగారు క్షణంసేపు ఏం మాట్లాడలేదు. ఆ తరువాత మెల్లగా అన్నారు.

"నేను ఊర్మిళతో మాట్లాడిన తరువాత అప్పుడు నీకు చెప్తాను"

ఉదయ్‌కృష్ణ తలవూపి అక్కడనుండి వెళ్ళిపోయాడు.

మృత్యుంజయరావుగారు ఒక నిశ్చయానికి వచ్చారు.

ఊర్మిళతో మాట్లాడి ఈ పెళ్ళి జరిపించేయటం మంచిది అని. కొడుకు ఏ విషయంలో అయినా పంతంపడితే ఆ పంతం విడవడని తెలుసు.

కొడుకు మనసు బాధపడటం ఆయనకి ఇష్టంలేదు.

ఒక్కగానొక్క కొడుకు ఒకే ఒక కోరిక కోరితే కాదనటమా!

ఏమైతే అయింది పెళ్ళి చేసేయడానికే నిశ్చయించుకున్నారు.

ఊర్మిళని తనగదిలోకి పిలిచారు.

ఆమె మెల్లగా ఆయన గదిలోకివచ్చి "పిలిచారా!" అని అడిగింది.



ఆమెను అక్కడ సోఫాలో కూర్చోమని చెప్పి,

"ఉదయ్ నాతో మీ విషయం గురించి మాట్లాడేడు" అన్నారు మామూలుగా.

అతనిమాట ఆయన ఎత్తటంతో ఆమె చూపులు నేలకు అంటుకు పోయాయి.

తల పైకిఎత్తలేదు. ఆయన తమ ఇద్దరి గురించి ఏమనుకుంటున్నారో అని భయం కలిగింది.

"చూడమ్మా నీ మనసులో ఏముందో నాకుచెప్పు! దీనిలో నువ్వు సిగ్గుపడి భయపడవలసింది ఏంలేదు. నువ్వు ఏమిటో నీ మంచితనం ఏమిటో నాకు తెలుసు."

ఊర్మిళ మాట్లాడలేదు తలఎత్తి ఆయనవైపు చూడలేదు. తన చేతి గోళ్ళవైపు శ్రద్ధగా చూస్తూ అలాగే కదలకుండా కూర్చుంది.

"ఉదయ్‌ని పెళ్ళిచేసుకోవటం నీకు ఇష్టమేనా చెప్పు తల్లీ!"

ఆమెకు సమాధానం చెప్పాలి అంటే గొంతుకలో నుండి మాటపైకి రావటం లేదు.

"నీకు ఇష్టం అయితే మీ ఇద్దరికీ ఈ ముహూర్తానికే పెళ్ళి జరిపించేస్తాను."

"మీ ఇష్టం. మీకు ఎలా తోస్తే అలాచెయ్యండి" అంది మెల్లగా.

ఆ మాటలు నూతిలోనుండి వెలువడినట్టు అతి మెల్లగా వినిపించాయి.

శేఖర్ తండ్రి అలా ఉత్తరం వ్రాసినట్టు చెపితే ఆమె ఇంకా సిగ్గుపడి బాధపడుతుంది అని అలా చెప్పకుండా, శేఖర్‌కి దగ్గర సంబంధం వుందట. వాళ్ళు ఆ అమ్మాయిని చేసుకోమని పట్టు పడుతున్నారట. అందుకని శేఖర్‌కి ఆ అమ్మాయితో పెళ్ళి జరిపిస్తారట. మీ మేనకోడలికి వేరే సంబంధం చూసుకోమని వ్రాశారు అని ఆయన ఆమెతో చెప్పారు

శేఖర్‌తో తన పెళ్ళి తప్పిపోయినందుకు ఊర్మిళ మనసులోనే ఆనందించింది. పైకి మాత్రం ఆనందాన్ని ప్రకటించలేదు.

"ఉదయ్‌కృష్ణకి ఈ విషయం చెప్తే నిన్ను తను వివాహం చేసుకుంటానని నాతో చెప్పాడు. నీకు ఇష్టం అయితే ఇదే ముహూర్తానికి మీకు ఇద్దరికీ పెళ్ళి జరిపించేస్తాను."

ఊర్మిళ మాట్లాడలేదు.

"ఊర్మిళా!" ఆయన కంఠస్వరంలో ఆప్యాయత నిండుగా తొణికిసలాడింది.

"నీ మౌనాన్ని బట్టి నీకు ఇష్టమే అని అనుకుంటున్నాను. మీ పెళ్ళి చేసేముందు నేను ఒక్కమాట చెప్తాను విను" అంటూ క్షణంసేపు ఆగారు.

ఆయన ఏం చెపుతారో అన్నట్టు అలా చూడసాగింది.

"పెళ్ళి అయ్యాక కొన్ని నిజాలు భర్తకి కూడా చెప్పకపోవటం మంచిది అనే నా ఉద్దేశం. నీ భర్త నిన్ను ఎంత పువ్వుల్లో పెట్టి చూస్తున్నా నిజం మాత్రం ఎప్పుడూ చెప్పకూడదు. నిన్ను ఏ పరిస్థితుల్లో ఈ యింటికి తీసుకు



వచ్చాను అని ఎప్పుడూ చెప్పకు, చెప్పావో నీ సంసారం కూలిపోయిందనే అనుకో. అందుకే నీవు తెలివిగా ప్రవర్తించాలి. ఉదయ్ ఎప్పుడు ఏ విషయంలో నిన్ను ఏం అడిగినా నిజం మాత్రం చెప్పకు. నేను చెప్పినట్టే నువ్వు చెప్పు. అంతే అంతకుమించి ఏం చెప్పకు" అంటూ చెప్పారు.

ఆమె అలాగేనంటూ తల ఊపింది.

ఊర్మిళ ఆ గదిలోంచి వెళ్ళిపోయింది.

## 20

ఊర్మిళ మనసు ఆనందంతో చిందులు త్రొక్కసాగింది. తనకి ఉదయ్‌కృష్ణకి పెళ్ళా!

ఇది కలా! వాస్తవమా!

తను పెళ్ళికి మృత్యుంజయరావుగారు ఒప్పుకున్నారు.

ఎంత విచిత్రం! తన గురించి అంతా ఆయనకి తెలుసు. అయినా తనని ఈ యింటికి కోడలిగా చేసుకుంటున్నారు.

ఇది ఆయన గొప్పగుణం కాకపోతే ఏమిటి!

చూస్తూ చూస్తూ తన కొడుక్కి ఎవరైనా తనలాంటి అమ్మాయిని కొడుక్కి చేసుకుంటారా!

పైగా తన గురించి ఏమీ కొడుకుతో ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దని చెపుతున్నారు.

నిజంగా ఆయనది ఎంత మంచిమనసు!

ఆయనపట్ల మనసంతా కృతజ్ఞతాభావంతో నిండి పోయింది.

ఆయన చేసిన ఉపకారం తను మరవగలదా! ఈ జన్మలోనే కాదు ఎన్ని జన్మలు ఎత్తితే ఆయన ఋణం తను తీర్చుకోగలదు!

ఉదయ్ కృష్ణ గుర్తుకు వస్తూనే ఆమె చెంపలు ఎర్రబడ్డాయి.

అతనికి తను భార్య కాగలటం నిజంగా ఎంత అదృష్టం!

ఎక్కడ పుట్టింది! ఎక్కడ పెరిగింది! ఇప్పుడు ఎవరింటికి కోడలు కాబోతుంది! ఆమె కళ్ళనీళ్ళు గిరున తిరిగాయి.

తను కలలోకూడా వూహించలేదీ అదృష్టం.

తను ఒక గొప్పింటి కోడలు కాబోతుంది

సంఘంలో పేరూ పలుకుబడీ వున్న వ్యక్తికి అర్ధాంగి కాబోతుంది. ఇది అదృష్టంకాదా!

కళ్ళుమూసుకుని భగవంతుడ్ని ప్రార్థించింది.

తన దాంపత్య జీవితం సంతోషంగా చల్లగా సాగిపోవాలని ఆమె మనసంతా ఆనందంతో నిండిపోయింది.

*    *    *    *

మృత్యుంజయరావుగారు ఆరోజు కొడుకుతో ప్రత్యేకంగా మాట్లాడారు.



"ఉదయ్ నీకూ ఊర్మిళకూ ఈ ముహూర్తానికే పెళ్ళి జరిపించేయడానికి నిశ్చయించుకున్నాను. నీతో కొన్ని సంగతులు చెప్పి పెళ్ళిపనులు చేయించాలని" అంటూ ఆగారు.

తండ్రిమాటలు వింటూనే అతని అంతర్యం అంతా సంతోషంతో పురివిప్పిన నెమలిలా నాట్యం చేయసాగింది

తండ్రి తన పెళ్ళికి ఒప్పుకుంటారని అనుకోలేదు.

ఆశ్చర్యంగా వుంది. ఈ సంగతి ఊర్మిళకి తెలుసా!

"ఉదయ్ పెళ్ళంటే బొమ్మలాట కాదు నూరేళ్ళపంట నీవు ఊర్మిళను పెళ్ళి చేసుకోబోయే ముందు ఈమాట నీ దృష్టిలో వుంచుకోవాలి"

అతనికి ఆ మాటలు అర్థంకాలేదు

తండ్రి తనకి ఈ మాటలన్నీ ఎందుకు చెపుతున్నట్లు.

తండ్రి మాటలకు తల వూపాడు అలాగేనంటూ.

"ఆ అమ్మాయికి ఈ యింటికి కోడలుకాగల అర్హత లేకపోయినా నీ పట్టుదలతో యిక కాదనలేక ఈ పెళ్ళి జరిపిస్తున్నాను. అర్ధాంగి అంటే నీ జీవితంలో సగభాగం పంచుకుని కష్టాల్లో నీకు తోడుగానిలిచి భర్తే తన ప్రపంచమని మురిసిపోయే అమాయకురాలు. ఎవరేమన్నా ఎట్టి పరిస్థితుల్లోకూడా భార్యను అవమానించి ఆమెను దుఃఖపెట్టకూడదు. నీచేత తాళి కట్టించుకుని నీ యింటికి వచ్చిన నీ ఇల్లాల్ని సంతోషపరచి ఆనందించేలా చెయ్యాలి"

ఉదయ్ కృష్ణ మాటాడలేదు.

"ఊర్మిళ నా ప్రాణస్నేహితుని కూతురు. తను చచ్చిపోతూ నన్ను నమ్మి తన కూతురి బాధ్యతలు నాకప్పగించి కళ్ళుమూశాడు. ఆ అమ్మాయి మనసు నొప్పి ఎప్పు

డయినా బాధ పెట్టినా ఆమెను కష్టపెట్టి కన్నీళ్ళు తెప్పించినా నాకు కోపం వచ్చేస్తుంది మన ఇద్దరం తండ్రీకొడుకులం అనికూడా ఆలోచించను. ఆ సంగతి నువ్వు గుర్తుంచుకో"

ఇదంతా ఊర్మిళమీద ఆయనకు వుండే అభిమానంతో ఆయన ఇలా అంటున్నారని తలచి తనలో తానే నవ్వుకున్నాడు.

తను ఊర్మిళ మనసు ఎందుకు కష్టపెడతాడు!

ఆమె అంటే ఎవరు! తనకి ప్రాణానికి ప్రాణంకాదూ!

మృత్యుంజయరావుగారు కొడుకుతో మాటాడి ఆమె మనసు ఎప్పుడూ కష్టపెట్టను అని మాటతీసుకుని తేలిగ్గా నిట్టూర్చారు.

## 21

ఆరోజు రాత్రి ఎనిమిది గంటలకు ఉదయ్ కృష్ణ, ఊర్మిళకు పెళ్ళి.

ఇంటిముందు ఖాళీ స్థలంలో షామియానాలు వేయించి రంగురంగుల బల్బులతో పువ్వులతో రంగుల కాగితాలతో అంతా అలంకరించేశారు.



పెళ్ళిమంటపం అంతా పట్టి పువ్వులతో అలా నిలబెట్టారు.

పెళ్ళి ఇల్లు అంతా కళకళలాడుతూ ఇంద్రభవనంలా మెరిసిపోతూంది.

పెళ్ళి పీటలపై ఉదయ్ కృష్ణ ఫుల్ సూట్‌లో పెళ్ళి ముస్తాబులో కూర్చున్నాడు.

మెడలో గులాబీపూలదండ, చెమ్కీ దండ, కర్పూర హారంతో తలకి తెల్ల సిల్కు పాగతో కళ్ళకి కనీ కనిపించని కాటుక, కుడి చెంపన చుక్కతో, నుదుట కళ్యాణబొట్టుతో మనిషి హుందాగా అందంగా లైట్ల వెలుగులో మెరిసిపోతున్నాడు.

అతనికి పోటీగా ఊర్మిళ పెళ్ళి ముస్తాబులో రవ్వల బొమ్మలా మెరిసిపోతుంది.

సంపంగిరంగు జరీ పువ్వులున్న పట్టుచీర దానికి మ్యాచింగ్ జాకెట్ వేసుకుంది.

కళ్ళకు కాటుక రేఖలు, నుదుట కళ్యాణబొట్టు, చెంపకు చుక్క, పువ్వులజడ, మెడలో పూలహారాలు, మెడకి రవ్వల నెక్లెసు పొడవుగా పెద్ద పతకంతో వున్న ముత్యాలహారం చెవులకి జూకాలు, పాపిట గొలుసు, నడుముకి వడ్డాణంతో ఊర్మిళ లైట్ల కాంతిలో తళతళా మిలమిలా మెరిసిపోతుంది.

మంగళ వాయిద్యాలు మారు మ్రోగుతున్నాయి.

పురోహితుడు మంత్రాలు చదువుతున్నాడు.

మృత్యుంజయరావుగారి మనసంతా సంతోషంతో నిండిపోయింది.

తన కొడుకు పెళ్ళి ఇలా కళ్ళారా చూస్తాను అనుకో లేదు.

ఆయనకి మహానందంగా వుంది.

పెళ్ళికి ఎంతమందో లెక్కలేకుండా వచ్చారు

పెళ్ళికి వచ్చిన వాళ్ళందరికీ ఐస్ క్రీమ్ ఇస్తున్నారు. సర్వర్స్ ఐస్ క్రీమ్ కప్పులు ట్రేలో పెట్టుకుని ఒక్కొక్కళ్ళకి ఇస్తున్నారు.

ఉదయ్‌కృష్ణ చిరునవ్వుతో ఆమెవైపు ఓరగా చూశాడు.

అతని ముఖం వెన్నెల జ్యోత్స్నలా వెలిగిపోతూ వుంది.

ఊర్మిళ సిగ్గుతో తలవంచుకుంది.

ఆమె ముఖంమీద సిగ్గుదొంతరలు వ్యాపించాయి. ఆమె నేత్రాలలో అంతకు ముందున్న కాంతులు ద్విగుణీకృతం అయ్యాయి.

పౌరోహితుడు మంత్రాలు చదువుతుంటే మంగళవాయిద్యాలు మారుమ్రోగుతుంటే ఉదయ్‌కృష్ణ ఊర్మిళ మెడలో మూడుముళ్ళు వేశాడు. పెళ్ళికివచ్చిన వాళ్ళందరూ ఆ నూతన దంపతులను ఆశీర్వదిస్తూ వారిపై అక్షింతలు జల్లారు.

పెళ్ళితంతు ముగిసింది.

o o o o



ఉదయ్‌కృష్ణ, ఊర్మిళ తిరుపతి ప్రయాణం అయ్యారు.

డిస్కవరి ఆఫ్ ఇండియాకి టిక్కెట్ తీసుకున్నాడు. ఢిల్లీ, కాశ్మీర్, కొచ్చిన్, హైద్రాబాద్, బెంగుళూరు, మొదలగు వూళ్ళు వెళ్ళి ఆరోజు ప్లయిన్‌లో దంపతులు ఇద్దరూ తిరుపతి వెళ్ళారు.

అక్కడినుండి ముఖ్యమైన వూళ్ళన్నీ తిరిగొచ్చారు.

ఇంటికివచ్చి ఇరవై రోజులైంది.

ఊర్మిళ ఆ యింట్లో మునుపటిలా కాకుండా ఇంకా స్వతంత్రంగా తిరగసాగింది.

ముందు మృత్యుంజయరావుగారికి ఏం కావాలో చూసిన తరువాత అప్పుడు భర్తకి ఏం కావాలో చూస్తుంది. ప్రతీ చిన్న విషయానికి పనివున్నా లేకపోయినా ఉదయ్ కృష్ణ భార్యను అస్తమానూ ఏదో వంకమీద పిలుస్తూనే వుంటాడు.

ఊర్మిళ భర్తపిలుపు వినబడటంతో చేస్తున్న పని వదిలి కంగారుగా పరిగెత్తుకుంది.

ఆమెను చూస్తూనే నవ్వుతూ దగ్గరకువచ్చి చేతులతో చుట్టేస్తాడు.

"నా పెన్ ఎక్కడ పెట్టానో కనిపించటం లేదు. నువ్వుగాని చూశావేమో అని" అంటాడు.

ఆమె తెచ్చిపెట్టుకున్న కోపంతో అతనివైపు రుసరుసలాడుతుంది

"మీ పెన్ ఎక్కడ పెట్టారో నాకేం తెలుసు. అది కూడా నేనే వెతికిఇవ్వాలా!" అంటుంది.

"ప్లీజ్" అంటూ బ్రతిమాలితే.

ఆమె ఒక్కసారి భర్త చేతులవైపు చూస్తుంది

తనని కదలకుండా చుట్టేసిన ఆ చేతులు విడిపించుకోవడానికి ప్రయత్నిస్తూ.

"మీరు ఇలా బంధిస్తే నేను పెన్ ఏం వెతుకుతాను నా ముఖం" అంటుంది.

"ఓ సారీ ఐయామ్ వెరీ వెరీ సారీ" అంటూ నవ్వుతూ ఆమెను వదిలిపెడతాడు.

ఆమె తిన్నగా వెళ్ళి టేబుల్ పై చూస్తోంది.

అక్కడ టేబుల్ పై ఎదురుగుండానే వుంటుంది పెన్.

"ఇదిగో పెన్ ఇక్కడే వుంది మీకు కనిపించలేదూ" అంటూ తీసి భర్తకు అందిస్తుంది.

ఆ పెన్ అందుకుంటూ అతను ఆశ్చర్యంగా.

"అరే నేను ఇప్పుడే ఈ టేబుల్ అంతా వెతికాను, నాకు కనిపించలేదు" అంటాడు.

"ఫూ, కనిపించలేదు అన్నీ వేషాలు" అంటూ ఆమె అక్కడనుండి వెళ్ళిపోబోతుంటే—

అతను చటుక్కున ఆమె చెయ్యి అందుకుని—

"ఏది నా మామూలు" అంటూ దగ్గరకు లాక్కుని ఆమెను కొద్ది క్షణాలు మాట్లాడనివ్వకుండా ఉక్కిరిబిక్కిరి చేసేస్తాడు.

భర్త చేతులు విడిపించుకుని "అందుకే నాకు ఒళ్ళు మండుతాది" అంటూ రుసరుసలాడుతూ అక్కడినుంచి వెళ్ళిపోతుంది.



ఉదయ్‌కృష్ణ భార్య వెళ్ళినవైపే చూస్తూ నవ్వుకుంటూ పనిమీద వెళ్ళిపోతాడు

మృత్యుంజయరావుగారు ఆరోజు కోడల్ని పిలిచి ఇనప్పెట్టె తెరిచి వాటిలో వున్న వస్తువులు ఎంతడబ్బు అన్నీ చెప్పి ఆ తాళాలు ఆమెకు అప్పగించారు.

ఆ తాళాలు తీసుకోవడానికి ఆమె ఇబ్బందిపడింది.

"ఇప్పుడెందుకు ఇవ్వటం. మీ దగ్గర వుంచండి మామయ్యగారూ" అంది.

"ఇది నీ యిల్లు నీ ఇంటి బాధ్యతలన్నీ నువ్వు చూసుకోవలసిందే. ఇన్నాళ్ళు అబ్బాయి పెళ్ళి అవ్వాలి కోడలికి ఈ బాధ్యతలు అన్నీ అప్పగించాలి అని ఆరోజుకోసం ఎదురుచూశాను. అనుకున్నట్టుగానే నీకు అప్పగించేస్తున్నాను."

ఆమె మౌనంగా ఆ తాళాలు అందుకుని కళ్ళకద్దుకుంది యింటి పెత్తనం అంతా భార్య చేతికి చిక్కటం చూసి ఉదయ్‌కృష్ణ నవ్వుతూ అన్నాడు.

"ఇకనుండి పైసాపరక్కీ రాణీగారి దగ్గర చెయ్యి చాపాలి కాబోలు"

"అంతేమరి" అంది చిరునవ్వుతో.

"ఏమిటి నీ గొప్ప."

"గొప్పేమరి" గర్వంగా చెప్పింది.

"అయితే వుండు, నీ పని చెపుతాను. రాత్రికి నువ్వు పడుకున్నాక తాళాలు పట్టుకెళ్ళి ఇనప్పెట్టి మొత్తం దోచేస్తాను. తెల్లవారి నువ్వు చూసి తెల్లముఖం వెయ్యాలి" అన్నాడు ఉడికిస్తున్నట్టుగా.

"ఏం తెల్లముఖం వెయ్యను" అంది బింకంగా.

"ఏం చేస్తావు!" కనుబొమ్మలు పైకిఎత్తి కుతూహలంగా ప్రశ్నించాడు.

"పోలీస్‌లకి ఫోన్ చేసి దొంగ మా యింట్లో వున్నాడు వచ్చి బంధించండి అంటాను" అంది గర్వంగా తల ఎగరేస్తూ.

"అయితే ఆ పోలీస్‌లని నేను బ్రతిమాలుకుంటాను" అన్నాడు జాలిగా ముఖం పెడ్తూ.

ఏమని బ్రతిమాలుకుంటారు. అన్నట్టు కళ్ళు విశాలం చేసుకుని భర్తవైపు చూసింది.

"మీకు పుణ్యం వుండేను ఆ బంధించటం నన్ను మా ఆవిడ చేత బంధించేలా చేయండి అంటాను"

అతని మాటలకి ఆమె ఫక్కున నవ్వేసింది.

"నన్ను దొంగ అంటున్నావు అసలు దొంగవి నువ్వే" అంటూ ఆమెను తన గుండెలమీదకు లాక్కుని.

"నా మనసు ఎప్పుడో నువ్వు దొంగిలించావు" అన్నాడు.

"నేనా!" అంది కాస్త కోపంగా.

"మరి నేనా! ఆరోజు ఎంతో అమాయకురాలిలా ఎయిర్ పోర్టుకి వచ్చి అందాల బొమ్మలా నా కళ్ళు మిరుమిట్లు గొలిపి కళ్ళతో గాలంవేసి నా మనసు నా దగ్గర లేకుండా నాకు తెలియకుండా లాక్కుని దొంగలించేశావు."

ఇక ఆ మాటలు మరి తను వినలేనట్టు చెయ్యిచాపి చప్పున అతని నోరు మూసింది.



"ఇకచాలు ఆపండి" అంటూ అతనికి తనముఖం చూపలేనట్టు అతని గుండెల్లో ముఖం దాచుకుంది.

"ఊర్మిళా!" ప్రేమగా ఆమె జుత్తునిసవరిస్తూ చెంపలు నిమిరాడు.

"ఊ" అంది మైమరిచిపోతూ.

"ఆరోజు నువ్వు నన్ను మొట్టమొదట చూసినరోజు నా గురించి ఏమనుకున్నావు?"

"అందరాని చందమామ మీరని, నీటిలో కలువని నేనని ఆకాశంలో వున్న మీరు ఎక్కడ నేను ఎక్కడ అనుకున్నాను."

"ఊర్మిళా!" ప్రేమతో ఆమెను హృదయానికి హత్తుకున్నాడు.

"నిన్ను మా శాక ఆస్తి అంతస్తులు మనమధ్య అడ్డు రాకూడదనుకున్నాను. అందుకే ధైర్యంచేసి నా మనసులో మాట నాన్నగారికి చెప్పేశాను." అన్నాడు నవ్వుతూ.

"చెప్పేసి" అంది కొంటెగా.

"ఏముంది పెళ్ళి చేసేశారు. మన పెళ్ళి అయిపోయింది."

"పెళ్ళి అయ్యాక" అంది భర్తని ఉడికిస్తూ.

అతను వెంటనే సమాధానం చెప్పలేక క్షణం ఆగి,

"పెళ్ళి అయ్యాక" అంటూ ఒక్కోమాట నొక్కి పలికాడు కొంటెతనం ఒలకబోస్తూ.

"ఊ" అంది గారాలుపోతూ. అతను నవ్వాడు. ఆ నవ్వు ఎంతో అందంగా అమ్మాయిల గుండెల్లో గులాబీలు పూసేటంత చక్కగా వుంది.

## 22

ఆరోజు ఉదయ్‌కృష్ణ యింటికి ఫోన్ చేశాడు.

సాయంత్రం ఆరుగంటలకు సినిమాకు వెల్దాం నేను వచ్చేసరికి తయారయి సిద్ధంగావుండు అంటూ.

సాయంత్రం అతను వచ్చేసరికి.

ఊర్మిళ అద్దంముందు కూర్చుని ముస్తాబు అవుతుంది.

ఆమెను అద్దం దగ్గర చూస్తూనే అతను ఆగిపోయి నడుం మీద చేతులుంచుకుని "ఉష్" అన్నాడు.

ఆ ఉష్ అనటంలో నీ ముస్తాబు ఇంకా తెమల్లేదా అన్న హేళన నిండివుంది.

ఊర్మిళ ఒకసారి భర్తవైపు చూసి మూతి తిప్పుకుని ముస్తాబు అవసాగింది.

"టైము అవుతుంది నీవు ఇంకా తయారవలేదా!"

"ఇంకా చాలా టైమువుంది" అంది నిర్లక్ష్యంగా.

"చాలా టైము అంటే మనకోసం రేపు ఉదయం ఆరుగంటలకు సినిమా వేస్తారా." హేళనగా అడిగాడు.

"రేపు ఆరు గంటలకు సినిమా అయితే నేను ఇప్పుడు తయారవటం ఎందుకు? అలా అంటేనే నాకు ఒళ్ళుమండు తుంది" అంది రుసరుసలాడుతూ.

"లేకపోతే ఇంతసేపా ముస్తాబు"



"ఎంతసేపు అయింది. అద్దంముందు ఇలా కూర్చున్నాను, మీరు వచ్చారు."

భార్య మాటలకి అతను గలగలా నవ్వేశాడు.

ఆమె ముక్కుపట్టి ఊపి కొంటెగా చూశాడు.

అతని కళ్ళు చిత్రంగా మెరిశాయి.

ఊర్మిళ అతని చేతిని తోసేస్తూ మూతి ముడుచుకుంది.

"రాణీగారికి అప్పుడే అలక వచ్చేసింది."

"మీలా నేనేం ఉడుక్కోను" అంది నవ్వుతూ.

ముస్తాబు ముగించి డ్రస్సింగ్ టేబుల్ ముందు నుంచి లేస్తూ ఇద్దరూ మనస్ఫూర్తిగా నవ్వుకుంటూ మేడమెట్లవైపు వచ్చారు.

అయ్యగారు వస్తే మేము సినిమాకు వెళ్ళామని చెప్పమని నౌకరుకి చెప్పి ఇద్దరూ కారులో వెళ్ళిపోయారు.

* * * *

ఆరోజు ఆదివారం మృత్యుంజయరావుగారు ఇంట్లోనే వున్నారు.

ఉదయ్‌కృష్ణ పెళ్ళిఅయిన దగ్గరనుండి ఆదివారం యింటిదగ్గరే వుంటున్నాడు.

వెళితే సాయంత్రం భార్యను తీసుకుని సినిమాకో, షికారుకో, ఫ్రెండ్స యింటికో వెల్తాడు.

లేదా యింట్లోనే ఆమెతో కబుర్లుచెపుతూ కూర్చుంటాడు.

మృత్యుంజయరావుగారు వచ్చిన లెటర్స్ చూసుకుంటున్నారు.

ఒక ఉత్తరం చదువుతూనే ఆయన కనుబొమ్మలు ముడుచుకున్నాయి.

ఆరోజే బయలుదేరి కంపెనీ పనిమీద బెంగుళూరు వెళ్ళవలసి వచ్చింది.

కొడుకుని బెంగుళూరు పంపిద్దామన్న ఉద్దేశంతో ఉదయ్‌కృష్ణని పిలిచారు.

పదినిమిషాల తర్వాత అతను గబగబా మేడదిగి—

"పిలిచారా నాన్నగారూ!" అంటూ వచ్చాడు.

"అవును ఈ ఉత్తరం చూడు నువ్వు ఈరోజు బయలుదేరి బెంగుళూరు వెళ్ళాలి అక్కడ వాళ్ళతో ఈ విషయం గురించి వివరంగా మాట్లాడిరా" అంటూ కంపెనీ విషయాలు వాళ్ళతో ఏం మాట్లాడాలి అన్నీ కొడుక్కి వివరంగా చెప్పారు.

చెపుతూ తల పైకిఎత్తి అప్పుడు చూశారు. పరీక్షగా కొడుకువైపు.

ఒక్కక్షణం అతని చెంపవైపు పరిశీలనగా చూసి ముఖం దించుకున్నారు. ఉత్తరాలు చూస్తున్నట్టుగా.

ఆయన పెదవులపై చిన్న చిరునవ్వు మెరిసి మాయమవటం ఉదయ్‌కృష్ణ గ్రహించాడు.



తన ముఖంలోకి ఆయన పరిశీలనగా చూడటం తన చెంపపై ఆయనదృష్టి క్షణంసేపు అలా ఆగిపోవటం గమనించాడు.

వస్తున్న నవ్వుని ఆయన ఆపుకున్నట్టుకూడా గ్రహింపు అయింది.

అతనికి ఏం అర్థంకాలేదు.

మృత్యుంజయరావుగారు కాగితాల్లోనుండి తల ఎత్తకుండానే చెప్పారు.

ఈరోజు ప్లయిన్‌లో నువ్వు బెంగుళూరు వెళ్ళడానికి ప్రయాణం అవమని.

అలాగే వెళతానని తండ్రికి చెప్పాడు.

సరే నువ్వు వెళ్ళు అని చెప్పారు.

ఉదయ్‌కృష్ణ అక్కడనుండి మేడమీదకు వెళ్ళిపోయాడు.

గదిలో సోఫాలో కూర్చున్నాడు.

ఊర్మిళ మంచంమీద దుప్పటి దులిపివేస్తోంది.

పక్కపరుస్తూ తలతిప్పి భర్తవైపు చూస్తూ—

"మీ నాన్నగారు ఎందుకు పిలిచారు!" అని అడుగుతూ—

పక్కపరుస్తున్నది అల్లా అలా వుండిపోయింది అతనివైపు చూస్తూ.

భార్యకూడా అలా చూడటంతో అతనికి ఏదో అనుమానం వచ్చింది.

"ఏమిటి అలా చూస్తున్నావ్!"

భర్తదగ్గరగా వచ్చి ఫక్కున నవ్వింది. అతని ముఖం లోకి చూస్తూ.

"ఏమిటా నవ్వు!" ఉడుక్కున్నట్లుగా అన్నాడు.

ఊర్మిళ చేత్తో నోరు నొక్కుకుంది "అవ్వ" అంటూ.

"మీరు ఇలాగే వెళ్ళారా మామయ్యగారి ఎదుటకి!" అడిగింది.

"ఏం!" అనుమానంగా అడిగాడు.

"ఒక్కసారి ఇలా రండి" అంటూ భర్త చెయ్యిపట్టి లాక్కువెళ్ళి బీరువాకి అమర్చిన అద్దముందు నిలబెట్టింది.

అద్దంలో తన ప్రతిబింబం చూసుకోగానే—

అతని ముఖం ఒక్కసారిగా ఎర్రబడిపోయింది.

తన కుడి చెంపమీద ఊర్మిళ నుదుటి కుంకుమ అంటుకునివుంది.

అలాగే తండ్రి ఎదుటికి వెళ్ళాడు.

అందుకే ఆయన ముఖంచూసి నవ్వు ఆపుకుంటున్నట్లుగా ముఖం క్రిందకి దించుకున్నారు.

తమ భార్యాభర్తల అన్యోన్యత తండ్రి కళ్ళపడింది. అని తలుచుకుంటుంటే అతనికి ఎలాగో వుంది.

మర్నాడు, మరోనాడూ రాకాదు తనతండ్రి.

తలుచుకుంటుంటే మనసు అదోలా అయి ముఖం ఎర్రబడిపోతుంది.

ఇప్పట్లో తండ్రికి ముఖం చూపించకుండా చిన్న ఉయ్యాలతొట్టి లాంటిది ఏదయినా వుంటే కళ్ళు మూసుకుని అందులో పడివుందామనిపించింది అతనికి.



ఊర్మిళ భర్త అవస్థ గమనించిన దానిలా అతన్ని సన్నసన్నగా చివాట్లు వేసింది.

"మీరు మరీను చెపితే ఏమైనా వింటారా! రాత్రి పగలూ మీ కళ్ళకి ఒకటేగా కనిపిస్తాయి.

అతను మాట్లాడలేదు తలతిప్పకుండా కళ్ళు మాత్రమే తిప్పి భార్యవైపు చూశాడు.

"పిలవగానే కంగారుగా పరిగెత్తారు. వెళ్ళే ముందు ఒక్కసారి అద్దంలో అయినా చూసుకోరు" అంది కోపంగా.

అతను మౌనంగా వెళ్ళి మంచంమీద కూర్చున్నాడు.

"ఉండండి పగలు అసలు నేను మేడమీదకే రాను క్రిందనా గదిలోనే వుంటాను" అంది.

ఊర్మిళకుకూడా ప్రాణం నీరైపోతుంది

ఆయనకి తనముఖం ఎలా చూపిస్తుంది!

అసలు ఈ మనిషికి బుద్ధిలేదు. పెళ్ళికాకప్పుడు ఎలా వున్నారో ఏమిటో!

పెళ్ళి అయింది మొదలు తన కొంగుపట్టుకు తిరగటం మొదలుపెట్టారు క్షణం ఎక్కడయినా వదిలితేనా!

అలా అనుకుంటున్న ఆమెకు మనసులో గర్వంకూడా కలిగింది.

ఆయనకు తనూ అంటే ప్రాణం.

భర్త ప్రేమానురాగాలు ప్రతీ స్త్రీకి లభిస్తాయి. ఆ లభించటంలో ఏదో ప్రత్యేకత వుంది.

ఆయనకి తను అంటే కొలవలేని ప్రేమ

మెల్లగా భర్తదగ్గరకు వెళ్ళింది.

అతను మంచంమీద కూర్చుని భార్యవైపు అలా రెప్ప వాల్చకుండా చూడసాగాడు.

ఆమెకూడా అలాగే చూసింది ప్రేమానురాగాలతో.

ఇద్దరి చూపులు ఒకటిగా అల్లుకుపోయాయి. అప్రయత్నంగా భర్త తలని గుండెల దగ్గరికి లాక్కుంది.

అతని చేతులు ఆమె నడుముని చుట్టేశాయి.

## 23

ఉదయ్‌కృష్ణ బెంగుళూరు వెళ్ళి నాలుగురోజులకి తిరిగొచ్చాడు.

రోజులు గడుస్తున్నాయి.

ఈమధ్య ఏదయినా పనివుంటే మృత్యుంజయరావుగారు కొడుకుని పంపిస్తున్నారు. ఏవూరు అయినా వెళ్ళవలసి వుంటే.

పెళ్ళికానప్పుడు అతనే వెళ్ళేవాడు.

పెళ్ళయ్యాక వెళ్ళాలంటే అతను అయిష్టంగా వెల్తున్నాడు.

మృత్యుంజయరావుగారు ఎంతో అర్జంటు అయితే గాని పైవూర్లకి వెళ్ళరు.

తండ్రి వెళ్ళమనగానే భార్యదగ్గర చిరాకు పడిపోయేవాడు నాకు వెళ్ళాలనిలేదని.



ఊర్మిళ నవ్వుకుని తన సూట్‌కేస్‌లో బట్టలు సర్ది భర్తని బతిమాలి ఒప్పించి పంపించేది.

అతను అయిష్టంగా ప్రయాణమై వెళ్ళేవాడు.

అక్కడనుండి ఇంకా పనవలేదు. నన్ను వచ్చెయ్యమంటారా అని తండ్రికి ఫోన్ చేస్తే!

పని పూర్తయితేగాని నువ్వు రావద్దని ఆయన కచ్చితంగా చెప్పేసేవారు.

ఉదయ్‌కృష్ణకి అక్కడ వుండాలంటే ఎలాగోవుండేది.

ఊర్మిళ అందాలరూపం కళ్ళముందు కదులుతుంటే అక్కడ అతనికి ఒక్కక్షణం వుండబుద్ధి పుట్టేదికాదు.

ఆమె దగ్గరకు రావాలనిపించేది.

రావాలంటే అక్కడపని త్వరగా అయ్యేదికాదు.

ఎలాగో అక్కడ తొందరగా పని ముగించుకుని యింటికి బయలుదేరి వచ్చేసేవాడు.

* * * *

రోజులు గడుస్తున్నాయి.

ఉదయ్‌కృష్ణ, ఊర్మిళ పెళ్ళయి ఆరునెలలు కావస్తుంది.

మృత్యుంజయరావుగారికి ఇప్పుడు తలమీద బరువు ఏదో దించినట్లు తేలిగ్గా వుంటుంది.

కొడుకు పెళ్ళివిషయంలో ఆయనకి బెంగగావుండేది.

కొడుకు ఇక పెళ్ళి చేసుకోడేమోనని

ఇప్పుడా బెంగ తీరిపోయింది.

కొడుకూ కోడలూ ఆ యింటిలో తిరుగుతుంటే ఆయనకి సంతోషంగా వుంది.

భార్యగాని ఉంటే కొడుకూ కోడల్ని చూసి ఎంతగా మురిసి పోయేదో!

ఆయనకి తలుచుకుంటే కళ్ళనీళ్ళు తిరిగేవి.

మళ్ళీ అంతలోనే మనసు రాయిచేసుకుని ఏదోపని చూసుకునే వారు.

ఆయనకు ఇప్పుడు కోడలు ఎంత చెపితే అంత.

ఊర్మిళ కూడా ఆయన్ని అలాగే చూస్తుంది ఆయన ఎంతంటే అంతే ఆయన మాటమీదే నడుస్తుంది

ఆరోజు రాత్రి భోజనాలయ్యాక మృత్యుంజయరావు గారు హాలులో కూర్చున్నారు.

కోడల్ని పిలిచి కూర్చోమని యింటివిషయాలు ఏవో మాట్లాడుతున్నారు.

ఊర్మిళ ఆయన మాటలు శ్రద్ధగా వింటూ మధ్య మధ్య తనూ చెపుతుంది.

ఆయనతో మాట్లాడుతూ అప్రయత్నంగా మేడమీదకు చూసింది.

ఉదయ్‌కృష్ణ మేడమీద నిలబడి భార్య తనవేపు ఎప్పుడు చూస్తుందా అని చూస్తున్నాడు.

మృత్యుంజయరావుగారు ఇటు తిరిగి ఆమెకు ఎదురుగా సోఫాలో కూర్చుండటంవలన ఆయనకు ఉదయ్‌కృష్ణ కనిపించలేదు.



ఊర్మిళ ఆయనతో మాట్లాడుతూనే మేడమీదకు ఒకసారి చూస్తుంది.

ఉదయ్‌కృష్ణ భార్య తనవేపు చూడగానే మేడమీదకు రమ్మని సైగచేశాడు

ఊర్మిళ అటు చూడనట్టుగా కూర్చుంది.

అతనికి ఒళ్ళుమండింది. మళ్ళీ సైగ చేశాడు మేడమీదకు రమ్మని.

రాకపోతే చూడు నీపని చెపుతాను అన్నట్టు చూపుడువేలు పెట్టి బెదిరించాడు.

ఊర్మిళ లెక్కచేయలేదు. నిర్లక్ష్యంగా ముఖం తిప్పుకుంది. అతను రమ్మంటున్నా ఆమె వినటంలేదు.

బెదిరిస్తే అసలు లాభంలేదనుకుని జాలిగా ముఖం పెట్టాడు.

కుడిచేయి గుండెలకి ఆనించుకుని దీనంగా ముఖం పెట్టాడు.

ఆమె అతనివైపు అసలు చూడలేదు.

ఊర్మిళకు నవ్వువచ్చి పడిపోతుంది.

వస్తున్న నవ్వుని అతికష్టంమీద బలవంతంగా ఆపుకుంటుంది.

ఉదయ్‌కృష్ణకి ఆమె నిర్లక్ష్యం చూస్తుంటే ఒళ్ళుమండిపోతుంది.

కుడిచేతి వేళ్ళు పెదవులకి ఆనించుకుని శబ్దం బయటకు రాకుండా ప్చ్ అని తనవేళ్ళకు అంటిన మనసులో ప్రేమని గాలిలోకి విసిరాడు ఆమెవైపు.

అయినా ఆమె లక్ష్యపెట్టకుండా ఆయనతో ఏదో మాటాడుతుంది.

ఉదయ్‌కృష్ణకి ఆ దెబ్బతో బాగా ఒళ్ళు మండి పోతుంది.

నేలను కాలితో బలంగా తన్నాడు.

ఉండు నీపని చెపుతా నువ్వు మేడమీదకు ఎలారావో నేనూ చూస్తాను అన్నట్టు విసురుగా గదిలోకి వెళ్ళిపోయి అక్కడనుండి "ఊర్మిళా! ఊర్మిళా!" అంటూ బిగ్గరగా అరిచాడు.

కొడుకు పిలుపు వింటూనే ఆయన కోడలివైపు చూశారు.

భర్త అలా పిలవటంతో ఆమెముఖం సిగ్గుతో ఎర్రబడింది.

"ఊర్మిళా!" మళ్ళీ అతని పిలుపు వినిపించింది.

ఆమె అక్కడనుండి కదలలేదు.

"అబ్బాయి పిలుస్తున్నట్టున్నాడు వెళ్ళమ్మా రేపు మాట్లాడుకుందాం" అన్నారు ఆయన ఇక ఆ సంభాషణ అక్కడితో ముగించేస్తూ ఆమె. తల ఊపి అక్కడ నుండి మెల్లగా మేడమెట్లువైపు దారి తీసింది.

ఆమెకు మనసులో భర్తమీద ఒళ్ళు మండిపోతుంది.

కాస్సేపు ఇవతలకి వస్తేచాలు కొంపలంటుకు పోతున్నట్టు కేకలు వేస్తారు.

ఎన్నిసార్లు చెప్పినా ఈ మనిషికి సిగ్గు వుండదు.



విసుక్కుంటూ గదిదగ్గరకు వెళ్ళింది.

గది అంతా చీకటిగా వుంది.

ఉదయ్‌కృష్ణ చీకట్లో పడుకున్నాడు అంటే అతనికి బాగాకోపం వచ్చింది అనే అర్థం.

వెళ్ళి లైటువేసింది.

లైటు వెయ్యటంతో గది అంతా వెలుతురుతో నిండి పోయింది.

అతను పడుకున్నాడా లేదా అని చూసింది.

ఉదయ్‌కృష్ణ అటుతిరిగి పడుకున్నాడు.

అతనికి అలుకవచ్చింది అని గ్రహించి దగ్గరగా వెళ్ళింది.

"ఏమండీ" అని పిలుస్తూ భుజంమీద చెయ్యివేసి కుదిపింది.

అతను కళ్ళు మూసుకుని పడుకున్నాడు. అది నిద్ర కాదని ఆమెకు తెలుస్తూనే వుంది.

ఆమె పిలిచినా పలకలేదు కళ్ళువిప్పి చూడలేదు అతను.

"ఏమండీ నిద్రపోతున్నారా!" వస్తున్న నవ్వు దాచుకుంటూ అడిగింది.

అతను పలకలేదు.

"నామీద కోపం వచ్చిందా!" అతని క్రాప్‌ని వేళ్ళతో దువ్వుతూ అడిగింది.

"మామయ్యగారు ఏదో మాట్లాడుతుంటే అక్కడ కూర్చున్నాను. వచ్చేస్తే ఏం బాగుంటుంది!"

అతను మాట్లాడలేదు.

"మాట్లాడ వేమిటి! ఇంకా కోపమా!"

ఉదయ్‌కృష్ణ చురుగ్గా కళ్ళువిప్పి చూసి మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు.

"అయితే మీ కోపం ఇంతట్లో పోయేటట్టు లేదు. నేను వెళ్ళి ఆ సోఫాలో పడుకుంటాను" అంటూ వెనుతిరిగింది.

అతను చెయ్యిచాపి చప్పున ఆమె కొంగు పట్టుకున్నాడు.

జారి పోబోయిన కొంగుని చేత్తో పట్టుకుని ఆపి భర్త వైపు కోపంగా చూసింది.

అతని కళ్ళు కొంటెగా నవ్వాయి.

"అన్నీ దొంగ వేషాలే ముందు కొంగు వదలండి" అంది.

అతని పిడికిట్లో ఇమిడివున్న తనచీర కొంగుని వదిలించుకోవడానికి ప్రయత్నిస్తూ.

అతను వదల్లేదు. ఆ కొంగుపట్టి ఆమెను దగ్గరకు లాక్కున్నాడు.

ఆ లాగిన విసురుకి తూలి అతనికి దగ్గరగా వచ్చి పడింది.

ఆమెను చేతులతో బంధిస్తూ...

"పిలుస్తుంటే రావేం" అన్నాడు.

ఆ అనటంలో నీకు భర్త అంటే లక్ష్యంలేదు చాలా తలతిక్కగా వుంది. నాకు కోపం వస్తే నేను మనిషిని కాదు అన్నట్టువుంది.



భర్త చూపుల్లో భావం గ్రహించుకున్నా ఆమెకు కోపంరాలేదు. పైగా నవ్వు వచ్చింది.

"లేకపోతే ఏమిటి? కాస్త అలా గదిబయటకు వెళ్తే చాలు కొంపలంటుకు పోయినట్టు పిలుస్తారు."

"అంటుకునేది కొంపలు కాదు"

మరి! అన్నట్టుగా ప్రశ్నార్థకంగా చూసింది.

"నా గుండెలు మండిపోతున్నాయి. ఆ మంటలు చల్లారాలి అంటే నువ్వు ఫైర్ ఆఫీసరువి కావాలి నీ చల్లని చూపులతో నా గుండెల్లో మంటలు చల్లార్చాలి"

ఊర్మిళ భర్త మాటలకి ఫక్కున నవ్వేసింది.

అతనూ నవ్వేశాడు.

భర్త నవ్వటం చూసి ఆమె ఉడుకోపంతో అంది.

"మీరు ఇంట్లో వుంటే నాకు అసలు ఏపనీ తోచదు. మీరు ఎక్కడి కయినా వెళ్తారే అప్పుడు హాయిగా వుంటుంది"

ఆమె మాటలు వింటూనే క్షణం సేపు అలా చూసి వెంటనే ఆమెను వదిలేసి అలక వచ్చినట్టుగా అటుతిరిగి పడుకున్నాడు.

ఊర్మిళ నవ్వుకుని లైట్ ఆర్పేసి బలవంతంగా అతని పక్కన చోటుచేసుకుని అతని కోపం అలకా క్షణంలో పోగొట్టేసింది.

# 24

ఆరోజు ఊర్మిళకి ఒంట్లో బాగుండలేదు.

ఉదయ్‌కృష్ణ, మృత్యుంజయరావుగారు ఇద్దరూ యింటి దగ్గర లేరు.

ఊర్మిళ ఆ రోజు భోజనంకూడా చెయ్యకుండా అలా పడుకుంది.

ఏమీ తినకపోవటంతో వికారంగా వుండి వాంతి చేసుకుంది.

వాంతి అయిన వెంటనే ఆమెకు కళ్ళు చీకట్లు కమ్మినట్టు అయి మెల్లగా అతికష్టంమీద గోడని ఆధారం చేసుకుని నడుస్తూ మంచంవైపుకి దారితీసింది.

అప్పుడే ఉదయ్‌కృష్ణ యింటికి వచ్చాడు.

వస్తూనే భార్యని చూసి కంగారుపడి ఒక్క అంగలో వెళ్ళి ఆమెను పట్టుకున్నాడు.

అతను పట్టుకోవటం ఆమెకు తెలియలేదు భర్త చేతుల్లో తెలివితప్పి పడిపోయింది.

ఆమెను చేతులమీద లేవనెత్తి మంచంమీద పడుకోబెట్టి ముఖం మీద నీళ్లు జల్లాడు.

ఆమె నీర్సంగా మూల్గింది.

"ఊర్మిళా!" అంటూ కంగారుగా పిలిచాడు.



"ఊఁ" అంది నీర్సంగా కళ్ళు విప్పకుండా.

నౌకర్ని పిలిచి డాక్టర్ నెంబర్ ఇచ్చి ఆవిడ్ని వెంటనే రమ్మని ఫోన్ చెయ్యమని చెప్పాడు. అతడు తల ఊపి వెళ్ళిపోయాడు.

"ఊర్మిళా!" మృదువుగా పిలిచాడు. ఆమె జుత్తు సవరిస్తూ.

కళ్ళువిప్పి చూసింది. చిరునవ్వు పెదవుల మీద నాట్యం చెయ్యసాగింది అంత నీరసంలోనూ.

పావుగంట తరువాత లేడీ డాక్టర్ వచ్చి చూసింది.

హాలులో సోఫాలో ఉదయ్‌కృష్ణ కూర్చున్నాడు.

మృత్యుంజయరావుగారుకూడా అప్పుడే వచ్చారు.

డాక్టర్ రావటంతో ఆయన కొద్దిగా కంగారుపడ్డారు.

కోడలికి ఏమైంది అన్నట్టు.

తండ్రిని చూసి ఉదయ్‌కృష్ణ లేచి నిలబడ్డాడు.

డాక్టర్ మేడ దిగివచ్చి వాళ్ళ ఆందోళన కంగారుని చిటికెలో పోగొట్టేసి సంతోషంతో ముంచెత్తిన వార్త ఆ తండ్రీ కొడుకులకి చెప్పి మరీ వెళ్ళింది.

ఆ వార్త వింటూనే మృత్యుంజయరావుగారు సంతోషంతో పొంగిపోయారు.

తనకి త్వరలో మనుమడో, మనుమరాలో పుట్టబోతున్నారు.

ఈ రోజు ంత మంచివార్త విన్నాను అనుకున్నారు ఆయన. ఉదయ్‌కృష్ణ మనసూ అలాగే వుంది.

వెంటనే మేడమీదకు పరుగున వెళ్ళి ఊర్మిళను రెండు చేతులతో చుట్టేసి ఇంత మంచి వార్త నాకు ఎందుకు చెప్పలేదు.

అని అడగాలని ఇంకెన్నెన్నో కబుర్లు చెప్పాలని అతనికి అనిపిస్తుంది.

తండ్రికూడా అక్కడే వుండటంతో కాలు కదపలేక పోయాడు.

ఫ్రెండ్స్ ఎవరో రావటంతో తప్పనిసరిగా వాళ్ళతో కలిసి వెళ్ళవలసి వచ్చింది.

రాత్రి యింటికి తిరిగి వచ్చేసరికి తొమ్మిది అయింది.

తిన్నగా మేడమీదకు వెళ్ళాడు.

గదిలో లైటు వెలుగుతూనే వుంది.

ఊర్మిళ సోఫాలో కూర్చుని పుస్తకం చదువుకుంటుంది.

బూటు చప్పుడు అవటంతో తలతిప్పి చూసింది.

గదిలో అడుగుపెట్టిన అతను ఒక్కక్షణం అలాగే నిలబడి పోయాడు భార్యవైపు రెప్ప వాల్చకుండా చూస్తూ.

ఊర్మిళ చేతిలో పుస్తకం ఎప్పుడు జారి క్రింద పడిందో ఆమెకు తెలియదు.

అప్రయత్నంగా లేచి నిలబడింది.

ఆమె చూపులుకూడా అలే వున్నాయి.

ఇద్దరూ స్వప్నావస్థలో తేలిపోయినట్టుగా క్షణం సేపు ఇద్దరూ ఒకర్ని ఒకరు పరిశీలనగా చూసుకున్నారు.

ఆ చూపుల్లో ప్రేమ, ఆదరణ, ఆరాధన, అనురాగం, అనుబంధం అన్నీ పెనవేసుకుని అల్లుకుపోయాయి.



అతను చేతిమీదవున్న కోటు పక్క సోఫాలోకి విసిరేసి రెండు చేతులూ చాపాడు.

ఉదయ్ కృష్ణ అణువణువూ చెప్పలేనంత ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతుంది.

అతని ముఖంలో సంతోషం కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది.

భర్త తనవైపు చేతులు చాపగానే ఒక్కక్షణం ఆగలేని దానిలా ఒక్క పరుగులో వచ్చి అతని చేతుల్లో వాలిపోయింది.

"ఊర్మిళా!" నాకు ఈ సంగతి ఎందుకు చెప్పలేదు."

ఆమె మాట్లాడలేదు. అతని మెడచుట్టూ చేతులు వేసి గుండెల్లో ముఖం దాచుకుంది.

ఉదయ్ కృష్ణ భార్య నడుంచుట్టూ చేతులు బిగించాడు.

ఇద్దరూ కొద్దిక్షణాలు అలా ప్రపంచాన్ని మర్చి వుండిపోయారు.

వాళ్ళకళ్ళకి ఈ ప్రపంచం అంతా నవరంగుల ఉషస్సులా చిత్రంగా, గమ్మత్తుగా, అందంగా కనిపించసాగింది. కొద్దిక్షణాలు తరువాత ఆమె అతని మెడకు పెనవేసిన తన చేతులు లాక్కుని దూరంగా తొలగబోయింది.

అతను విడిచిపెట్టలేదు. రెండు చేతులమధ్య ఆమెను లేవనెత్తి అపురూపంగా అత్యంత అనురాగంతో గుండెలకు హత్తుకుని మెల్లగా ఒక్కో అడుగువేస్తూ మంచంవైపు నడిచాడు.

మంచంమీద ఆమెను సున్నితంగా అపురూపంగా పడుకోబెట్టి భార్య మెడ వంపులో క్షణంసేపు ముఖం దాచుకున్నాడు.

ఊర్మిళకి ఇది అంతా ఏదో కలలా వుంది.

తనకి ఈ జన్మలో పెళ్ళికావటం జరగనిపని అని మనసులో ఖచ్చితంగా అనుకుంది.

ఒక అయినింటి ఇల్లాలిగా బ్రతికే అదృష్టం తనకి లేదు అనుకుంది. భగవంతుడే తలపై జాలి తలిచి,

మృత్యుంజయరావుగారి రూపంలో తన కళ్ళెదుట సాక్షాత్కరించి నరకంలోనుండి తనని పైకిలాగి ఇంటికి తీసుకువచ్చి ఈ యింటికి కోడల్ని చేశారు.

ఉదయ్‌కృష్ణకి తను భార్య కావటం అతని పిల్లలకి తను తల్లి కావడం నిజంగా అదృష్టం కాదూ!

తన్మయత్వంతో కళ్ళు మూసుకుంది.

* * * *

రోజులు గడుస్తున్నాయి.

రెండు నెలలు గడిచిపోయాయి.

ఊర్మిళను ఉదయ్‌కృష్ణ అసలు కదలనివ్వటంలేదు. మేడదిగి రానివ్వటం లేదు.

ఇదేమిటి నాకీ శిక్ష. అని అంటున్నా అతను వినేవాడు కాదు.

వేళకి మందులూ, టానిక్‌లు వేసుకునేదాకా వూరుకునేవాడు కాదు.



ఇంటిదగ్గరవుంటే తనే వేళకి మందులు యిచ్చేవాడు. ఫ్రూట్‌జ్యూస్ పైపుకు ఇచ్చేవాడు. పాలు, పండ్లు సరేసరి.

ఊర్మిళకి ఇవన్నీ భరించటం మహా కష్టంగా వుంది.

ఆయనకి తండ్రిని కాబోతున్నానని గర్వం వుండొచ్చు. తన బిడ్డ ఉదయించబోతున్నాడు అన్న ఆనందంతో తనని మరీ ఇలా కాలు కదపకుండా బంధించటం చాలా ఇబ్బందిగా వుంది.

ఈ ప్రపంచంలో ఎంతమందికి పెళ్ళిళ్ళు కావటం లేదు. భార్యలు రావటంలేదా, పిల్లలు పుట్టటంలేదా.

ఈయనకి మరీ అపురూపం భార్యఅన్నా పిల్లలుఅన్నా.

మనసులో ఆ ఊహ మెదలగానే గర్వపడకుండా వుండలేకపోయింది.

పుట్టబోయే బిడ్డ కళ్ళల్లో మెదులుతుంటే సంతోషంతో మురిసిపోయేది.

## 25

మృత్యుంజయరావుగారు చాలారోజులుగా అనుకుంటున్నారు.

పుణ్యక్షేత్రాలన్నీ చూడాలని.

ఇంకొద్ది నెలల్లో తను తాతయ్య అయిపోతాడు. ఇక అప్పుడు ఎక్కడికీ వెళ్ళటం కుదరదు.

మనవులతో హాయిగా నిశ్చింతగా రోజులు గడిపేయటమేనని తలపోశారు.

అందుకే ఆయన స్నేహితులు ఇద్దరు పుణ్యక్షేత్రాలు చూసి వద్దామని బయలుదేరుతుంటే వాళ్ళతోపాటుఆయనా ప్రయాణమయ్యారు.

ఈ విషయం కొడుకుని కోడల్ని పిలిచి చెప్పారు.

ఆయన చెపుతుంటే భార్యాభర్తలిద్దరూ ముఖముఖాలు చూసుకున్నారు.

ఇప్పుడు వెళ్ళటం ఏమిటి? మళ్ళీ ఎన్నిరోజులకు వస్తారోనన్నట్టు.

"మళ్ళీ ఎప్పుడు వస్తారు?" అడిగాడు అతను తండ్రిని.

"నెలా రెండు నెలలు పట్టొచ్చు"

అతను ఏం మాట్లాడలేదు. ఆయనే అన్నారు. "నేను చాలారోజులనుండి అన్నివూళ్ళు చూసిరావాలనే అనుకుంటున్నాను. ఇన్నాళ్ళు నీ పెళ్ళి కాలేదని ఆగాను. నీ పెళ్ళయింది ఇంటి బాధ్యతలు అమ్మాయి కప్పగించేశాను. ఇక నాకు ఏ బాధ్యతలు లేవు. అందుకే నాలుగూళ్ళు చూసి రావాలని అనుకుంటున్నాను."

"మీ ఇష్టం నాన్నగారూ! అలాగే వెళ్ళిరండి—" అన్నాడు.

ఊర్మిళ ఏం మాట్లాడలేదు చిన్నబోయిన ముఖంతో అలా వుండిపోయింది.



ఆయన వూరికి వెళ్ళి రెండు నెలలవరకూ తిరిగిరారు అంటే మనసులో ఏదో దిగులుగా అనిపించసాగింది.

ఇంట్లో పెద్దవాళ్ళుంటే అదో ధైర్యం.

ఆమె ఏం మాట్లాడకపోవటంతో ఆయన కోడలివైపు చిరునవ్వుతో చూశారు.

"ఏమ్మా అలా ఉన్నావు!" అన్నారు.

ఆమె చిన్నగా నవ్వింది, ఆ నవ్వులో నిండుతనం లేదు.

ఆమె మనసులో బాధ గ్రహించినట్టుగా అన్నారు.

"నేను త్వరగా వచ్చేస్తాను. రెండునెలలంటున్నాను ఒకనెల ముందే వచ్చేస్తానేమో కూడా!"

ఊర్మిళ తేలిగ్గా ఊపిరి తీసుకుంది. నెలంటే ఎన్ని రోజులు ముప్ఫయిరోజులు ఎంత ఇట్టే తిరిగొస్తాయి.

అది మనసులోనే సరిపెట్టుకుంది.

మృత్యుంజయరావుగారు నాలుగురోజుల తరవాత స్నేహితులతో ప్రయాణమయ్యారు.

వెళ్ళేముందు కొడుకుని కోడల్ని జాగ్రత్తగా ఉండమని పదిసార్లు చెప్పారు.

కోడలి ఆరోగ్యం గురించి పదిసార్లు చెప్పి వెళ్ళారు.

మృత్యుంజయరావుగారు వెళ్ళాక యిల్లంతా ఒక్కసారి చిన్నబోయినట్టయింది.

ఆరోజు మర్నాడుకూడా ఊర్మిళ అదోలా ఉండిపోయింది.

ఉదయ్‌కృష్ణ మనసులోనే నవ్వుకున్నాడు.

తనభార్య తండ్రిని మామగారిలా కాకుండా కన్న తండ్రిలా చూస్తుందని.

ఆయన ఊరికి వెళ్ళగానే అందుకే అలావుంది అనుకున్నాడు

ఊర్మిళకు ఇప్పుడు ఆరవమాసం నడుస్తుంది.

ఆమె కొద్దిగా ఒళ్ళు చేసింది. అసలే తెల్లని తెలుపు ఏమో, మరీ పచ్చగా కనిపిస్తుంది.

మనిషి నిండుగా అందంగా కనిపిస్తుంది

ఉదయ్‌కృష్ణకి భార్యని చూస్తూనే గర్వంగా ఉంది.

తన ప్రతిరూపాన్ని ఆమె కడుపులో మోస్తుంది.

తన బిడ్డకు రూపాన్ని ఇచ్చి ఊపిరి పోస్తుంది.

భార్యాభర్తల అనురాగం అనుబంధమే పిల్లల రూపంలో భూమ్మీద అవతరిస్తాయి.

అతనికి భార్య అంటే చెప్పలేని ప్రేమ ఆమె క్రింద నడిస్తే ఎక్కడ కందిపోతుందో అని అతని మనసు విలవిల లాడిపోతుంది.

ఆమె మెల్లగా, బరువుగా, నిండుగా నడుస్తూ ఈ పనీ ఆ పనీ చేస్తుంటే...

అతనికి కోపం ముంచుకు వచ్చేస్తుంది.

భార్యమీద కేకలు వేస్తూ ఆమెను రెండు చేతుల మధ్యా లేవనెత్తి మంచంమీద పడుకోబెట్టి ఈసారి కదిలేవు అంటే చూడు అని బెదిరిస్తాడు.

ఆమె ముసిముసిగా నవ్వుకుంటుంది.



అతను ఎక్కడికయినా వెళ్ళేముందు భార్యను దగ్గరకు తీసుకుని వంగి తన బిడ్డ పెరుగుతున్న స్థలం దగ్గర ముద్దు పెట్టుకుని మరీ వెళ్తాడు.

రూపం ఏర్పడని బిడ్డపై అతనికి ఎంత ప్రేమ!

ఊర్మిళ మనసులోనే మురిసిపోతుంది.

# 26

ఆ రోజు భార్యాభర్తలు ఇద్దరూ పుట్టబోయే బిడ్డ గురించి వాదించుకున్నారు.

వాదన పెరిగేకొద్దీ కోపం పెరిగిపోయింది.

కోపం పెరిగేకొద్ది పంతం పెరిగిపోయింది.

పంతం పెరిగేకొద్ది ఉక్రోషం, ఉడుకుమోత్తనం పెరిగిపోయాయి

నా మాటే చెల్లాలి అంటే నా మాటే చెల్లాలి అని ఇద్దరూ మొండిపట్టు పట్టారు.

ఆవేళ వరండాలో కుర్చీలు వేసుకుని భార్యాభర్తలు ఇద్దరూ కూర్చున్నారు.

వాళ్ళిద్దరూ సరదాగా ఏవో కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటున్నారు.

వాళ్ళ సంభాషణ పిల్లలవైపు వెళ్ళింది.

"నీకు అమ్మాయి కావాలా! అబ్బాయి కావాలా!" అడిగాడు భార్యని ఉదయ్‌కృష్ణ.

"నాకు అబ్బాయే కావాలి" అంది కచ్చితంగా చెపుతూ.

"అమ్మాయి వద్దా!"

"ఊహు..."

"నాకు మాత్రం ఇప్పుడు అమ్మాయే కావాలి!"

"నేను మాత్రం ఒప్పుకోను. నాకు అబ్బాయే కావాలి!"

"ముందు అమ్మాయి పుట్టాక ఆ తరువాత నీ ముచ్చట కోసం అబ్బాయి పుడతాడులే" అన్నాడు నచ్చచెప్పే ధోరణిలో.

"అలా వీల్లేదు. ముందు అబ్బాయే కావాలి! ఆ తరువాత కావలిస్తే మీ ముచ్చటకోసం అమ్మాయి పుడుతుంది" అంది అతన్ని ఉడికించాలన్న ఉద్దేశంతో.

"ఊర్మిళా! నువ్వు ఎన్నయినా చెప్పు వింటాను. ఈ ఒక్క విషయంలో మాత్రం నేనువినను నాకు అమ్మాయే కావాలి!" అన్నాడు మొండిగా.

"ఏమిటి మీ పంతం!" అంది రుసరుసలాడుతూ.

"నీ పంతం ఏమిటి!" అన్నాడు కోపంగా.

"ఏం తల్లిగా నేను అలా కోరుకోకూడదా!

"నేను మాత్రం తండ్రిగా అలా కోరుకోకూడదా!"

"కోరుకోవచ్చు... ముందు భార్య కోరిక తీరాక ఆ తరువాత భర్త కోరిక తీరాలి."



"ఏమిటో ఆ ఎక్కువ!" హేళనగా అడిగాడు.

"మీ ఎక్కువ ఏమిటో!" అంది తను హేళనగా.

ఇద్దరూ ఒకర్ని ఒకరు సూటిగా కోపంగా ఉగ్రంగా చూసుకున్నారు.

నీ పంతం విడవ్వా? అంటే మీ పంతం విడవరా? అన్నట్టు ఒకర్ని ఒకరు తీక్షణంగా చూసుకున్నారు

వెంటనే ఇద్దరూ ముఖాలు పక్కకు తిప్పుకున్నారు.

పది నిమిషాలపాటు ఇద్దరూ మౌనమూర్తులా కూర్చున్నారు.

మేడ క్రింద నౌకరు పని చక్కబెట్టుకుంటూ కూని రాగం తీస్తున్నాడు.

"అమ్మాయే పుట్టాలి అచ్చం అమ్మలాగే వుండాలి. అబ్బాయే పుట్టాలి అచ్చం నాన్నలాగే వుండాలి" అంటూ.

నౌకరు పాడుతున్న పాట ఆ భార్య భర్తలు ఇద్దరి చెవుల్లోపడి అప్రయత్నంగా తలతిప్పి ఒకర్ని ఒకరు చూసుకున్నారు.

ఇద్దరి చూపులు క్షణంసేపు కలుసుకున్నాయి.

తీక్షణంగా చూసుకున్న ఆ చూపుల్లో రానురాను వేడితగ్గి శాంతించి చల్లబడసాగాయి.

చూపులు చల్లబడటంతో మనసులు, మనసులతో పాటు మనుష్యులు చల్లబడ్డారు.

అప్రయత్నంగా ఇద్దరి పెదవులపైన లీలగా చిరునవ్వు ఉద్భవించి ఆ చిరునవ్వు కాస్త వాళ్ళ ముఖం అంతా ప్రాకి వెన్నెల విరజిమ్మినట్టు ఇద్దరూ ఫక్కున నవ్వుకున్నారు.

ఆ నవ్వు మనసారా హాయిగా వుంది.

ఇద్దరి మనసుల్లో బరువు దిగిపోయి తేలిగ్గా హాయిగా ఆనందంగా అనిపించింది.

"నిజంగా నాకు కోపం వచ్చింది అనుకున్నారా మీరు!" అడిగింది నవ్వుతూ.

"నువ్వు కూడా అలాగే అనుకున్నావా నాకు కోపం వచ్చింది అని" అన్నాడు నవ్వుతూ.

"అయితే మీకు కోపంరాలేదా!" ఆశ్చర్యంగా అడిగింది.

"అయితే నీకూ కోపం రాలేదా!" అంటూ నవ్వేశాడు.

"నేను ఏమన్నాను అబ్బాయి కావాలి అన్నాను తప్పా!"

"నేను మాత్రం ఏమన్నాను అమ్మాయి కావాలి అన్నాను అంతే."

"అది నా చేతిలో వుందా! భగవంతుడు ఏ బిడ్డని ఇస్తాడో ఆ బిడ్డే మనకి ముద్దు కదండీ" అంది భర్త చేతిని అందుకుంటూ ప్రేమగా.

"నిజం అంతే భగవంతుడు ఏ బిడ్డని ఇస్తాడో ఆబిడ్డే మనకి అపురూపం" అన్నాడు భార్య చేతిని రెండు చేతులతో కలిపి పట్టుకుంటూ.

ఇద్దరూ ఏదో ఒక విషయం గురించి రోజూ అలా వాదించుకుంటూనే వుంటారు.



మళ్ళీ ఇద్దరూ రాజీకి వచ్చి నవ్వుకుంటారు.

ఉదయ్‌కృష్ణ ప్రతిరోజు సాయంత్రం భార్యను కారులో అలా చల్లగాలికి తిప్పి తీసుకు వస్తుంటాడు.

అలా రోజులు గడుస్తున్నాయి.

ఊర్మిళకు ఆరునెలలు పూర్తి కావస్తున్నాయి. ఆమెకు నెలలు నిండుతున్న కొద్దీ భయం ఒకవైపు, ఆనందం ఒకవైపు అయ్యగారి అందం అమ్మగారి అందచందాలు కలపోసుకుని పండంటి బిడ్డ పుడ్తాడు. మా అమ్మగారికి అని పనిమనిషి మరో పనిమనిషితో అనటం విని మనసు పుట్టబోయే బిడ్డని తలుచుకుని మురిసిపోయేది.

స్త్రీకి ప్రసవవేదన అనేది పునర్జన్మ ఎత్తినట్టే.

ఆ ప్రసవవేదనలో బ్రతికి బయటపడుతుందో లేక ప్రాణాలే విడిచి పెడుతుందో ఎవ్వరికీ తెలీదు.

మృత్యుంజయరావుగారు తనకి చేసినసాయం జన్మలో మరువలేదు.

ఐశ్వర్యవంతుల యింటికి కోడలు అయింది.

అందరి స్త్రీల్లాగే తనూ యిల్లాలయి యిల్లు చక్క-దిద్దుకుంటుంది.

ఉదయ్‌కృష్ణలాంటి ఉత్తముడికి భార్య కాగలగటం అదృష్టం కాదా!

అతని పిల్లలకి తను తల్లి ఆ ఊహ ఆమెను ఉక్కిరి బిక్కిరి చేస్తుంది.

అదంతా ఒక రంగుల స్వప్నంలా అనిపిస్తుంది.

తనకి దక్కిన అదృష్టం అందరికీ దక్కొద్దూ.

ఊర్మిళ అన్నీ తలుచుకుని ప్రతీక్షణం మురిసిపోయేది.

మృత్యుంజయరావుగారు వెళ్ళి వారం రోజులు అయింది.

ఆయన వద్దనుండి ఒక ఉత్తరం వచ్చింది.

ఉత్తరంలో అంతా ఊర్మిళ గురించే వ్రాశారు. ఆమె ఆరోగ్యం జాగ్రత్త వేళకి సరిగ్గా మందులు వేసుకోమను అని కొడుక్కి వ్రాశారు.

ఆ ఉత్తరం భార్యకి చూపించి చిరుకోపంతో అన్నాడు "నాన్నగారు చూశావా. కొడుకుని అయిన నా గురించి ఒక్క మాట లేదు అంతా నీ గురించే వ్రాశారు" అని. భర్తమాటలకి నవ్వుకుంది.

## 27

ఉదయ్‌కృష్ణ కారు మెల్లగా డ్రైవ్ చేస్తున్నాడు.

అతని ముఖంతో పాటు కళ్ళు కూడా ఎర్రగా చింత నిప్పుల్లా ఉన్నాయి. ఆలోచనలు మస్తిష్కంలో పురుగులా తొలిచేస్తుంటే ఆపుకోలేని ఆవేశంతో అతని చేతులు స్టీరింగ్ మీద బిగుసుకోసాగాయి.

అపార భూస్థలం కంపించి పోతున్నట్టుగా.

ఆకాశం విరిగి మీదపడినట్టు తీవ్రమయిన బాధకు గురి అయ్యాడు.



గాలి ముఖానికి రయ్యన కొడుతున్నా అతనికి చెమట్లు పోసేస్తున్నాయి.

నుదుటి దగ్గర స్వేదబిందువులు ముత్యాల్లా మెరిసి అవి మెల్లగా క్రిందకి జారి కణతలు దగ్గర ధారలు కడుతున్నాయి.

మెడదగ్గర, షర్టు అంతా తడిసి ముద్దయిపోతుంది.

ఫాలభాగంమీద నరాలు పైకి పొంగాయి. ఉద్రేకంతో ఆవేశంతో అతని శరీరం బిగుసుకుపోతుంది.

హృదయం అగ్నిగుండంలా వుంది.

అతనికి కారు ఎటునడుపుతున్నాడో తెలియటంలేదు.

అలవాటు అయిన అతని చేతులు అతని ప్రమేయం లేకుండా కారు నడపసాగాయి.

ఊర్మిళ!

ఊర్మిళ! కసిగా అనుకున్నాడు.

అతనికా పేరు తలుచుకుంటుంటే—

గుండెల్లో అగ్నిపర్వతాల బ్రద్దలవుతున్నాయి.

ఉదయ్‌కృష్ణకి తల పగిలిపోతుంది.

ప్రపంచం అంతా గిరున తిరిగిపోతుంది.

కారులో కూర్చున్న అతనికి కారు ముందుకి వెళుతున్నట్టుగా కాక కారు తిరగబడుతూ మొగ్గలు వేస్తున్నట్టుగా వుంది.

కారు ఎలా ఇంటికి చేరిందో ఎప్పుడు పోర్టికోలో ఆగిందో అతనికి తెలియలేదు.

యాంత్రికంగా అలా కారుదిగి లోపలకు నడిచాడు.

తిన్నగా మేడమీదకు దారితీశాడు.

వరండాలో కుర్చీ వేసుకుని ఊర్మిళ కూర్చుంది. చేతిలో దిండుగలేబు వుంది. దానిమీద ఎంబ్రాయిడరీ చేస్తున్నదల్లా బూట్లు చప్పుడు అవటంతో తలఎత్తి చూసింది.

అప్పుడే అతనూ చూశాడు.

ఆ చూపులు మునుపటిలా చల్లగా హాయిగా లేవు. తీక్షణంగా పదునుగా కత్తుల్లా వున్నాయి.

భర్త త్వరగా ఇంటికి రావటంతో అతని చూపుల్లో భావం ఆమె మనసు కనిపెట్టలేకపోయింది.

చేతిలో దిండుగలేబి పక్కన పెట్టి చిరునవ్వుతో లేచి అతని దగ్గరగావచ్చి చెయ్యిపట్టుకుంది.

"ఈరోజు త్వరగా వచ్చేశారు" అంటూ ఆ చెయ్యి ఆమె చెంపకు ఆనించుకుంది.

ఆమెవైపు పరీక్షగా చూశాడు.

ఈ ఆడవాళ్ళకి ఎంత బాగా నటించటం వచ్చు!

పురుషుడిని మసిపూసి మారేడుకాయ చేసేనేర్పు ఈ స్త్రీలకే వుంది

పైకి చిరునవ్వులు వెదజల్లే స్త్రీల గుండెల్లో ఎంతవిషం! కట్టుకున్న భర్తనికూడా మోసం చెయ్యటానికి వెనుకాడరు.

అతనికి భార్య చూస్తుంటే జుగుప్స కలగసాగింది.

మనసులో కోపం కట్టలు త్రెంచుకుంటుంది.

కత్తి తీసుకుని ఆమె గుండెల్లో పొడిచి చంపాలన్న ఆవేశం వస్తోంది.



ఆమె వట్టిమనిషి కాదు.

అందుకే బలవంతంగా కోపాన్ని కంట్రోల్ చేసుకోసాగాడు.

భార్య చేతిని ఒక విదిలింపుతో విదిలించుకుని గదిలోకి వెళ్ళిపోయాడు.

భర్త తిరస్కారానికి క్షణంసేపు నివ్వెరపోయింది.

ఏమిటి ఈయన ఈరోజు కొత్తగా ప్రవర్తిస్తున్నారు!

ఆయన తనచేయి పట్టుకుంటే తను విదిలించుకుని వెళ్ళిపోతే వెళ్ళనిచ్చేవారా!

ఏపని గురించి ఆయన చికాకుగా ఉన్నారో?

ఈ మాత్రానికే తను బాధపడటం దేనికి!

పైన తిరిగే మగవాడికి లక్ష పనులుంటాయి. ఇల్లు, భార్యే ప్రపంచమంతా అంటే పురుషుడికి కుదురుతుందా!

ఊర్మిళ మనసు సరిపెట్టుకుని వెళ్ళి టీ తీసుకుని అతని గదిలోకి వెళ్ళింది.

ఉదయ్‌కృష్ణ బట్టలు మార్చుకుని మంచంమీద పడుకున్నాడు తలక్రింద రెండుచేతులు పెట్టుకుని పైకి చూస్తూ.

అతనేదో దీర్ఘాలోచనలో మునిగిపోయినట్టుగా కనిపించాడు ఆమె కళ్ళకు.

దగ్గరగా వెళ్ళి నుదుటిమీద చేయి వేసింది.

"తలనొప్పిగా ఉందా!" అంటూ.

ఆమె ప్రశ్నకు తీక్షణంగా చూస్తూ ఆ చేతిని విసిరికొట్టాడు. అంతకు ముందయితే.

ఊర్మిళా! అంటూ ఆ చేతిపైన తన చేయి వేసి పట్టుకుంటూ "నీ చేయి ఎంత చల్లగా వుంది?" అడిగాడు.

అతని ప్రవర్తనకు ఇంతసేపు తెల్లబోయినట్లయి చిన్నబుచ్చుకున్నట్టుగా అయింది.

"టీ తీసుకోండి" అంది మెల్లగా.

"అక్కరలేదు" కసిరినట్టుగా అన్నాడు.

"ఏమిటి ఈరోజిలా ఉన్నా! నావలన ఏమయినా పొరపాటు జరిగిందా! తెలియక ఏమైనా పొరపాటు చేస్తే క్షమించండి" అంది. ఆ స్వరం జీరబోయినట్టుగా పలికింది.

దుఃఖం ఎంత ఆపుకోవాలని ప్రయత్నిస్తున్నా కళ్ళల్లో నీరు గిర్రున తిరగసాగాయి

"పొరపాటు" అంటున్న అతని కంఠస్వరంలో హేళన తొంగిచూసింది. అతనికి నవ్వు వచ్చింది అకోగా నవ్వాడు.

ఆ నవ్వు ఆమెకు ఎలాగో అనిపించింది.

అతనలా దూరంగా పరాయివాడిలా వుండటం ఆమె భరించలేకపోతుంది.

"ఏమండీ!" అంటూ మళ్ళీ పిలిచింది.

"ఏం!" అంటూ కోపంగా చూశాడు.

అతని కళ్ళవెంట నిప్పులు కురుస్తున్నాయి. అతనికి అంత కోపం రాగా ఆమె ఎప్పుడూ చూడలేదు.

"ఏమిటంత కోపంగా ఉన్నారు!"

"ముందు నీవు ఈ గదిలోంచి వెళ్ళిపో, నువ్వు ఒక్క నిమిషం నా గదిలో ఉంటే నేను భరించలేను" అన్నాడు కోపంతో వూగిపోతూ.



ఊర్మిళ భర్త మాటలకి అలా నిలబడిపోయింది.

శిరస్సున వేలాది పిడుగులు ఒక్కసారి వర్షించినట్టు భూకంపం వచ్చి భూమి బద్దలయి తను అందులో కూరుకుపోతున్నట్టనిపించసాగింది.

తనని ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన భర్తే యిలా మాట్లాడటం భరించలేని ఆ వేదనలో దుఃఖాన్ని ఆపుకుంటూ అక్కడనుండి వెళ్ళిపోయింది.

పెళ్ళికాకముందు తనువుండే గదిలోకి వెళ్ళి తలుపులు మూసుకుని మంచంమీద పడుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

ఆయనకి అంతకోపం వచ్చేపని తను ఏం చేసింది!

తెలిసి తనే తప్పూ చేయలేదు.

తెలియక చేస్తే తనతప్పు ఏమిటో తెలియచేస్తే అందుకు తను క్షమార్పణ కోరుకుంటుంది అంతేగాని సంగతేమిటో చెప్పకుండా ఇలా తనపై కోపగించుకుంటే తనకి ఎలా తెలుస్తుంది!

అతనంత కోపంగా కసిరినట్టుగా మాట్లాడటం ఆమెకు దుఃఖం ఆగటంలేదు.

అతని చూపులుకూడా ఎప్పటిగా మామూలుగా లేవు. తనని అసహ్యించుకున్నట్టుగా ఉన్నాయి ఆ చూపులు.

ఆయనంత అసహ్యించుకునే పని తనేం చేసింది?

ఆ వేళ అంతా కుమిలిపోయింది. గదిలోంచి ఇవతలకు రాలేదు.

# 28

ఉదయ్‌కృష్ణ మనసు ఎంత సరిపెట్టుకుందామను అవే మాటలు గుర్తుకు వస్తున్నాయి.

ఎంత మరచిపోవాలన్నా మరుపు రావటంలేదు.

ఈ నిజాన్ని ఏ పురుషుడు భరించగలడు!

భార్య ఎవరో! ఆమె కథ ఏమిటో తెలిసిన తర్వాత గుండె ఆగిపోతుందిగాని ఉంటుందా!

తను ఎంత పిచ్చివాడయి ఆమె అందాన్ని చూసి ఆ ఆకర్షణలో పడిపోయాడు.

తను ఎంత తొందరపడ్డాడు!

అందుకే తనతండ్రి పదిసార్లు చెప్పారు. ఆ అమ్మాయికి ఈ యింటికి కోడలుకాగల అర్హతలేదని. తను అర్హతలంటే ఆస్థి అంతస్థులని తలపోశాడు.

తల్లీతండ్రీ లేని పేదపిల్లని, తండ్రికి ఇష్టం లేదనుకున్నాడు తను ఆరోజు.

బాగా ఆలోచించుకో అని తండ్రి చెప్పినా తను వినలేదు.

పెళ్ళికి ముహూర్తం పెట్టించే ముందుకూడా అడిగారు.

తొందరపడుతున్నావేమో ఇదే నీ నిర్ణయమా అని.



పెళ్ళయ్యాక భార్యను ప్రేమానురాగాలతో చూడాలి. ఆమె మనసు ఎప్పుడూ కష్టపెట్టకూడదని నొక్కి నొక్కి చెపితే అప్పుడు తను మనసులో నవ్వుకున్నాడు.

తండ్రికి ప్రాణస్నేహితుడి కూతురుకదా అందుకే అన్నిసార్లు చెపుతున్నారని అనుకున్నాడు.

ఆయన చెప్పటం వెనక ఇంతలోతు కథ దాగుందని తను ఆనాడు గ్రహించలేకపోయాడు.

ఊర్మిళ అందమే కళ్ళల్లో కదిలేదిగాని ఆమె ఎవరో ఏమిటో ఆ వివరాలను తెలుసుకోవాలన్న ఆలోచన ఉండేది కాదు.

తనెంత మోసపోయాడు!

తనని తండ్రీ, ఊర్మిళ ఇద్దరూ మోసంచేశారు.

నిజాన్ని కప్పిపుచ్చి మోసంచేసి తనని పిచ్చివాణ్ని చేసి ఆడించి.

ఈ పెళ్ళి జరిగిపోయేలా చేశారు.

"ఊర్మిళని తను నమ్మాడు. బాధ్యతగల ఇల్లాలిగా మనసున్న అర్ధాంగిగా నమ్మి పిచ్చిగా ప్రేమించి అపురూపంగా చూసుకున్నాడు.

తనకి ఎంత మోసం జరిగింది.

కన్నతండ్రే తనకి అన్యాయం చెయ్యటం భరించలేని బాధతో కుమిలిపోయాడు.

స్త్రీ అందచందాలు పురుషుని మనసులో కోరికలు అలలు రేపుతాయి.

దానితో పిచ్చివాడై ఆమె ఆకర్షణలో పడిపోతాడు.

ఆకర్షణలో పడిపోయిన పురుషునికి విచక్షణాజ్ఞానం లోపిస్తాయి.

తన జీవితంలో అంతే అయింది.

సంఘంలో నిలబడే అర్హత లేని స్త్రీని తను ప్రేమించి పెళ్ళిచేసుకుని తన జీవితంలో భాగం పంచి ఇచ్చాడు.

ఎంత సిగ్గుపడవలసిన విషయం!

ఉదయ్ కృష్ణకి ఆలోచనలతో తల పగిలిపోతుంది.

ఇప్పుడు తనేం చెయ్యాలి!

ఊర్మిళ వట్టిమనిషి కూడా కాదు.

ఇంట్లోంచి బయటకి గెంటేయటం ఎలా!

ఆమె ఈ యింట్లో ఒక్కరోజు వుండటం కూడా తను భరించ లేదు.

భార్యాభర్తల అనుబంధాలు తమ మధ్య తెగిపోయాయి

ఇక ఆమె ఎవరో! తను ఎవరో అంతే.

భగవంతుడా!

ఈ జీవితం అనుకోని మలుపు తిరిగిపోయింది ఏమిటి!

తన ఇల్లు, భార్యా, పిల్లలు అని ఎన్నెన్ని కలలు కన్నాడు.

ఆ కలలు అన్నీ ఒక్కసారి కరిగిపోయాయి.

బాధగా నిట్టూర్చాడు.

ఊర్మిళ విషయం ఇప్పుడేం చెయ్యాలి!

ఇన్నాళ్ళు ఈ నిజం తనకి తెలియలేదు.



తన వెనక అందరూ తనని చూసి ఎంతగా నవ్వుకున్నారో!

ఆలోచిస్తున్న అతనికి తండ్రిమీద అసహ్యం కలగసాగింది.

ఆయన వయసు ఎక్కడ! ఊర్మిళ వయసు ఎక్కడ?

భగవంతుడా! ఈ ప్రపంచంలో పాపం ఎంత పెరిగిపోతుంది.

తను ప్రేమించే అమ్మాయి తన తండ్రితో సంబంధం వున్న అమ్మాయే కావాలా!

అందుకేనా ఆయనకి ఊర్మిళ అంటే అంత ఆపేక్ష!

పూజ పెళ్ళినాకూడా ఆమె గురించే పదిసార్లు వ్రాశారు ఆ ఉత్తరం అంతా

అతనికి తండ్రిని తలుచుకుంటే అసహ్యం వేస్తుంది.

* * * *

ఊర్మిళ మనసు రాయిచేసుకుని ఆ తెల్లవారి భర్త గదిలోకి వెళ్ళింది.

ఉదయ్ కృష్ణ అప్పటికే స్నానం చేసి బట్టలు మార్చుకుని అద్దం ముందు నిలబడి తల దువ్వుకుంటున్నాడు.

ఆమె గుమ్మం దగ్గర నిలబడింది. భర్తని పలకరించడానికే భయం కలుగుతుంది.

ఆమె వచ్చి గుమ్మంలో నిలబడినట్టు అతనికి అద్దంలో కనిపిస్తూనే వుంది.

అయినా అతను వెనుతిరిగి చూడలేదు.

ఊర్మిళ కళ్ళకి అతను ఆ క్షణంలో పరాయివాడిలా కనిపించ సాగాడు.

ఒక్క రోజులో ఎంత మార్పు!

ఈయనకి తనమీద కోపం ఎందుకు వచ్చింది!

కారణం ఏమిటో ఆమె వూహించలేక పోయింది.

భార్యాభర్తల మధ్య ఎన్నో మనస్పర్థాలు వస్తాయి. అవి లెక్క చేసుకుంటూ పంతంపట్టి కూర్చుంటే నష్టపోయేది స్త్రీయే.

అని మనసులో అనుకుంటూ భర్తవైపు చూసింది.

అతనిముఖం గంభీరంగా రాయికంటే కఠినంగా వుంది.

అయినా ధైర్యం తెచ్చుకుని దగ్గరగా వెళ్ళి "ఏమండీ" అంటూ అతని భుజంపై చెయ్యి వేసింది.

ఛర్ర్‌మన్నట్టు చూశాడు ఒక్కసారిగా.

"నిన్న నీకు ఏం చెప్పాను!" అంటూ తీక్షణంగా చూస్తూ తనభుజంపై వున్న ఆమెచేతిని ఒక్క విదిలింపు విధిలించాడు.

అతను అలా విధిలించి కొట్టగానే ఆమె కోపం తెచ్చుకోలేదు.

"ఏమిటి అంతకోపంగా వున్నారు! ఇంకా మీకోపం పోలేదా!" అంది తెచ్చిపెట్టుకున్న చిరునవ్వుతో.

"ఊర్మిళా!" పిడుగుపాటుగా వినిపించిందా స్వరం.

అతని కేకకు ఆమె గజగజ లాడిపోయింది.

ఏదో చెప్పబోయింది. కాని గొంతుక పెగల్లేదు. ఒక్కమాట బయటకు రాలేదు. కళ్ళు అప్పగించి అలా బొమ్మలా నిలబడిపోయింది.

"నీ తల్లిదండ్రులు ఎవరు!" అతని కంఠస్వరం కటువుగా మారింది.



NANDYAL

ఆమె వైపు సూటిగా కోపంగా చూశాడు.

అతని ప్రశ్న వినటంతో ఊర్మిళ నెత్తిన పిడుగు పడినట్టు అయింది.

ఒక్కసారి అదిరిపడ్డట్టు చూసింది భర్తవైపు.

"నీ కుటుంబం వివరాలు!"

ఊర్మిళకు కళ్ళు చీకట్లు క్రమ్మేస్తున్నట్టు అయి ప్రపంచం గిర్రున రంగుల రాట్నంలా తిరిగిపోసాగింది.

"మా నాన్నగారు నిన్ను ఎక్కడనుండి తీసుకు వచ్చారు ఇక్కడకు!" అంతే.

ఆమె కళ్ళ ముందు చీకటి తెరలు చిక్కగా పరుచుకున్నట్టు అయింది. ఆపై మరి అతని మాటలు వినిపించలేదు.

తెలివి తప్పి పడిపోయింది.

అంతకోపంలోనూ అతను చటుక్కున ఆమెనుపట్టుకుని క్రిందపడిపోకుండా ఆపాడు.

అతని చేతుల్లో తోటకూర కాడలా వేలాడుతుంటే చేతులమీద లేవనెత్తి మంచంమీద పడుకోబెట్టి చల్లటి నీళ్ళు ఆమె ముఖంమీద చిలకరించాడు.

కొద్దిసేపటికి తల కొద్దిగా అటూ ఇటూ తిప్పింది.

కళ్ళనీళ్లు ధారలు కట్టి కణతల దగ్గరగా క్రిందకు జారుతున్నాయి.

భరించలేని దుఃఖం ఆమె హృదయాన్ని చుట్టుముట్టేసినట్టు పెదవులు అదురుతున్నాయి.

ఒంటిమీద పూర్తిగా స్పృహరాకముందే ఆమె ఏదో చెప్పబోతున్నట్టు పెదవులు అస్పష్టంగా కదిలాయి.

ఆమె ఏం చెప్పాలను కుంటుందో అతనికి అర్థం కాలేదు.

ఆమెవైపు అలా రెప్ప వాల్చకుండా చూశాడు.

మెల్లగా కళ్ళువిప్పి నుదురు చిట్లిస్తూ ఒక్కసారి అయోమయంగా నేను ఎక్కడవున్నాను అన్నట్లు చూసింది.

ఎదురుగా అతను నిలబడి ఆమెవైపే చూడటం ఊర్మిళకు కనిపించటంతో ముఖం పక్కకు తిప్పుకుంది.

అంతకుముందు ఇద్దరిమధ్యా జరిగిన సంభాషణ అంతా గుర్తుకువచ్చి భయంతో బిగుసుకుపోయింది.

భర్తకు తనముఖం చూపించలేనట్టుగా అటుతిరిగి వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

ఆమె అలా గుండెలు పగిలిపోయేలా ఏడుస్తుంటే అతని మనసు ఒక్కక్షణం జాలితో మెత్తబడబోయి ఆమె ఎవరో గుర్తుకువచ్చి కఠినంగా మారిపోయింది.

"నేను... నేను ఏ తప్పూ చెయ్యలేదండి" అంటూ హృదయవిదారకంగా ఏడ్వసాగింది.

ఉదయ్ కృష్ణ మనసు కరగలేదు.

ఇక అక్కడ వుండలేక గిరుక్కునతిరిగి అక్కడినుండి వెళ్ళిపోయాడు.

## 29

ఊర్మిళ మునుపటిలా క్రిందగదిలోనే వుంటుంది.

ఆమెకు ఆరోజు నుండి ఒళ్ళు తెలియని జ్వరంతో పడివుంది.



ఉదయ్ కృష్ణ ఆమె కనిపించకపోవటంతో ఊర్మిళ ఏది! కనిపించలేదే! అనే అడగలేదు.

ఆమెకు జ్వరంవచ్చి మంచంమీద పడివుందని కూడా తెలీదు.

ఊర్మిళ రాత్రీ పగలూ కంటికి మంటికీ ఏకధారగా అలా కన్నీరు కారుస్తూనేవుంది.

ఈ సమయంలో మృత్యుంజయరావుగారు వుంటే ఎంతబావుండేది.

ఆయన సరిగ్గా ఇదే సమయానికి వూరు వెళ్ళారు.

ఊర్మిళ తనలోతను కుమిలిపోయింది.

ఆయనకీ విషయం ఎవరు చెప్పారు?

తన గురించి అంతా ఆయనకి తెలిసిపోయిందా!

భగవంతుడా ఇప్పుడు ఏమిటి చెయ్యటం!

ఆయనకి ముఖం చూపించలేక యిల్లువిడిచి వెళ్ళిపోదాం అంటే ఆయన ప్రతిరూపం తనలో ఊపిరి పోసుకుంటుంది.

తను ఏ సముద్రంలోపడి ప్రాణం తీసుకున్నా ఏ రైలు క్రింద పడిపోయినా ఫర్వాలేదు.

కాని అతని బిడ్డని చంపే అధికారం తనకిలేదు.

మృత్యుంజయరావుగారు తను త్వరలో తాతను కాబోతున్నాను అని పొంగి పోతున్నారే, ఆయన సంతోషాన్ని తనెలా నాశనం చెయ్యగలదు?

భగవంతుడా! నాకు దారి ఏది!

ఆయనకి నిజం ఎలా తెలుస్తుంది!

తనే పరిస్థితుల్లో ఈ యింటికి వచ్చిందో నిజంగా తలుచుకుంటే సిగ్గుపడవలసిన విషయమే కాదనలేదు.

ఈ ఇంట్లో అడుగుపెట్టాక అనుకోని అదృష్టం ఎదురు వచ్చి తనని కౌగిలించి ఉక్కిరిబిక్కిరి చేసింది.

ఉదయ్‌కృష్ణకి భార్యఅయి సంతోష సాగరంలో మునిగిపోయింది. తను తల్లి కాబోతుంది అని తెలిసి తనెంత మురిసిపోయింది.

పాతరోజులు, ఆ బాధలు, కష్టాలు మరుగున పడిపోయాయి.

బురదలో కూరుకుపోతున్న తను గట్టుకు చేరి పన్నీటి వాగులో మునిగి జలకాలు ఆడినట్టు.

జీవితమంతా వెన్నెల విస్తరించుకున్నట్టు పువ్వుల సౌధంలో తనూ ఉదయ్‌కృష్ణ జీవిస్తున్నట్టు కలల అలలపై తేలి సోలిపోయింది.

యిప్పుడు! ఒక్కసారిగా అగాధంలోకి పడిపోయి రూపం లేకుండా అయిపోయినట్టుగా వుంది.

భగవంతుడా! ఆయనకి యివంతా ఎలా చెప్పటం! మృత్యుంజయరావుగారు యింటికి త్వరగా వచ్చేస్తే ఎంత బాగుండును.

ఆయన కొడుక్కి జరిగింది అంత చెప్పి నచ్చచెప్పడానికి ప్రయత్నిద్దురేమో!

ఇప్పుడు భర్త తనని మళ్ళీ ఆ విషయం అడిగితే!

తనేం చెప్పాలి! తను చెప్పేకంటే తండ్రి కొడుక్కి చెప్పటమే మంచిది అనిపిస్తుంది.



అంతవరకూ ఆయన తనని ఎన్ని ప్రశ్నించినా మౌనం వహించాలి అని మనసులోనే నిశ్చయించుకుంది.

*   *   *   *

ఊర్మిళకి జ్వరం కొద్దిగా తగ్గింది.

భోజనం చెయ్యలేదు. కాఫీ బ్రెడ్ తీసుకుని అలా పడుకుంది

అసలు ఏమీ తినకుండా అలా పడివుందామంటే తన కడుపులో పెరుగుతున్న శిశువు గుర్తువచ్చి కాఫీ తీసుకుంటుంది.

రెండు రోజులకి ఆమెకి జ్వరం పూర్తిగా తగ్గింది.

అయినా మానసికాందోళన వలన ఆమె మునుపటిలా లేచి తిరగలేక పోతుంది.

ఎన్నాళ్ళగానో జబ్బుపడినట్టు నీరసంగా ఎలాగో వుంటుంది.

తింటున్నా తిరుగుతున్నా కాళ్ళల్లో శక్తి వుండటం లేదు.

ఈ యింట్లో తనకి స్థానం వుందా లేదా!

అదే ప్రశ్న ఆమెను రాత్రీ పగలూ వేధించసాగింది.

గుండె నిబ్బరంతో మనోధైర్యంతో రోజులు గడపాలి అన్నా ఆమెకు శక్తి చాలటం లేదు.

తన జీవితం ఏమౌతుంది!

తన బిడ్డకు తండ్రి ఆదరణ లభిస్తుందా!

ఇవే ఆలోచనలు ఆమెను పట్టి పీడించసాగాయి.

ఆరోజు సాయంత్రం ఉదయ్‌కృష్ణ యింటికి త్వరగా వచ్చేశాడు.

ఊర్మిళ మెల్లగా మేడమీదకు వెళ్ళింది.

ఆమెను చూస్తూనే ముఖం తిప్పుకున్నాడు.

ఇవతల వరండాలో కుర్చీ వేసుకుని కూర్చుని పేపరు చదువు కుంటున్నాడు.

ఆమె ఆ యింట్లో నౌకర్లలో పనిమనుష్లలో ఒకత్తె అన్న భావం అతనికి వచ్చేసింది.

అందుకే ఆమెను లెక్క చెయ్యనట్లు కూర్చున్నాడు.

అతనికి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చునే ధైర్యం లేక ఆ కుర్చీ పట్టుకుని నిలబడింది.

"ఏమండీ!" దీనంగా పిలిచింది.

అతను తల ఎత్తి చూడలేదు, పలకలేదు.

"ఇంతేనా మీరు నన్ను అర్థంచేసుకున్నది!"

అతను మాట్లాడలేదు.

"మీ నాన్నగారు వచ్చేవరకూ కాస్త ఓపికపట్టండి. వారు రాగానే మీకు అన్ని విషయాలు చెప్తారు" అంది అతనికి నచ్చచెపుతున్నట్టుగా.

ఆ మాటలు వినడంతో విసురుగా తల ఎత్తి చూశాడు.

ఆ కళ్ళ వెంట నిప్పులు కురుస్తున్నాయి.

"ఆయన వస్తే!" రెట్టించినట్టుగా అడిగాడు.

ఆమె మాట్లాడలేదు.

"ఆయనా నువ్వూ కలిసి ఒక కథ అల్లి నన్ను ఒక వెధవని చెయ్యడానికి ప్రయత్నిస్తారు అంతేనా!" అన్నాడు.

"ఏమండీ మీరు పొరపడుతున్నారు." అంది కంగారుగా.



ఆమె మాటలు వింటూనే విసురుగా లేచి కుర్చీని ఒక్క తన్ను తన్నాడు.

అది పేమ్‌కుర్చీ అవటంవలన ఏమంత శబ్దం కాలేదు గాని ఒక్క దొర్లు దొర్లింది.

"నాది పొరపాటా" విసురుగా చెయ్యెత్తాడు.

ఆ దెబ్బను తను తట్టుకోవడానికి అన్నట్టు కళ్ళు మూసుకుని తల కొద్దిగా పక్కకు తిప్పింది.

అతను ఆగిపోయాడు. ఎత్తినచెయ్యి క్రిందకు దించేస్తూ.

ఎంతకూ ఆ దెబ్బ తనపై పడకపోవటంతో కళ్ళు విప్పి చూసింది.

ఉదయ్ కృష్ణ కోపాన్ని బలవంతంగా అపుకుంటున్నట్టుగా ముఖం ఎర్రగా కందిపోయింది.

"నాన్నా గారితో పాటు ఒకరాత్రి అంతా హోటల్ రూమ్‌లో గడిపావా లేదా!" అతని కంఠస్వరం కంగు మంది.

ఊర్మిళ మాట్లాడలేదు. నిలువునా నీరై పోయినట్టు అలా నిలబడి పోయింది.

"మాట్లాడవేం!" గద్దించి అడిగాడు.

అప్పటికీ మౌనమే వహించింది.

అతనికోపం క్రమంగా చల్లారి విపరీతమైన బాధతో కళ్ళు మూసుకున్నాడు. ఎడంచేతి వేళ్ళు జుత్తులోకి పోనిస్తూ పిచ్చివాడిలా తల ఇటూ అటూ తిప్పాడు.

"అటు తండ్రితో ఇటు కొడుకుతో హు" అన్నాడు విరక్తిగా.

"ఇప్పుడు నువ్వు నాకేం అవుతావు!" అదోలా నవ్వాడు ఆ నవ్వు పేలవంగా వుంది.

ఆమె కన్నీరు వరదలై పారింది.

మాట్లాడలేనట్టు మూగపోయి అలా వుండిపోయింది.

ఈయనకి ఇక ఆ విషయం తెలియదనే అనుకుంది.

ఇప్పుడు తెలిసిపోయింది.

ఏం చెప్పాలి! ఎలా చెప్పాలి?

కళ్ళుమాత్రం సంతతధారగా కన్నీటిని వర్షిస్తున్నాయి.

"ఊర్మిళా!" అతని కంఠం మామూలుగా పలికింది.

ఆమె తల ఎత్తి చూళ్ళేదు.

"నీకు డబ్బే ముఖ్యం అనుకుంటే నీకు కావలసింది డబ్బే అయితే ఒక్కమాట నాతో చెప్పివుంటే నీవు కావాలని ఇంత నాటకం ఆడవలసిన పనే లేకపోను. నీ డబ్బు దాహంతో నా నిండు జీవితం బలి అయిపోయింది. ఈ సంగతి నాకు మొదటే తెలిసివుంటే నీకు వేలూ, లక్షలూ ఇచ్చి వుండేవాణ్ని. నన్ను ఎందుకింత మోసంచేశావు!" కంగిస్తున్నట్టుగా అన్నాడు.

ఆమె కన్నీరే అందుకు జవాబు ఇచ్చింది.

"నిన్ను చూసిన క్షణంనుండీ నేను మనసులో నిన్ను ఎంత ఆరాధించానో, పెళ్ళి అవుతుంది నేను కోరుకున్న అమ్మాయితో అని ఎంత మురిసిపోయానో, పెళ్ళి అయ్యాక నువ్వే నాకీ ప్రపంచం అంతా అనుకున్నాను. ఎన్నో కలలు కన్నాను. తండ్రిని కాబోతున్నాను అని తెలిసి నా



మనసు ఎంత సంతోషంతో నిండిపోయిందో ఇవన్నీ నీకు ఎలా అర్థం అవుతాయి! నా మనసులో బాధ అగ్నిగుండమై నన్ను దహించేస్తుంటే నేను ఎలా భరించుకోను!" అంటూ పిచ్చివాడిలా జుత్తుని పిడికతో గట్టిగా పట్టుకున్నాడు.

"చెప్పు నన్ను ఎందుకు మోసం చేశావు! చెప్పు!" నిలదీసి అడిగినట్టుగా అడిగాడు.

ఇక దుఃఖం ఆపుకోవటం ఊర్మిళకు సాధ్యంకాలేదు.

నిలబడే శక్తి లేనట్టు భర్తకి దగ్గరగా వచ్చి అతని భుజం పట్టుకుని "ఏమండీ" అంటూ అలా క్రింద కూర్చుండిపోయి భర్త కాళ్ళని రెండు చేతులతో చుట్టేస్తూ.

"నన్ను క్షమించండి" అంటూ వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

"ఛీ నన్ను వదులు" అంటూ కాళ్ళతో ఆమె పట్టు వదిలించుకోబోయాడు.

ఆమె వదలలేదు. అతని కాళ్ళని అలాగే చుట్టేసి.

"నేను బురదలో పుట్టిన కలువనని మీకు ఆరోజు చెప్పాను. అంతేగాని మీకు నిజంచెప్పే ధైర్యంనాకు లేకపోయింది మీనుంచి ఈ విషయాలు అన్నీ దాచినందుకు నన్ను క్షమించండి" అంది.

చేత్తో ఆమె తల పక్కకు గెంటి కాళ్ళని ఒక్క విదిలింపు విదిలించుకున్నాడు.

ఆమె తూలి ఒకపక్కకు పడబోయి ఆపుకుంది.

అతను వెళ్ళి దూరంగా నిలబడ్డాడు.

ఆమె క్రింద కూర్చుని పైకి లేవలేదు. రెండు అరిచేతులూ నేలపై ఆన్చి వెనక మటంవేసి అలా మౌనంగా కన్నీరు కార్చసాగింది.

"జీవితంలో ఏ పురుషునికీ జరగని అన్యాయం నాకు జరిగింది. నువు ఎంతమంది పురుషులతో స్నేహం పెంచుకున్నా నేను భరించేవాడ్ని. కాని నా కన్నతండ్రితో..." అంటూ ఆగిపోయి ఇక ఆ తరువాత అతను మాట్లాడలేక పోయాడు.

అక్కడనుండి గదిలోకి వెళ్ళి తలుపులు మూసుకున్నాడు.

## 30

ఈ మధ్య ఉదయ్‌కృష్ణ సరిగ్గా భోజనం చెయ్యటం లేదని ఊర్మిళ తెలుసుకుని ఆ రాత్రి ఎనిమిది గంటలకు మేడమీదకు భోజనం పట్టుకెళ్ళింది.

మంచంమీద పడుకున్నాడు గదిలో లైటులేదు, గది అంతా చీకటిగా వుంది.

చేతిలో ట్రే టేబుల్‌పై వుంచి వెళ్ళి లైటు వేసింది. అతను కళ్ళు విప్పి ఆమెవైపు తీక్షణంగా చూశాడు.



"ఈమధ్య మీరు సరిగ్గా భోజనం చెయ్యటం లేదు. వచ్చి భోజనం చెయ్యండి." అంది మెల్లగా.

"నేను భోజనం చెయ్యను. ఆ ప్లేటు తీసుకెళ్ళిపో" కచ్చితంగా చెప్పేశాడు.

"నామీద కోపంతో భోజనం మానేయటం" అంటూ ఏదో చెప్పబోయింది.

"నోర్ముయ్" అంటూ గట్టిగా అరిచాడు.

"ఇంత జరిగినాకూడా నీకు సిగ్గు అనేది లేదు. ఇంకా మాట్లాడుతున్నావు ఛీ" అంటూ ఛీదరించుకున్నాడు.

"నన్ను ఎన్ని అయినా అనండి, కాని మీరుమాత్రం భోజనం మానేయవద్దు"

"నువ్వు ఇక్కడనుండి వెళ్తావా లేదా!"

"మీరు భోజనం చేస్తే వెళ్ళిపోతాను" తాపీగా చెప్పింది.

"భోజనం చెయ్యకపోతే!" రెట్టించాడు.

"ఇక్కడనుండి కదలను" మొండిగా చెప్పింది.

ఆమెవైపు ఒక్కసారి తీక్షణంగా చూసి మంచం మీదనుండి చటుక్కునలేచి టేబుల్ మీద వున్న ప్లేటుని ఒక్క దెబ్బతో క్రిందకు తోసేశాడు.

అన్నీ వరసగా పెద్దశబ్దం చేసుకుంటూ క్రింద పడిపోయాయి.

వాటిలో వున్న అన్నం, కూరలూ అన్నీ నేలపాలు అయ్యాయి.

ఊర్మిళ మనసు ఒక్కసారి విలవిల్లాడి పోయింది.

భర్త సరిగ్గా భోజనం చెయ్యటంలేదని అతను తనని ఛీ అన్నా ఎదురుపడితే అసహ్యించుకున్నా లెక్క చెయ్యక భోజనం తీసుకొస్తే అన్నీ క్రిందకు విసిరి కొట్టటంతో బాధ పడింది.

ఆమెవైపు తీక్షణంగా చూస్తూ చూపుడు వేలితో గుమ్మంవైపు చూపిస్తూ "ముండ నువ్వు బయటకు పో" అంటూ అరిచాడు.

ఆమె కదిలే ప్రయత్నం చెయ్యకుండా అలాగే నిలబడింది.

"నువ్వు ఇక్కడనుండి వెళ్ళకపోతే కత్తితో నిన్ను పొడిచి చంపేసి ఆ కత్తితో నేను పొడిచేసుకుంటాను" అంటూ కత్తికోసం తలతిప్పి అటూ ఇటూ చూశాడు.

పండ్లు కోసుకునే కత్తి టేబుల్ మీద తళతళా మెరుస్తూ కళ్ళపడింది.

వెంటనే ఆ కత్తి చేతిలోకి తీసుకుని, "ముండ ఇక్కడ నుండి వెళ్తావా లేదా! వెళ్ళకపోయావో" అంటూ కత్తి పైకి ఎత్తాడు.

ఆవేశంతో అతని కళ్ళు ఎర్రబడ్డాయి.

ఊర్మిళ అతనివైపు ఒకసారి మామూలుగా చూసి అక్కడనుండి మెల్లగా కదిలి వెళ్ళిపోయింది.

ఉదయ్‌కృష్ణ చేతిలో కత్తి దూరంగా విసిరికొట్టి నౌకర్ని పిలిచి ఆ గది అంతా శుభ్రం చెయ్యమని చెప్పి తను కొద్దిసేపు అవతలకు వెళ్ళి నిలబడ్డాడు.

* * * *



ఉదయ్‌కృష్ణకి ఆ రాత్రి నిద్ర పట్టలేదు.

ఊర్మిళ విషయం ఏం చెయ్యాలి?

ఆమె తన ఎదురుగా వుంటే జరిగిన విషయాలు అన్నీ గుర్తువచ్చి పిచ్చెత్తి పోతున్నట్టుగా వుంటుంది.

ఆమెను ఈ యింట్లోంచి పంపించేయాలి!

ఎలా?

ఎక్కడికి పంపించటం? ఎవరి దగ్గరకు పంపాలి?

తన యింట్లోనే ఆమె ప్రసవిస్తే!

పుట్టినబిడ్డపై తనకి మమకారం జనిస్తే!

ఆ బంధం తను వదిలించుకోగలడా!

అందుకే ఆమెను త్వరగా ఈ యింటినుండి ఎక్కడికి అయినా పంపించేయాలి.

ఎవరింటికి పంపించాలి!

ఈమెను చూస్తూచూస్తూ ఎవరు ఆదరిస్తారు?

ఈమెను తెలిసినవాళ్ళు ఎవరూ వాళ్ళ యింట అట్టే పెట్టుకోవడానికి ఇష్టపడరు.

ఏం చెయ్యాలి! అతని బుర్ర చురుగ్గా ఆలోచిస్తుంది.

ఆమెను ఎక్కడికయినా పంపించేస్తాడు అది సరే.

పుట్టిన బిడ్డని ఏం చెయ్యాలి?

తన బిడ్డగా స్వీకరించాలా, లేక తల్లినిబట్టి ఆ బిడ్డని దూరం చేసుకోవాలా!

తల్లి ఉన్నత వంశంలో పుట్టలేదని పెరిగి పెద్దయి ఈ నిజాన్ని తెలుసుకుంటే తల్లిని అసహ్యించుకోడా!

లేక రక్తంపంచి ఊపిరిపోసి జన్మయిచ్చిన తల్లి అని గౌరవాభిమానాలతో చూస్తాడా!

పుట్టినబిడ్డని కళ్ళతో చూస్తేమాత్రం తన పితృహృదయం పొంగిపోతుంది.

నవమాసాలూ మోసిన కన్నతల్లి ఎలా మురిసి పోతోందో.

తన రక్తాన్ని పంచుకుపుట్టిన బిడ్డని తన ప్రతిరూపాన్ని చూసుకుని తండ్రికూడా అంతగానే మురిసిపోతాడు.

భార్యాభర్తల మధ్య తెగిపోయిన బంధాలు పిల్లలు తిరిగి ముడేస్తారు అందుకే తను భయపడుతున్నది.

ఇక ఊర్మిళకి తనకి ఎలాంటి బంధం వుండకూడదు.

అదే తను కోరుకునేది.

రేపు ఉదయం తన ఫ్రెండ్ దగ్గరకు వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు.

అక్కడకు వెళితే ఊర్మిళ విషయం ఏం చేసేది నిర్ణయించవచ్చని నిశ్చయించుకున్నాడు.

o o o o



ఆరోజు ఉదయ్‌కృష్ణ ఫ్రెండ్ యింటికి వెళ్ళాడు.

ఫ్రెండ్ అంటే అతనికి యిద్దరికీ కొద్ది పరిచయమే వుంది.

ఒకళ్ళ యింటి వివరాలు ఒకళ్ళకి తెలియవు.

అందుకే అక్కడికి వెళ్లాడు.

ఉదయ్‌కృష్ణని చూసి అతను కొద్దిగా ఆశ్చర్యపోయాడు.

ఎప్పుడూ యింటికి రాలేదు, ఈరోజు వచ్చాడు అని.

ఆ భావం పైకి కనిపించనివ్వకుండా లోపలకు తీసుకెళ్ళి మర్యాద చేశాడు.

మెల్లగా తను వచ్చిన పని చెప్పాడు.

"మీ యింటిభాగం ఒకటి అద్దెకు ఇస్తారని విన్నాను యిస్తారా?"

"అవునండీ ఇంత ఇంట్లో ఒక్కళ్ళమే వుంటున్నాం. ఎవరికయినా ఇస్తే కొంచెం సందడిగా వుంటుంది అని అద్దెకు ఇవ్వాలనుకుంటున్నాం" అన్నాడు మెల్లగా.

ఇతనికి అద్దెకు ఇల్లు ఎందుకా అనిమనసులో ఆశ్చర్యపోతూ అతనికి ఎంత ఆస్థివుందో అందరికీ తెలుసు. మరి యిల్లు దేనికి!

"మా ఫ్రెండ్ ఒక అతను కలకత్తానుండి వ్రాశాడు. వైజాగ్‌లో అద్దెకి ఇల్లు ఏమైనా చూడమని అతని భార్యని కొద్దిరోజులు ఇక్కడ వుంచాలని. ఆమె డెలివరీ అయ్యాక యిల్లు ఖాళీ చేసేస్తారు. ఒక్క మూడు నెలలకి ఇల్లుకావాలి."

"అలాగే తప్పకుండా" అన్నాడు.

"అద్దె ఎంతో చెపితే అడ్వాన్సు ఇచ్చేస్తాను. ఆమె రేపు వస్తోంది కలకత్తానుండి" అని చెప్పాడు.

"ముందు మీరు ఇల్లు చూడండి" అన్నాడు.

ఉదయ్‌కృష్ణ యిల్లు చూడక్కర్లేదు అని చెప్పినా అతను వినకుండా తనతో అతన్ని పక్క పోర్షన్‌లోకి తీసుకెళ్లాడు.

ఆ యింటికి ఈ యింటికి సంబంధంలేదు. సపరేట్ పోర్షన్ ముందు పెద్దహాలు వెనక రెండుగదులు వంటగది వున్నాయి.

యిల్లు అందంగా నీట్‌గా వుంది.

అద్దె ఎంతో చెప్పమంటే అతను మొదట చెప్పలేదు.

ఉదయ్‌కృష్ణ చెప్పమని పట్టుపట్టటంతో అద్దె నాలుగు వందలు చెప్పాడు మొహమాటంగా.

అతను ఇక ఏం సందేహించకుండా జేబులోనుండి వెయ్యి రూపాయలు తీసి అతని చేతిలో పెట్టాడు.



వెయ్యిరూపాయలు ఒక్కసారి ఇవ్వటంతో ఆశ్చర్యంగా అందుకున్నాడు.

"రేపు సాయంత్రం ఆమెను ఇక్కడికి తీసుకొస్తారు. ఆమెకు ఏ ఇబ్బందీ లేకుండా మీ దంపతులు ఇద్దరూ కాస్త జాగ్రతగా చూడాలి. నాకు ఈమధ్య తీరిక వుండటంలేదు అందుకే నేను రోజూవచ్చి చూడలేను" అని చెప్పాడు.

అతను అలాగే అని చెప్పాడు.

"నేనూ మా ఆవిడ ఇద్దరం జాగ్రత్తగా చూస్తాం, నేను ఆఫీసుకి వెళ్ళినా మా ఆవిడ యింటిదగ్గరే వుంటుంది, మీకు ఆ భయం ఏంవద్దు" నమ్మకంగా చెప్పటంతో-

ఉదయ్‌కృష్ణ మనసు తేలిక అయింది.

ఊర్మిళని ఆ ఇంట్లోంచి తీసుకొచ్చి ఇక్కడ ఎవ్వరికీ తెలియకుండా వుంచాలని నిశ్చయించుకుని యింటికి వెళ్ళిపోయాడు. తన గదిలో కూర్చుని ఆలోచించసాగాడు.

## 31

ఊర్మిళను ఈ ఇంట్లోనుంచి పంపించేస్తే అంత బెంగ వుండదు.

తండ్రి మళ్ళీ ఒక నెలపోతే ఇంటికి వచ్చేరు అంటే ఆమెను ఇంటినుండి వెళ్ళగొట్టేరు. ఆ విషయం తను ఖచ్చితంగా చెప్పగలడు, ఊర్మిళ తన కళ్ళెదుట కనిపిస్తుంటే గుండెల్లో అగ్గి రాజుకుంటుంది.

ఆ అగ్గి తను గుండెల్లో దాచుకోని మామూలుమనిషి అయి తిరగలేడు. అందుకే ఆమెను త్వరగా ఇక్కడినుండి పంపించేయాలని నిశ్చయించుకున్నాడు.

ఇన్నిరోజులు ఆమెతో తను మాట్లాడటం మానేశాడు. ఎదుటపడితే అసహ్యించుకుని పక్కకు వెళ్ళిపోతున్నాడు.

అటువంటిది ఈ విషయం ఆమెకు ఎలా చెప్పటం!

చెపితే ఆమె తనమాట వింటుందా?

ఈ యింట్లోంచి కదులుతుందా!

అదీ నిజమే, ఆమెను ఈ ఇంట్లోంచి పంపించెయ్యటం తను అనుకున్నంత సులభంకాదేమో.

ఎలా, ఏమిటి చెయ్యటం?

ఆమెనుతిట్టి మెడబట్టి బయటకు గెంటేయటం తనకి ఇష్టంలేదు.

ఆమె వట్టిమనిషి కాదు. అలా చేస్తే ఆమె మనసు దెబ్బతింటుంది. ఇప్పటికే ఆమె చాలా పాడయిపోయింది.



తలదువ్వుకుని మంచిచీర కట్టుకుని ముస్తాబవటం మానేసింది.

ఆమెకు పుట్టబోయే బిడ్డగురించి బెంగవుంటుంది.

ఎటూ పాలుపోక ఆమె తనలో తను కుమిలిపోవచ్చు

అలాగని తను క్షమించి ఈ యింట్లో ఆమెను వుంచలేడు.

అది ఈ జన్మలో జరగని పని.

తండ్రి తనకి విషయం పెళ్ళికి ముందే చెప్పివుంటే ఆమెను వివాహం చేసుకోవటం మానేసేవాడు.

ఆమె అందచందాలుచూసి తనకళ్ళు పొరలు కమ్మేశాయి.

ఇప్పుడు తను ఈ విషమ పరిస్థితిలో ఇరుక్కున్నాడు.

ఎటూ తేల్చుకోలేని పరిస్థితి.

ఊర్మిళ చచ్చిపోతే తనకింత బాధవుండదు.

ఉదయ్‌కృష్ణ భార్య చచ్చిపోయిందనే సానుభూతి అందరూ వ్యక్తపరుస్తారు. కొద్దిరోజులకది మరుగున పడిపోతుంది.

ఆమె బతికివుంటే!

ఎన్నో సమస్యలు తల ఎత్తుతాయి.

భార్యాభర్తలిద్దరూ ఎందుకు విడిపోయారు!

ఉదయ్‌కృష్ణ భార్య ఇప్పుడు ఎక్కడుంది!

మృత్యుంజయరావుగారికి ఈ విషయం తెలుసా!

ఇలాంటి ప్రశ్నలు తెలిసిన వాళ్ళందరి మనసుల్లో ఉదయిస్తాయి.

అందుకే తను చాలా జాగ్రత్తగా తన పరువు ప్రతిష్ట కాపాడుకోవాలి.

థాంక్‌గాడ్ ఇంకానయం ఆమె ఫలానా అని అందరికీ తెలియలేదు. అందుకు నిజంగా సంతోషించవలసిందే.

ఒకే ఒకతనికి ఈ నిజం తెలుసు, అది తనకి చెప్పాడు.

ఊర్మిళ తనకి భార్య అని తెలియక.

ఆమెను వెంటబెట్టుకువెళ్ళి ఆ యింటిదగ్గర వదలి రావటం ఎలా అని ఆలోచించసాగాడు.

సాయంత్రం ఏదో ఒంకబెట్టి తనతో తీసుకెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు.

o o o o

ఆరోజు సాయంత్రం ఇంటికి వస్తూనే పనిమనిషి చెప్పినవార్త అతన్ని కొద్దిక్షణాలు అలా నిలబెట్టేసింది.



"బాబుగారూ ఈవేళ లేచినవేళ మంచిదండీ. అమ్మగారు కాలుజారి పడిపోయారండి, కాలు బెణికిపోయి కదల లేక పోతున్నారండీ డాక్టరమ్మవచ్చి ఇంజసన్ చేసి వెళ్ళిందండి. అమ్మగారు వట్టిమనిషి కూడా కాదు. ఎంత ప్రమాదం తప్పిపోయిందండి లేకపోతే ఇంకేమైనా వుందా!" అంటూ గాబరాగా ఎదురొచ్చి చెప్పింది.

అదే మునుపటిరోజులు అయితే తనెంత గాబరా పడేవాడో!

ఇప్పుడేమిటో మనసు బండబారిపోయింది.

జీవితమంటే విరక్తి కలిగిపోతుంది.

ప్రేమానురాగాలు తనలో నశించిపోయి రాక్షసుడిగా మారిపోయాడు.

ఆమె పడిపోయిందనే వార్తకంటే ఆమెను నాలుగు రోజులవరకు మంచంమీదనుండి కదపకూడదనే వార్తవిని బెంగపడిపోయాడు. ఆమెకు కాలు నయమైతేనేగాని ఆమెను ఈ యింటినుండి బయటకు తీసుకెళ్ళటం అవదని అంత వరకూ తనకు ఈ నరకం తప్పదని నిశ్చయించుకుని మేడ మీదకు వెళ్ళిపోయాడు.

* * * *

ఊర్మిళ మంచంమీద కూర్చుని పనిమనిషిని అడిగింది. "బాబుగారికి నేను కాలుజారి పడిపోయానని తెలుసా?"

"చెప్పానమ్మా" అంది పనిమనిషి.

"చెపితే ఏమన్నారు?" ఆతృతగా అడిగింది.

"ఏమీ అనలేదమ్మా తిన్నగా మేడమీదకు వెళ్ళిపోయారు"

ఊర్మిళ గుండెల్లో సన్నటి మంటలు బయల్దేరాయి.

విరక్తిగా నవ్వుకుంది. ఇంకా తనకి ఆశ చావటం లేదు.

తనగురించి ఆయనకంతా తెలిసిపోయిన తర్వాత కూడా ప్రేమాభిమానాలకోసం ప్రాకులాడటం నిజంగా తెలివితక్కువ తనమే.

తిరిగి తమ భార్యాభర్తల బంధం ముడిపడ్తుంది అనుకోవటం వట్టిమాట.

మృత్యుంజయరావుగారు వచ్చిమాత్రం ఏం చెప్తారు.

తన గురించి అంతా తెలుసుకున్నారు. ఇక ఏం చెపితే నమ్ముతారు?

మృత్యుంజయరావుగారి గదిలో రాత్రంతా గడపటం నిజంకాదా!



వచ్చి కొడుక్కి ఆయనమాత్రం ఏం చెపుతారు!

ఇక ఆ తండ్రీ కొడుకులకి ముఖం చూపించలేక ఇల్లు విడిచి వెళ్ళిపోదామంటే ఎలా!

తన కడుపులో పెరుగుతున్న బిడ్డ తన ఆశకి ఊపిరి పోస్తుంది.

జీవితంలో తను తల్లినికాలేను అనుకుంది.

తల్లి కాబోతుంది. ఇప్పుడు తను ఇల్లు విడిచి వెళ్ళిపోతే? తన బిడ్డ జీవితం ఏమౌతుంది!

తండ్రి ఎవరు? అనే ప్రశ్న అందర్లో ఉదయిస్తుంది.

నవ్వుతారు, వెక్కిరిస్తారు, హేళనచేస్తారు.

అలాచేస్తే తనబిడ్డ మనసు చిన్నబోదూ!

ఆ పసిమనసు ఎంత కృంగిపోతుందో ఎంత కుమిలిపోతుందో?

తండ్రికి దూరమైన ఆ బిడ్డను సంఘంలో ధైర్యంగా తను పెంచగలదా!

తనబిడ్డ పెరిగి పెద్దయి నాతండ్రి ఎవరని నిలదీసి అడిగితే! బదులుగా తను సమాధానం ఏం చెప్తుంది?

తండ్రిగురించి చెపితే! ఇల్లువిడిచి నువ్వెందుకు వచ్చేవు? అని ప్రశ్నిస్తే!

తన కథంతా చెప్పక తప్పదు.

చెపితే కన్న తల్లిని అసహ్యించుకోకుండా మానతాడా!

ఊర్మిళ ఒక నిశ్చయానికి రాలేక ఆలోచిస్తుంది.

ఆమె ఆలోచనలు ఒక దారికి రావటంలేదు.

తెగించి ఒక నిర్ణయానికి రాలేకపోతుంది.

ఊర్మిళకు ఇప్పుడు ఏడుమాసాలు పూర్తయిపోతున్నాయి.

ఆమె కాలునొప్పి వారం పదిరోజులవరకూ తగ్గలేదు.

అన్నిరోజులూ అలా మంచంమీదే గడిపింది.

ఆమె కాలునొప్పి ఎంతవేగంతగ్గుతుందా అనిఉదయ్ కృష్ణ చూస్తున్నాడు.

డాక్టర్ చూస్తే కదలవద్దు అంటుంది.

ఊర్మిళ కాలు బెణకటం వలన నడవలేకపోతుంది. డాక్టర్ చెప్పినట్టే మంచంమీద నుండి కదలటం లేదు.

ఈలోపు వూరునుండి తండ్రి ఎక్కడ వచ్చేస్తారో అని అతని భయం. వారం పదిరోజుల తర్వాత ఊర్మిళ మెల్లగా యింట్లో నడవగలుగుతుంది

అప్పటికీగాని అతని మనసు కుదుట పడలేదు.

ఈలోగా అతను వెళ్ళి యింటిగలవాళ్ళకి చెప్పి వచ్చాడు. "ఆవిడ ఇంకా కలకత్తానుండి రాలేదు. వారం



పదిరోజుల తర్వాత వస్తుందట. నాకు ఈరోజు ఈ త్తరం వచ్చింది."

వాళ్ళు సరే అన్నారు.

ఉదయ్ కృష్ణ ఆమెను ఆరోజు యింటినుండి బయటకు పంపే ప్రయత్నంలో వున్నాడు.

మెల్లగా ఆమె గదివైపు వెళ్ళాడు.

ఆమెను పేరుపెట్టి పిలవటమే తనకి అసహ్యంఅన్నట్టు గుమ్మం ఇవతల ఆగిపోయి పొడిగా దగ్గాడు.

మంచంమీద కూర్చుని చెంపకు చెయ్యి ఆనించుకుని పరధ్యానంలో పడిపోయిన ఊర్మిళకు అతను గుమ్మం దగ్గర నిలబడటంగాని అతను దగ్గటంగాని ఆమెకు తెలియలేదు.

ఒక్కక్షణం రెప్ప వాల్చకుండా చూశాడు.

మనిషి ఆ టైములో వుండవలసిన నిండుతనంలో అలా వుండేగాని పరీక్షగా చూస్తే ముఖం పీక్కుపోయి కళావిహీనంగా పాలిపోయినట్టు వుంది.

దానికితోడు తల దువ్వుకోలేదు. ఉదయం స్నానం చేశాక నుదుట కుంకుమ పెట్టుకున్నట్టు అది ఇప్పుడు నుదుట చెమటతో తడిసి నుదురంతా అయి ఎలాగో వుంది.

అలా ముస్తాబు లేకపోయినా ఆమెలో అదో కొత్త అందం తొణికిసలాడుతుంది.

ఆలోచన వరవడిలో కొట్టుకు పోతున్నట్టు అలా బొమ్మలా కూర్చుంది.

ఈసారి తలుపు చప్పుడు చేశాడు

ఆమె ఒక్కసారి తృళ్ళిపడినట్టు తల పక్కకు తిప్పి చూసింది.

ఉదయ్‌కృష్ణ గుమ్మం పొడవునా నిలబడివున్నాడు.

అతని ముఖం కోపాన్ని, గంభీరాన్ని దాచుకునిపైకి శాంతంగా కనిపించడానికి ప్రయత్నిస్తున్నట్టుగా వుంది.

భర్తను తన గది గుమ్మం ముందు చూస్తూ చటుక్కున లేవబోయింది.

అంత చటుక్కున లేవటం ఆమెకు సాధ్యం కాలేదు.

మెల్లగా భారంగా లేచి నిలబడింది. ఆ లేచి నిలబడటంలో కూడా ఒగుర్పు, ఆయాసం వచ్చినట్టుగా వుంది.

ఊపిరి బరువుగా పీలుస్తూ అతనివైపు ప్రశ్నార్థకంగా చూసింది.

ఎప్పుడూ ఇటురాని మనిషి ఇలా వచ్చారేమిటి అని.

"ఈమధ్య నువ్వు ఎక్కడికీ వెళ్ళటం లేదులా వుంది." మామూలుగా అన్నాడు.

తలాతోకా లేని ఆ ప్రశ్న వింటూనే అర్థం కాని దానిలా అలా చూస్తుండిపోయింది.



నిర్వికారంగా వున్న ఆ చూపుల్లో ఎలాంటి భావం తొణకలేదు.

పైగా ఆ చూపులు జాలిగా పరిస్థితులతో ఢీకొనలేక డీలాపడిపోయినట్టు దీనంగా వున్నాయి.

"డాక్టర్ చెప్పిందిగా సాయంత్రంవేళ చల్లగాలికి అలా వెళ్ళమని." అంటూ ఆగిపోయాడు.

అతనిమాట వింటూనే ఆ కళ్ళల్లో ఆశ్చర్యం చిన్న నక్షత్రంలా తళుక్కున మెరిసి ఇట్టే మాయమైంది.

ఆశ్చర్యం ఒక్క మెరుపు మెరిసి మాయమైన మరుక్షణం ఆ కళ్ళల్లో విచారం గూడు కట్టుకుంది.

ఈ ప్రపంచంలో ఇక నాకు కావలసింది ఏముంది!

నేను కోరుకున్నవి నాకు ఏం దక్కినయి గనుక!

ఈ చల్లగాలి ఈ షికార్లు నాకు ఎందుకన్నట్టు అదోరకంగా చూసింది. ఆ చూపుల్లో నైరాశ్యం కొట్టవచ్చినట్టు కనిపించసాగింది.

"నేను అలా పనివుండి వెళుతున్నాను. నువ్వు వస్తావేమో అని" అంటూ ఆగాడు. అతనికి ఇంకేం చెప్పాలో అర్థం కాలేదు.

నా వెంటరా అని అంతకంటే గట్టిగా చెప్పలేకపోయాడు.

"నేను రాలేను. నాకు ఒంట్లో బాగోలేదు. నీరసంగా ఉంది" అంది.

ఆ అనటంలో నేను రాను అన్నానని మీరు ఏమీ అనుకోవద్దు అన్నట్టుగా వుంది.

ఉదయ్‌కృష్ణ మరి అక్కడ నిలబడలేదు వెనుతిరిగి వెళ్ళిపోయాడు. ఊర్మిళ బరువుగా నిట్టూర్చింది

## 32

ఊర్మిళ అతను ఏ ఉద్దేశంతో కూడా తీసు వెళ్తాను అన్నాడో అసలు సంగతి గ్రహించుకోలేకపోయినా కావాలని మనస్ఫూర్తిగా పిలవలేదని మాత్రం గ్రహించుకుంది. అటువంటప్పుడు అతను పిలవగానే వెంటపడి వెళ్ళటం దేనికి, తనని అతని మనసులో అసహ్యించుకుంటున్నాడని తెలుసు.

ఊర్మిళకి కళ్ళనీళ్ళు గిర్రున తిరిగాయి

పెళ్ళి అయిన తరువాత అతని మాటలు, లాలన! ప్రేమ, అనురాగం అన్నీ ఒక్కొక్కటి గుర్తువచ్చాయి.



తను ఎక్కువగా తిరిగితే చాలు అతనికి కోపం వచ్చేది. అపురూపంగా చేతులమధ్య లేవనెత్తి మంచంమీద పడుకోబెట్టడం తన జుత్తుని ప్రేమగా సవరించి లాలించి అక్కున చేర్చుకోవటం అన్నీ గుర్తువచ్చి అపుకోలేని దుఃఖంతో చేతుల్లో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

మనసారా కరువుతీరా హృదయం బ్రద్ధలై గుండె కరిగిపోయినట్టు ఏడ్చింది.

అలా కుమిలి కుమిలి, కదిలి కదిలి ఏడ్చింది.

ఆయనలో ఇప్పుడా అనురాగంఏది! ఆ లాలన, ప్రేమ ఏది?

ఆయన చేతుల్లో ఒరిగిపోతేనేగాని తన మనసుకి హాయిగా, ఆనందంగా అనిపించేది కాదు.

ఆ లాలనలో కరిగిపోతేనేగాని మనస్సుకి తృప్తి అనిపించేది కాదు.

ఆయన చేతుల్లో హాయి, ఆ గుండెల్లో వెచ్చదనం, ఆ చూపుల్లో చల్లదనం ఇక తన స్వంతంకావు.

మనసులో గడ్డకట్టుకునివున్న బాధ అంతా కన్నీరుగా మారింది.

ఇక ఈ జీవితంలో తనకి సుఖం శాంతి లేవు.

ఏడ్చి ఏడ్చి అలసిపోయిన దానిలా నిస్త్రాణగా అలా ఆ మంచం మీదకు ఒరిగిపోయింది.

* * * *

ఆరోజు మృత్యుంజయరావుగారి వద్దనుండి ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరంలో ఆయన చూసిన వూళ్ళ గురించి అక్కడి సంగతులు వ్రాశారు. అందరూ బయలుచేరి కాశీ వెళ్తున్నట్టు కాశీలో ఒక పది ఇరవై రోజులు వుండి వస్తాం యింటికి వచ్చేసరికి నెలా పదిహేను రోజులు పడ్తుంది. అని వ్రాశారు.

కొడుకు గురించి వ్రాసింది తక్కువే. ఊర్మిళ గురించి ఎక్కువగా వ్రాశారు ఆ ఉత్తరంలో.

ఆ ఉత్తరం చదవగానే ఉదయ్ కృష్ణ కోపంతో వూగిపోయాడు.

ఒంట్లో రక్తం సలసలా కాగినట్టు అయి శరీరం అంతా వేడెక్కిపోయింది. ఎవర్ని అయినా చంపి ఆ నెత్తురు త్రాగితేనేగాని మనసు శాంతించనట్టు కోపంతో ఊగిపోయాడు

అతని కోపం అంతా ఉత్తరంమీద చూపించాడు.



ఉత్తరాన్ని కసిదీరా చింపి పదిముక్కల్ని వంద ముక్కల్ని వెయ్యి ముక్కలుగా చేసి విసిరేశాడు.

ఆ చింపిన ముక్కలు ఫ్యాన్ గాలికి తెల్లని పువ్వులలా ఎగిరిపోయి ఆ గది అంతా మల్లెపువ్వులు పరిచినట్టుగా అయింది.

ఆ గదిలో పడిన కాగితం ముక్కలవైపు కసిగా కోపంగా చూశాడు.

అతను చూస్తుండగానే ఆ ముక్కలు అన్నీ ఒక్క చోటకు చేరిపోయి ఒకటిగా అతుక్కుపోయాయి.

ఆ అతుక్కుపోయిన కాగితం అతన్ని చూసి విరగబడి నవ్వినట్టుగా అనిపించి పిచ్చి కోపంతో ముందుకి అడుగు వేశాడు ఆ కాగితం అందుకోవాలని.

అతను చూస్తుండగానే ఆ కాగితం రూపం మారిపోయి ఆ స్థానంలో జెయింట్ నిలబడి తనవైపే చూస్తూ కర్ణకఠోరంగా వికటాట్టహాసం చెయ్యసాగింది.

భరించరాని వేదనతో కళ్ళు గట్టిగా మూసుకుని చెవులు మూసుకున్నాడు ఆ శబ్దంవిని తను భరించలేనట్టుగా.

తల గిర్రున తిరిగిపోతుంది.

ఒళ్ళు అంతా ముచ్చెమటలు పోసేసి షర్టు అంతా తడిసిపోతుంది.

మెల్లగా కళ్ళు విప్పి చూశాడు.

ఆశ్చర్యం తను చింపి పారేసిన కాగితం ముక్కలు గదిలో చెల్లా చెదురు అయి అలాగే పడివున్నాయి.

అవి అతుక్కుని జాయింట్‌గా మారి తనని భయపెట్ట లేదు.

అంతా తన భ్రమ. ఆలోచిస్తుంటే పిచ్చెత్తిపోతుంది.

లేనిపోని ఆలోచనలతో తల వేడెక్కి కణతలు దగ్గర పట్టుకున్నాడు.

తలపై ఎవరో సమ్మెటలతో కొడుతున్నంత బాధగా అనిపిస్తుంది.

నిజం ఎంత చేదుగా వుంటుంది. నిజాన్ని భరించే శక్తి అందరికీ వుండదు. ఆలోచిస్తూ అలా వుండిపోయాడు.

మర్నాడు ఎలా అయినా ఆమెను ఈ యింటినుండి పంపించేయాలనే నిశ్చయించుకున్నాడు.

ఆరోజు సాయంత్రం అయిదు గంటలకి యింటికి వచ్చి నౌకర్ని పిలిచి చెప్పాడు. "అమ్మగార్ని త్వరగా తయారయి రమ్మను. ఒక చోటకి వెళ్ళాలి" అని.

నౌకరు వెళ్ళి ఊర్మిళకి ఈ విషయం చెప్పటంతో ఆమె అలాగే అని తల ఊపింది. ఎక్కడికి అని ప్రశ్నించ



కుండా చీర మార్చుకొని ఇవతలకి వచ్చింది. ఈయన ఎక్కడికి తీసుకెళ్తారా అన్నట్టు చూస్తూ.

ఉదయ్‌కృష్ణ ముందుగా దారి తీశాడు.

మౌనంగా భర్తను అనుసరించింది.

ఇద్దరూ కారులో కూర్చున్నారు. కారు బయలు దేరింది.

అతనికి ఒక విధంగా బాధగా, జాలిగా అనిపిస్తుంది.

ఇలా ఇద్దరం కలసి సరదాగా వెళ్ళేవాళ్ళం. ఆ రోజులు ఎంతలో మారిపోయాయి

ఇప్పుడు ఇలా ఇద్దరి జీవితాలు దుఃఖమయం అయి పోయాయి అని బాధపడ్డాడు.

ఆమెను ఒక విధంగా మోసగించి ఆ ఇంటికి తీసు కెల్తున్నాను ఏమో అని పరి పరి విధాల ఆలోచించసాగాడు.

కారు చిన్నగా ఒక యింటిముందు ఆగింది.

ఈ యిల్లు ఎవరిదా అని ఆశ్చర్యపోయింది. ఆమె ఆ మాట భర్తని అడిగే ధైర్యం లేకపోయింది.

కారు దిగి అతన్ని మౌనంగా అనుసరించింది.

ఇంటి గలవాళ్ళ దగ్గర తాళాలు అడిగి తీసుకుని తలుపులు తెరిచాడు.

ఊర్మిళకు అర్థంకా లేదు. ఆ ఇల్లు అంతా ఖాళీగా ఒక్క సామాను లేకుండా వుంది.

ఆ ఇంట్లో ఎవరూ మసులుతున్నట్టు లేదని స్పష్టంగా తెలుస్తుంది

అంతలో ఒక వయసు మళ్ళిన స్త్రీ అక్కడికి వచ్చింది.

"ఏం బాబూ! నన్ను ఈ రోజునుండి పనిలోకి వచ్చేయమంటారా!" అని అడుగుతూ.

అతను తల ఊపాడు. "ఈరోజునుండి నువ్వు ఈ అమ్మగార్ని కనిపెట్టుకు ఉండాలి" అని చెప్పి ఊర్మిళవైపు తిరిగి.

"నీకు ఈ మనిషి తోడుగా వుంటుంది. వంట పనీ అంతా చేస్తుంది.

ఇంటిగల అతను ఆఫీసునుండి వచ్చాక వంటకి కావలసిన సామాన్లు మంచం, టేబుల్, కుర్చీ అన్నీ తీసుకు వస్తాడు జాగ్రత్తగా వుండు. నీకు ఏం కావలసినా ఇంటిగల వాళ్ళు చూస్తారు. నీకు ప్రతీనెలా డబ్బు పంపిస్తాను. ఈ



డబ్బుకూడా వుంచు" అంటూ కోటు జేబులో డబ్బు తీసి ఆమె చేతిలో పెట్టాడు.

ఆ డబ్బు ఆమె చేతిలో పెట్టడం ఊర్మిళకి తెలియ లేదు. ఆ డబ్బు బలవంతంగా ఇచ్చాడేమో!

భర్త మాటలు వింటూనే శిలాప్రతిమలా వుండి పోయింది. అతను చెప్పే మాటల్లో ఒక్క అక్షరం కూడా చెవికి ఎక్కటం లేదు.

ఇందుకా ఈయన తనని వెంటబెట్టుకుని తీసుకు వచ్చింది!

అయోమయంగా తనెక్కడ వుంది! అనే ధ్యాస లేకుండా అలా నిలబడిపోయింది.

అంతలో ఇంటిగల వాళ్ళు వస్తే ఊర్మిళని వాళ్ళకి పరిచయం చేశాడు.

"ఈమె నా ఫ్రెండ్ మిసెస్" అంటూ పరిచయం చేశాడు

ఊర్మిళ అవును కాదు అని సమాధానం చెప్పలేదు వారికి మౌనంగా చేతులు జోడించింది.

వాళ్ళలో ఒకఆమె అతని భార్య. మరోకామె చెల్లెలు అతను ఆఫీసునుండి ఇంకా రాలేదు.

వాళ్ళకి ఆమె విషయం జాగ్రత్త అని చెప్పి వెళ్ళి పోయాడు.

ఖాళీగా బోరుమంటున్న ఆ ఇంట్లో ఒంటరిగా అలా నిలబడి పోయింది.

ఆమెకు కాలం స్థంభించిపోయినట్టుగా వుంది.

# 33

రోజులు ఒక్కొక్కటి గడిచిపోతున్నాయి.

అటు ఉదయ్ కృష్ణ, ఇటు ఊర్మిళకి మనసు స్థిమితం లేదు.

ఊర్మిళని మంచం మీదనుండి కదలనివ్వకుండా వంట మనిషి రంగమ్మ చూస్తుంది.

ఆమెకు తిండి తినాలని నిద్రపోవాలని అనిపించటం లేదు.

రాత్రీ పగలూ అలా ఆలోచిస్తూ పిచ్చిదానిలా రోజులు గడుపుతుంది.



మోసంచేసి భర్త ఇక్కడికి తీసుకు వచ్చినందుకు అతన్ని ఏమీ నిందించలేదు.

ఇంటిగల అతను ద్వారా డబ్బు పంపిస్తున్నాడు.

ఒక్కసారికూడా అతను ఆ ఇంటికి రాలేదు.

రాలేదు అని బాధపడలేదు.

తన పరిస్థితికి తనలో తానే కమిలిపోయింది.

తను ప్రసవించాక అయినా ఆయన బిడ్డను చూడడానికి వస్తారా? రారా? అన్న దిగులు ముంచుకు వస్తుంది.

ఊర్మిళకు నెలలు నిండుతున్నాయి.

ఉదయ్ కృష్ణ ఒక్కసారికూడా రాలేదు.

ఆమెకు అతన్ని ఒక్కసారి చూడాలన్న పిచ్చికోరిక కలగసాగింది.

అతన్ని చూస్తేగాని ప్రాణం నిలవలేనట్టు అవసాగింది.

నెలలు నిండేకొద్ది ఆమె ఆరోగ్యం సరిగ్గా వుండటం లేదు.

మంచం మీదనుండి కదలటం లేదు ఇరవై నాలుగు గంటలూ అలా ఆ మంచంమీద పడివుంటుంది.

ఒకరోజు ఆమె అలా పడుకుని వెక్కి వెక్కి ఏడ్వటం రంగమ్మ కళ్ళపడింది.

ఆవిడకు జాలేసి నెమ్మదిగా దగ్గరకు వెళ్ళి ఓదార్చ సాగింది.

"ఏమ్మా ఎందుకు ఏడుస్తున్నావు! ఒంట్లో బాగో లేదా!" అని అడిగింది.

కాదన్నట్లు తల తిప్పింది. అలా ఏడుస్తూనే రంగమ్మ ఓదార్చేకొద్దీ ఆమెకు దుఃఖం మరింత ఎక్కువ అవసాగింది.

"ఎందుకు ఏడుస్తున్నావో నాకు చెప్పమ్మా" అంటూ బ్రతిమాలింది

వంటమనిషి అడగ్గా అడగ్గా అప్పుడు చెప్పింది.

"రంగమ్మా! ఆయన ఇక్కడకు ఒక్కసారికూడా రాలేదు. ఆయన్ని చూడాలని వుంది రంగమ్మా" అంటూ వంటమనిషిని పట్టుకు ఏడ్చేసింది.

"అయ్యో తల్లి" అంటూ ఓదార్చి. "ఆ బాబుగార్ని నేను వెళ్ళి తీసుకువస్తాను ఉండండమ్మా" అంది.

ఆమాట వినటంతో ఊర్మిళ కళ్ళు వింతకాంతితో తళుక్కున మెరిశాయి. "నిజమా! రంగమ్మా! నువ్వు వెళ్ళి తీసుకు వస్తావా!" అడిగింది ఆత్రతగా నమ్మలేనట్టు.



"అవునమ్మా వెళ్తాను" అంది.

"అయితే ఇప్పుడే వెళ్ళు రంగమ్మా" అంది ఒక్క క్షణం ఆగలేనట్టు.

"ఇప్పుడా!"

"అవును ఇప్పుడే వెళ్ళు. బస్‌కి డబ్బులిస్తాను" అంది.

రంగమ్మ అలాగే అని ఊర్మిళ దగ్గర డబ్బులు తీసుకుని వెళ్ళింది.

* * * *

ఉదయ్‌కృష్ణ అప్పుడే ఇంటికి వచ్చాడు. అతను ఇంటికి వచ్చిన అరగంటకి రంగమ్మ వచ్చింది.

ఆవిడ్ని చూస్తూనే ఏం ఎందుకు వచ్చావు అన్నట్టు చూశాడు.

"బాబుగారూ! అమ్మగారు మిమ్మల్ని చూడాలని కలవరించేస్తున్నారండి. భోజనం కూడా సరిగ్గా చెయ్యటం లేదు. ఏడుస్తూ పడుకుంటున్నారండి. మీరు ఒక్కసారి రండి" అంది మెల్లగా.

అతని ముఖం ఒక్కసారి గంభీరంగా మారిపోయింది.

"సరే నువ్వు వెళ్ళు" అన్నాడు మామూలుగా.

"అమ్మగారికి ఏం చెప్పమన్నారండి."

అతను వెంటనే ఏం చెప్పలేక పోయాడు.

"ఇంటికి ఇప్పుడు వస్తారాండీ."

"ఊ..."

"అయితే అమ్మగారికి మీరు వస్తానన్నారని చెప్తానండి."

"ఊ..."

"నేను వెల్తానండి బాబుగారూ!" అంటూ రంగమ్మ వెళ్ళి పోయింది.

ఊర్మిళ రంగమ్మ రాకకోసం ఎదురు చూస్తుంది.

రంగమ్మ వెళ్ళేసరికి యింటి దగ్గర ఆయన వున్నారో! లేదో!

వుంటే ఏమన్నారో!

ఆమె ఆలోచిస్తూ ఆవిడకోసం చూడసాగింది.

రంగమ్మ రావటంతో ఆతృతగా అడిగింది.

"రంగమ్మా! ఆయన యింటిదగ్గర ఉన్నారా! వస్తానని అన్నారా!"

"వస్తానన్నారమ్మా" నవ్వుతూ చెప్పింది.

"ఎప్పుడు వస్తాను అన్నారు! ఇప్పుడా!"

"ఇప్పుడే వస్తాను అన్నారు."



"నిజంగానా!" అడిగింది సంతోషం పట్టలేక.

"జంగాని నేనమ్మా"

"రంగమ్మా! ఆయన ఎలా వున్నారు, ఖులాసాగా ఉన్నారా!"

"ఆ ఖులాసాగానే ఉన్నారమ్మా"

"రంగమ్మా! ఆయన వస్తారు. ఏమయినా టిఫిన్ చెయ్యవా!"

"ఏం చేయమంటారు?"

"ఊ ఏం చేస్తావు! ఆ ఆయనకి గోధుమ హల్వా అంటే ఇష్టం, హల్వా చెయ్యి"

అలాగేనంటూ లోపలకు వెళ్ళబోతుంటే,

"ఆ ఆగు రంగమ్మా నేనే నెమ్మదిగా వచ్చి హల్వా చేస్తాను" అంది మంచంమీదనుండి లేవడానికి ప్రయత్నిస్తూ

ఆమెకు ఓపిక లేక పోయినా శక్తినంతా కూడదీసుకుని లేవబోతుంటే రంగమ్మ అంది.

"మీ రసలే నీరసంగా లేవలేక పోతున్నారు. నే చేస్తాను లెండమ్మా"

ఊర్మిళ వినలేదు. వంటమనిషి సాయంతో లేచి వంటగదిలోకి వెళ్ళింది. అతనికోసం శ్రమపడి స్వీట్స్ చేసింది.

అవి అయ్యాక "రంగమ్మా ఒకవేళ ఆయన భోజనానికి వుంటే!"

"వుంటే వెంటనే నేను వంటచేస్తాను"

"ఊహు అప్పుడు హడావిడి అయిపోతుంది. వంట కూడా నేనే చేసేస్తాను" అంది.

రంగమ్మ చెపుతున్నా ఆమె వినలేదు. అతనికి ఇష్టమైన కూరలన్నీ చేసింది.

పనంతా అయ్యాక ఊర్మిళకి నడుం పట్టేసింది.

పనిమనిషి సాయంతో మెల్లగా లేచి అవతలకెళ్ళింది.

ఉదయ్ కృష్ణ వస్తాడని ఎదురుచూస్తూ కూర్చుంది.

ఆరుగంటలు దాటిపోయి ఏడు గంటలవుతుంది.

అతను రాలేదు.

"రంగమ్మా! ఆయన ఈరోజే వస్తాను అన్నారా! నువ్వు సరిగ్గా విన్నావా" అడిగింది అనుమానం తీరక.



"ఈరోజే వస్తానని చెప్పారమ్మా నేను విన్నాను కదా" అంది.

"మరి ఇంకా రాలేదేమిటి!" నీరసంగా అడిగింది.

"వస్తారమ్మా దారిలో ఏ స్నేహితుడు కనిపించారో"

"కాని అదీ నిజమే" అంటూ ఒప్పుకుంది.

అతనికోసం ఎదురుచూస్తూ కూర్చుంది.

ఎనిమిది, తొమ్మిది, పదయినా రాలేదు.

ఊర్మిళకు దుఃఖం ముంచుకు వచ్చేస్తుంది.

రంగమ్మకి నిద్ర ఆగక కొంగు పరుచుకుని పడుకుండిపోయింది.

పదకొండు గంటలవరకూ ఆశ చావక ఎదురు చూసింది.

ఇక రాడని నిశ్చయించుకుని రంగమ్మని లేపి భోజనం చేసి పడుకోమంది.

ఊర్మిళ మాత్రం భోజనం చేయలేదు.

రంగమ్మ ఆమెను బతిమాలి గ్లాసు మజ్జిగ త్రాగించగలిగింది.

ఆమె ఏడుస్తుంటే ఓదార్చి ధైర్యం చెప్పింది.

"ఆ బాబుగారు ఏ పనిమీద వెళ్ళారో రేపు వస్తారేమో" అని చెప్పటంతో.

ఊర్మిళలో కొత్త ఆశ తల ఎత్తింది.

ఎప్పుడు తెల్లవారుతుందా! ఆయన ఎప్పుడు వస్తారా అని ఎదురు చూడసాగింది.

ఆమె ఎదురుచూసినంత త్వరగా తెల్లవారలేదు.

పక్కమీద అటూ ఇటూ తిరిగింది నిద్రపట్టక.

తెలతెలవారుతుండగా రంగమ్మతోపాటు లేచిపోయింది.

స్నానంచేసి బట్టలు మార్చుకుని తీరిగ్గా కూర్చుని భర్త రాకకోసం ఎదురుచూస్తుంది.

అతనురాలేదు. సాయంత్రం వస్తారేమోనని వంటమనిషి చెప్పటంతో అవునేమోనని సరిపెట్టుకుంది.

సాయంత్రం రాలేదు.

ఆరాత్రి మళ్ళీ పదకొండు గంటలవరకూ ఎదురు చూసింది.

మర్నాడు రంగమ్మ ఉదయ్‌కృష్ణ ఇంటికి వెళ్ళింది

వెళ్ళేముందు ఊర్మిళచేత చిన్న ఉత్తరం వ్రాయించి పట్టుకెళ్ళింది.



"మిమ్మల్ని చూడాలనుంది. ఒకసారి రండి మళ్ళీ వెంటనే వెళ్ళిపోదురుగాని

ఊర్మిళ."

అని వ్రాసి ఇచ్చింది.

రంగమ్మ ఉత్తరం ఇచ్చేసి తిన్నగా యింటికి వచ్చేసింది.

"ఏం రంగమ్మా! ఆయన ఉన్నారా! ఏమన్నారు? ఉత్తరం తీసుకున్నారా? వస్తానన్నారా" అడిగింది ఆతృతగా.

"ఉత్తరం చదువుకున్నారమ్మా. వస్తానని చెప్పమన్నారమ్మా"

"నిజంగానా" అంది సంతోషంగా.

"నిజం అమ్మగారూ!"

ఆరోజుకూడా అలాగే అతనికోసం ఎదురుచూస్తూ కూర్చుంది.

అతను రాలేదు.

మర్నాడు రంగమ్మ మళ్ళీ వెళ్ళింది. వెళ్ళి ముఖం వేలాడేసుకొని వచ్చింది.

"రంగమ్మా" అంటూ ఎదురు వెళ్ళింది. ఆ కళ్ళల్లో ఎంతో ఆతృత కొట్టవచ్చినట్టు కనిపించసాగింది.

ఈసారి రంగమ్మ వెంటనే బదులివ్వలేదు.

బ్రతిమాలి అడగ్గా అడగ్గా అప్పుడు చెప్పింది.

"ఆ బాబుగారు గసిరి పారేశారమ్మా, నేను రాను ఆ యింటిగుమ్మం తొక్కను. ఎందులోనయినా పడి చావను. అని అన్నారమ్మా" అంది.

ఆ మాటలు వింటూ ఊర్మిళ ఒక్కసారి కుప్పకూలిపోయింది.

# 34

ఆ రోజు మృత్యుంజయరావుగారు వూరునుండి వచ్చారు. ఆయన వచ్చేటప్పటికి ఇంటిదగ్గర ఉదయ్‌కృష్ణ లేడు.

మృత్యుంజయరావుగారు వచ్చేముందు ఉత్తరం వ్రాద్దామనుకున్నారు. ఇక అనుకోకుండా అందరూ బయలుదేరి వచ్చేశారు.



అందుకే ముందుగా ఉదయ్‌కృష్ణకి తెలియలేదు.

మృత్యుంజయరావుగారు రావటంతో నౌకర్లు అందరూ హడావిడి పడిపోయారు.

"అమ్మగారు మేడమీద ఉన్నారా!"

"లేరండి."

"మరి బాబుగారు!"

"ఆయా ఇంటిదగ్గర లేరండి" అంటూ నౌకర్లు చెప్పారు.

ఆయన మరోలా అర్థం చేసుకున్నారు. కొడుకూ, కోడలూ ఎక్కడికయినా వెళ్ళి ఉంటారని.

"అమ్మగారికి ఒంట్లో కులాసాగా ఉంటుందా?" నౌకర్ని అడిగారు.

అతడు తల వూపాడు.

ఆయన ఇంకేం మాట్లాడలేదు. ప్రయాణపుబడలికతో కాస్సేపు తన గదిలోకి వెళ్ళి పడుకున్నారు.

ఉదయ్‌కృష్ణ ఇంటికి రావటంతో తండ్రి వూరునుండి వచ్చేశారని తెలిసి గదిలోకి వెళ్ళాడు.

ప్రయాణం గురించి,ఆయన ఆరోగ్యంగురించి ప్రశ్నించాడు.

ఆయన సమాధానం చెప్పారు.

తప్పనిసరి తండ్రితో మాట్లాడేదేగాని మనస్ఫూర్తిగా మాత్రం రాదు. అతనికి తండ్రంటే ఎప్పుడో అసహ్యం కలిగి పోయింది.

ఊర్మిళ ఆ గదిలోకి ఎంతకీ రాకపోవటంతో ఆయన అడిగారు.

"అమ్మాయి ఏది! కనిపించదే!"

అతను సమాధానం ఇవ్వలేదు.

"ఉదయ్ సమాధానం చెప్పవేమిటి? అమ్మాయి ఏది?"

"వస్తుంది" అన్నాడు మెల్లగా.

"మేడమీద ఉందా!"

అతను మాట్లాడకపోవటంతో ఆయనకి అనుమానం వచ్చింది.

కొడుక్కీ, కోడలుకీ మాటలులేవా! ఇద్దరూ మాటకు మాటా అనుకున్నారా! అని ఆ మాట పైకి అడిగారు.

అతను మాట్లాడలేదు.

"మాట్లాడవేంరా!" గట్టిగా కేకపెట్టారు.

"పంచవన్నెల రామచిలుక అని మనం భావించి బంగారుగూటిలో బంధిస్తే ఆకాశంలో తిరిగేపక్షి పారి పోకుండా వుంటుందా!" అన్నాడు అదోరకంగా నవ్వి.



"అంటే ..."

"అంటే ఏముంది. ఆమె యిక్కడ ఎక్కువ రోజులు ఉండలేక పారిపోయింది."

"ఉదయ్" ఆయన కంఠం కంగ్ మంది. కళ్ళు ఎర్రగా వున్నాయి.

తండ్రికి అంతకోపం రాగా అతనికి ఎప్పుడూ తెలీదు.

"అసలు ఏం జరిగిందో నాకు నిజం చెప్పు" అంటూ కలగించి అడిగారు.

"ఉదయ్ నాకు పిచ్చెత్తిపోతుంది. నిజం చెప్పు. చెప్పు" అంటూ గట్టిగా అరిచేరు.

ఆయన అలా అరుస్తుంటే తండ్రికి ఇప్పుడే ప్రాణం పోతుందేమో అని మనసులో భయపడ్డాడు.

"ఊర్మిళని నేనే ఈ ఇంట్లో ఉండకుండా పంపించేశాను" తాపీగా చెప్పాడు.

"కారణం" ఆయన కళ్ళు ఎర్రగా చింతనిప్పుల్లా వున్నాయి.

కోపంతో వూగిపోతున్నారు.

"నా ఫ్రెండ్ ఒకతను ఈ వూరువచ్చాడు. ఊర్మిళా నేనూ బీచ్‌కి వెళ్ళాం. ఆమె దూరంగా కూర్చుంది. ఒక

ఫ్రెండ్ కనిపిస్తే అతనితో నేను కొద్దిదూరం నడిచివచ్చాం. అతను వెళ్ళిపోయాడు. తిరిగి ఊర్మిళ దగ్గరకు వెళుతుంటే వూరునుండి వచ్చిన ఫ్రెండ్ అక్కడ కనిపించాడు. అక్కడ నిలబడి మాట్లాడుతుంటే నా ఫ్రెండ్ నవ్వుతూ ఊర్మిళ కూర్చున్నవైపే చూస్తున్నాడు. ఆమె ఇటు చూడటం లేదు. ఏమిటి అలా చూస్తున్నావు అని అడిగితే ఏంలేదని నవ్వేశాడు. నాకు ఏదో అనుమానం వచ్చినా సర్లే ఏదో అని సరిపెట్టేసుకుని వేరే మాటల్లో పడిపోయాం. అతను వెళ్ళిపోయాడు. నేను ఊర్మిళతో ఇంటికి వచ్చేశాను. మర్నాడు అతను ఉన్న హోటల్‌కి వెళ్ళాను. అక్కడ మళ్ళీ ఊర్మిళ విషయం వచ్చింది. ఆమె వేశ్యకుటుంబంలో పుట్టిన అమ్మాయి అని తను ఇంతకుముందు ఈ వూరువచ్చినప్పుడు నేనున్న పక్క రూమ్‌లోనే మృత్యుంజయరావుగారట ఆయన ఉన్నారు ఆయన లక్షాధికారట. నాకు అక్కడ హోటల్‌లో వున్న వాళ్ళు చెప్పారు. ఆ మృత్యుంజయరావుగారు అప్పుడు ఈ అమ్మాయిని ఆయన గదికి రప్పించుకున్నారు. అంటూ నా ఫ్రెండ్ చెప్పాడు" అంటూ తండ్రికి చెప్పాడు ఉదయ్‌కృష్ణ.

"ఫ్రెండ్ చెపితే నమ్మావా!" తీక్షణంగా అడిగారు.



అతను మాట్లాడలేదు. కోపం ఆపుకుంటున్నట్టుగా అలా నిలబడిపోయాడు.

"ఆ విధవ ఎవడో చెపితే నమ్ముతావా!"

"ఉన్నమాట చెప్పాడు, నేను నమ్మాను"

"ఏమిటా ఉన్నమాట? నీకే ఒక చెల్లెలు ఉంటే నా గదిలో రాత్రంతా గడిపితే నువ్వు ఏమనుకుంటావురా మూర్ఖుడా! అందుకే ఊర్మిళని నువ్వు చేసుకుంటానని పట్టుపట్టినా మీకు ఇద్దరికీ పెళ్ళి చేయటం నాకు ఇష్టం లేకపోయింది. ఎంత డబ్బు ఖర్చు అయినా ఆ అమ్మాయికి వేరే సంబంధం చూసి పెళ్ళిచేయాలని అనుకున్నాను. ఈ విషయం ఎప్పటికయినా తెలిస్తే అనుమానాలతో మీ సంసారం ఛిన్నాభిన్నం అవుతుందనే భయపడ్డాను. అందుకే నీకు ఇచ్చి చెయ్యటం నాకు ఇష్టంలేకపోయింది. ఊర్మిళ వేశ్యకులంలో పుట్టినా నిప్పులాంటిదిరా" అంటూ ఆవేశంతో, ఆవేదనతో వూగిపోయారు.

ఉదయ్‌కృష్ణ మాట్లాడలేదు. అతనికి తండ్రిమాటలు వింటుంటే అసహ్యంవేస్తుంది.

"నేను చెప్పేది అంతా నువ్వు పూర్తిగావిని అప్పుడు ఊర్మిళ గురించి నువ్వు ఆలోచించు" అంటూ క్షణం ఆగి మెల్లగా చెప్పసాగారు.

"నేను మరికొందరు వేరే బిజినెస్ పార్టనర్స్ హోటల్ రూమ్‌లో కూర్చుని డ్రింక్స్ తీసుకుంటున్నాం. వాళ్ళతో నన్నూ పార్టనర్‌గా చేరమని పట్టుపట్టసాగారు. నాకు ఇష్టం లేదు. వాళ్ళతో వేరే బిజినెస్‌లో కలవటం నేను ఎంతకాదని చెప్పినా వాళ్ళు పట్టువిడవలేదు. నేను మాటల్లో డ్రింక్ ఎక్కువగా త్రాగేయటం వలన ఒళ్ళు తెలియకుండా ఆ గదిలో పడి వున్నాను.

టైము రెండుగంటలు అవుతుండగా నాకు మత్తు కొద్దిగా తగ్గి కళ్ళువిప్పి చూశాను. ఆ గదిలో ఓ అమ్మాయి భయంగా గడగడ వణికిపోతూ నిలబడివుంది. నువ్వు ఎవరు ఇక్కడికి ఎందుకు వచ్చావు అని అడిగితే ఆ అమ్మాయి కన్నీరు కారుస్తూ నా పాదాలమీద పడిపోయింది. డబ్బు కోసం నావాళ్ళు నన్ని గదిలోకి పంపించారని తను అటువంటిదాన్ని కానని తనని వదిలేయమని నన్ను మీ కూతురిలా భావించండి అని హృదయ విదారకంగా ఏడ్వసాగింది. అప్పుడు నేను గ్రహించుకున్నాను. వాళ్ళ బిజినెస్‌లో నన్ను పార్టనర్‌గా చేరమని నన్ను మంచి చేసుకోవటం కోసం ఈ అమ్మాయిని నా గదికి పంపించారు అని. అప్పుడు ఆ అమ్మాయికి ధైర్యంజెప్పి, నేను నీ తండ్రిలాంటివాడ్ని. నా వలన నీకు ఏ అపకారం వుండదు అని చెప్పిన తరువాత ఆమె దుఃఖంతగ్గి స్థిమితపడింది.



ఆమె పేరు. ఏం చదువుకుంది, వాళ్ళ ఇంటివివరాలు అడిగాను. తన పేరు ఊర్మిళ అని, మెట్రిక్ పాసయ్యాను అని, తను కళాకారుల కుటుంబంలో జన్మించాను అని చెప్పి తనని తల్లి ఎనిమిది సంవత్సరాలుగా ఈ వృత్తిలోకి లాగాలని తనని ఎన్ని కష్టాలు పెట్టిందో చెప్పి ఏడ్చింది. తండ్రికి కూతురు అంటేఇష్టం, భార్యతో దెబ్బలాడి కూతుర్ని ఆ వృత్తిలోకి లాగకుండా పదికళ్ళతో చూసుకునేవాడు.

రాను రాను ఆ ఇల్లు ఊర్మిళకు ఒక నరకం అయిపోయింది.

ఇంటికి ఎవరు వచ్చినా ఊర్మిళ అందంచూసి ఎంత డబ్బు అయినా సరే ఇస్తాం. ఆమె తనతో ఒకరాత్రి వుండేటట్టు చెయ్యమని బ్రతిమాలేవారు. తండ్రి ససేమిరా ఒప్పుకునేవాడు కాదు. తల్లికి వాళ్ళు ఇస్తామన్న డబ్బుచూసి రానురాను ఆశ పెరిగిపోయి కూతుర్ని ఏ విధంగా అయినా లొంగదియ్యాలని నిశ్చయించుకుంది.

ఊర్మిళ ఆమెకు కొరకరానికొయ్యలా తయారయింది. తండ్రి ఆమెకు అండగా నిలబడటంతో తల్లికి కూతురిమీద కసి పెరిగిపోయింది.

ఊర్మిళకి పెళ్ళి చేసుకుని అందరి స్త్రీలలాగే జీవితం గడపాలని భర్త పిల్లలతో హాయిగా వుండాలని ఆమె కలలు కనేది.

ప్రాణం తీసుకోవడానికి అయినా వెనుకాడేది కాదు. తల్లిమాట వినేకంటే ప్రాణంపోతే నయం అనుకునేది.

ఒకరోజు తండ్రికి ఒంట్లో బాగోలేదు. అలా అతను నాలుగురోజులు మూసినకళ్ళు తెరవకుండా ఒంటిమీద తెలివిలేకుండా పడివుంటే తల్లికి ఇదే సమయం అని తలిచి వాళ్ళదగ్గర కొంతడబ్బు తీసుకుని కూతుర్ని వాళ్ళతో హోటల్ కి పంపింది. ఊర్మిళ గుండెలు పగిలేలా ఏడ్చినా ఆమె వినలేదు. తనకథ అంతా నాకు చెప్పి నన్ను ఈ రూమ్‌లోకి పంపించారు అనిజెప్పి ఏడ్చింది

నేను ఆమెకు ధైర్యం చెప్పాను.

ఆమె నన్ను సహాయం కోరింది. నన్ను ఈ నరకంలో నుండి తప్పించమని ఇక తను ఆ యింట్లో వుండలేకపోతున్నాను అని బ్రతిమాలుకుంది. నన్ను ఆ ఇంట్లోంచి తప్పించేస్తే మీకు ఎంతో పుణ్యం ఉంటుంది అని కన్నీరు పెట్టుకుంది. ఆ ఇంట్లోంచి తప్పించేస్తే ఏదయినా ఉద్యోగం అయినా చేసుకుంటాను. లేదా ఎవరింట్లో నయినా పనిమనిషిగా వుంటాను. నన్ను ఈ ఇంట్లోంచి తప్పించమని ప్రాధేయ



పడింది. కూతుళ్ళులేని నాకు ఆ అమ్మాయి అంటే సదభిప్రాయం ఏర్పడింది. ఈ అమ్మాయికి అందంవుంది, చదువుంది, బుద్ధిమంతురాలు, ఆమె నిప్పులో సమానం అని గ్రహించాను. కులం కళాకారులు అయితేనే అమ్మాయి రత్నంలాంటిది. ఆ అమ్మాయికి నాకు చేతనయిన సాయం చేయాలని నిశ్చయించుకున్నాను. ఒక పాతిక వేలు నావి కావు అనుకుంటే ఆ ఇంటినుండి అమ్మాయిని తీసుకువచ్చేయగలను. అన్న నమ్మకం ఏర్పడి ఆ అమ్మాయికి ధైర్యం చెప్పి ఆమెను ఆ హోటల్ గదిలో వుంచి ఆమెను అక్కడికి తీసుకువచ్చిన వాడితో ఇంటికి తీసుకెళ్ళమని వాడికి కొంత డబ్బుయిస్తే అప్పుడు నన్ను ఊర్మిళ వాళ్ళ ఇంటికి తీసుకెళ్ళాడు.

నేను వాళ్ళతో మాట్లాడగానే వాళ్ళు మొదట ఒప్పుకోలేదు. పాతిక వేలు అంటే మెత్తబడి అయిష్టంగా ఒప్పుకున్నారు. పాతిక వేలు వాళ్ళకి ఇచ్చి మీరు ఇక అమ్మాయి జోలికి రావద్దు ఆమెకు మీకు ఎలాటి సంబంధంలేదని ఆమె తల్లిచేత కాగితం రాయించుకొని బయలుదేరి వచ్చేస్తుంటే ఆమె తండ్రి గురించి గుర్తువచ్చి అతడిగురించి అడిగితే నన్ను అతని గదిలోకి తీసుకెళ్ళారు. జ్వరంతో పడి వున్నాడు. నేను చెప్పవలసింది చెప్పి అమ్మాయికి ఇక ఏం

ఫర్వాలేదని ధైర్యం చెప్పాను. అతను నాకు మౌనంగా చేతులు జోడించి నమస్కరించాడు

నేను హోటల్‌కి వచ్చేసి ఆమెని తీసుకుని ఇంటికి వచ్చేశాను. ఆమె మన ఇంట్లో వుండడానికి మొదట సందేహించింది. నా బలవంతం మీదే వుంది. ఈ ఇంట్లో ఆమెకు భయం పోగొట్టి చనువుగా తిరిగేలా చేశాను. నా స్నేహితుడి కూతురు అని అందరికీ చెప్పాను. ఆమె కోరుకున్న గౌరవ మర్యాదలు ఆమెకు దక్కేలా చేయాలని నా ఉద్దేశం. ఎంత డబ్బు ఖర్చు అయినాసరే మంచి సంబంధం చూసి చెయాలని అనుకున్నానే గాని నీకు ఇచ్చి చేయాలని ఎప్పుడూ అనుకోలేదు. ఆమెకు కుదిరిన సంబంధం తప్పిపోవటం నువ్వు ఆమెను పెళ్ళిచేసుకుంటానని పట్టుపట్టటం నాకు మతిపోయింది

ఆ అమ్మాయి అంటే మంచి అభిప్రాయం వుంది. నిప్పులాంటి అమ్మాయి అని తెలుసు. నాకు కోడలు అయితే ఈ ఇల్లు బాగుపడుతుంది అని తెలుసు కాని ఈ విషయం నీకు జీవితంలో ఎప్పుడయినా తెలిస్తే మీ జీవితాలు ఎలా మలుపు తిరుగుతాయో నాకు తెలుసు. అందుకే వద్దన్నాను. మగవాడికి భార్యని అనుమానించటం తెలుసు. నిజానిజాలు తెలుసుకోవాలన్న జ్ఞానం వుండదు.



పెళ్ళికి ముందు నీకు చెప్పాను, ఆమె మనసు ఎప్పుడూ కష్టపెట్టకు కంటతడి పెట్టనివ్వకు అలా అయితేనే ఈ పెళ్ళి చేస్తానని చెప్పాను. నువ్వు అన్నిటికీ తలవూపావు. ఊర్మిళకు కూడా పెళ్ళికిముందు చెప్పాను. ఈ నిజాన్ని వాడికి ఎప్పుడూ చెప్పకు. నువ్వు నా స్నేహితుడి కూతురువి అని చెప్పాను, నువ్వూ, అలాగే చెప్పు అని ఆమె సరే అంది.

మీ పెళ్ళి జరిగిపోయింది. పెళ్ళి చేసుకున్నాక నువ్వు ఇలా చేస్తావా! నువ్వు కట్టుకున్న భార్యని, కన్న తండ్రిని నమ్మకపోతే నువ్వు ఇంకెవర్ని నమ్ముతావు? ఎవరో ఒకర్ని నమ్మకపోతే నువ్వు ఎలా జీవిస్తావు? నిందలు వెయ్యటం ఒక గొప్ప అనుకుంటున్నావేమో! నీ భార్యనే నిందించావు అంటే అది నువ్వు సిగ్గుపడవలసిన విషయం.

వేశ్యకులంలో పుట్టిన స్త్రీకి, అయినింటి కుటుంబంలో పుట్టిన స్త్రీకి వాళ్ళ గుణం నీకు ఏమిటి తెలుసు అని చెపుతున్నావు.

జీవితానుభవంలో నాకంటే నువ్వు ఎక్కువా! నీ వయసు ఎంత!" అంటూ ఆయన నవ్వారు.

ఉదయ్‌కృష్ణ మాట్లాడలేదు. అతని తల గిర్రున తిరిగిపోయింది.

తండ్రి చెప్పింది అంతా నిజమా అని!

"వేశ్యకులంలో పుట్టినవాళ్ళు పెళ్ళిచేసుకుని పరాయి కంటి వాడికి కనిపించకుండా భర్తతో పిల్లలతో సుఖంగా జీవితం సాగించేవాళ్ళు వున్నారు.

అయినింటి కుటుంబంలో పుట్టిన అమ్మాయిల గుణాలు బహు మంచివనా నీ ఉద్దేశం! పెళ్ళికాకుండానే ఒకడితో లేచిపోయి తల్లిదండ్రులు వెతికి తీసుకువస్తే ఇంటికి వచ్చేసి తల్లిదండ్రులు చెప్పిన అతన్ని పెళ్ళి చేసుకుని పాత జీవితాన్ని మరిచి కొత్త జీవితాన్ని ప్రారంభించేవాళ్ళు వున్నారు.

పెద్దింటి స్త్రీలు ఉన్నతోద్యోగులు భార్యలు, భర్తలు అటు వెళ్ళగానే ఇటు తనకి నచ్చినవాడితో పరిచయం పెంచుకుని కులికే మహాకిలాడి స్త్రీలు వున్నారు.

మంచి అయినా, చెడు అయినా, స్త్రీకి అయినా, పురుషుడికి అయినా పుట్టుకతో రావాలి మంచిబుద్ధులు.

వాళ్ళ వ్యక్తిత్వాన్ని బట్టి బుద్ధులు మారుతుంటాయి. అంతేగాని కులాలబట్టి బుద్ధులురావు.

ఉదయ్ ఈ ప్రపంచమే ఒక రంగుల మహా వల. ప్రేమ, ఆకర్షణ, బంధం, అనుబంధాలు, సిరిసంపదలు ఇవి కావాలి అని కోరుకునేవారు అంతా ఆ వలలో చిక్కుకుని



గింజుకుంటారు. ఆ వలలో పడకుండా తప్పించుకోవటమే మన గొప్పతనం.

నీవు ఏం చేశావు! ఇన్నాళ్ళు పెళ్ళివద్దు అన్నావు. ఊర్మిళని చేసుకున్నావు. ఈ ప్రపంచం అంతా వింత శోభలతో కళకళ లాడిపోయినట్టు కలలుగన్నావు. ఆ కలలే ఒక రంగులవల. ప్రతి వ్యక్తి జీవితం ఒక బంగారు కోవెల కావాలే గాని రంగులవల ఎప్పటికీ కాకూడదు. ఈ నిజం నువ్వు గ్రహిస్తే మంచిది.

నేను ఎంత వెధవని అయినా నాకు సంబంధంవున్న స్త్రీని తీసుకువచ్చి నీకు పెళ్ళిచేస్తానా! ఆలోచించు. నా మేనల్లుడివో ఎవరివో అయితే వేరే సంగతి. నా కన్నకొడుక్కి వ్యభిచారిణి వృత్తిలోవున్న స్త్రీతో పెళ్ళి జరిపిస్తానా! ఆలోచించు" అన్నారు ఆయన.

ఇక వినలేనట్టు బాధగా తల ఇటూ అటూ తిప్పాడు.

"బాబూ ఉదయ్! నీకు ఇంకా ఆ అమ్మాయిమీద అనుమానం పోలేదా! నేను ఇంకెలా చెపితే నువ్వు నమ్ముతావు! ఊర్మిళ అమాయకురాలు. ఆ అమ్మాయి ఎక్కడవుందో చెప్పు, నేను వెళ్ళి తీసుకువస్తాను." అన్నారు ఆయన బాధగా.

"నాన్నగారూ!" పశ్చాత్తాపంతో గొంతుక జీరబోయింది.

గుండెల్లో బాధ సుడులు తిరుగుతుంది.

"ఉదయ్, నీకు ఇంకా అనుమానం పోలేదా! నిండు నెలలతో వున్న ఆ అమ్మాయి అక్కడ ఎంత కుమిలిపోయి ఏడుస్తుందో నీకు ఏమైనా కనికరం వుందా! నిన్ను నమ్ముకుంది. నిన్నే దైవంగా భావించిందే అలాటి అమాయకురాలిని అనుమానించి, అవమానించి, అన్యాయంచేసి బయటకు గెంటేస్తావా! నీకు మనసు ఎలా ఒప్పిందిరా! ఆమెను ఆ స్థితిలో బయటకు గెంటేయడానికి" అన్నారు ఆయన కొడుకుని అసహ్యించుకుంటూ బాధగా కళ్ళు మూసుకున్నాడు.

తను ఎంత మూర్ఖుడు! తన అర్ధాంగిని తను నమ్మాడు కాదు.

తండ్రి మాటలు నిజం. పుట్టిన వంశాన్ని బట్టి రావు బుద్ధులు.

మట్టిలో మాణిక్యాలు, రాళ్ళలో రత్నాలు వుంటాయన్న మాట అక్షరాలా నిజం.

ఊర్మిళా! నన్ను క్షమించు.

నిజం తెలుసుకోకుండా నిన్ను నిందించాను.



ఏ భర్తా ఏభార్యకు చెయ్యని అన్యాయం నీకు చేశాను. అంటూ తనలోతను కుమిలిపోయాడు.

"ఉదయ్, నీకు ఇంకా జాలి కలగలేదా! ఇంత చెప్పినా నీ బుర్రకి ఎక్కలేదా."

"నాన్నగారూ! నన్ను క్షమించండి" అన్నాడు బాధగా.

ఉదయ్ ఆయన ఆనందంగా చూశారు.

"నీవు నిజంగా అంటున్నావా! అయితే అమ్మాయి ఎక్కడ వుందో చెప్పు! వెళ్ళి ఇంటికి తీసుకొచ్చేద్దాం" అన్నారు ఆయన సంతోషంగా.

"మీరు వుండండి. నేను వెళ్ళి తీసుకొస్తాను" అన్నాడు.

అందుకు ఆయన ఒప్పుకోలేదు. కొడుకు వెంట ఆయన కూడా బయలుదేరారు.

ఇద్దరూ కారులో వెళ్ళారు.

## 35

మృత్యుంజయరావుగారు, ఉదయ్‌కృష్ణ ఇద్దరూ కారు దిగి ఇంటివైపు వెళ్ళారు.

ఆ ఇంటికి తాళంవేసి వుంది.

ఆ తాళం చూడగానే ఉదయ్‌కృష్ణ తల గిర్రున తిరిగిపోయింది.

ఇంటికి తాళంవేసి వుందేమిటి?

ఊర్మిళ ఎక్కడకు వెళ్ళింది?

వంటమనిషి రంగమ్మకూడా వెళ్ళిందా!

అతని మనసు ఏదో కీడు శంకిస్తున్నట్టుగా వుంది.

ఎన్నిసార్లు కబురు చేసినా రాలేదని ఆమె బాధ పడిందా!

ఇక ఈ ఇంట్లో వుండలేక వెళ్ళిపోయిందా!

ఎక్కడికి వెళుతుంది? ఎవరు వున్నారని వెళుతుంది? ఇప్పుడు ఏం చెయ్యాలి? ఎవర్ని అడగాలి?

ఎక్కడికి వెళ్ళిందో ఎవరు చెప్తారు?

ఉదయ్‌కృష్ణకి మతిపోయింది. అప్రయత్నంగా తల తిప్పి తండ్రి వైపు చూశాడు.

ఆయనకూడా ప్రశ్నార్థకంగా కొడుకువైపు చూశారు అమ్మాయి ఏది అన్నట్టు.

పక్కింటివాళ్ళని అడుగుదామంటే వాళ్ళింటికి తాళం వేసి ఉంది.



వాళ్ళు వచ్చిందాకా అక్కడే నిలబడ్డారు.

వాళ్ళు ఎంతసేపటికీ రాలేదు.

ఒకగంట అక్కడే నిలబడితే ఇంటిగల అతని చెల్లెలు వచ్చింది.

ఆ అమ్మాయి అన్నగారి దగ్గర వుండి పరీక్ష కట్టటానికి వచ్చింది. ఆ అమ్మాయి మళ్ళీ వాళ్ళవూరు వెళ్ళిపోతుంది.

ఆమె రావటంతో ఉదయ్‌కృష్ణ అడిగాడు.

"ఊర్మిళ ఎక్కడికెళ్ళిందో మీకు తెలుసా!"

"ఆవిడ్ని రాత్రి హాస్పిటల్లో జాయిన్ చేశారు. ఇప్పటికి ఇంకా డెలివరీ కాలేదు. మా వదినా, మా అన్నయ్యా ఇద్దరూ అక్కడే వున్నారు" అని చెప్పింది.

"ఏ హాస్పిటల్లో జాయిన్ చేశారు" అడిగాడు.

ఆమె చెప్పింది.

తండ్రీకొడుకులు ఇద్దరూ కారులో వెంటనే హాస్పిటల్‌కి వెళ్ళారు. అక్కడ ఇంటిగల అతను కనిపించాడు. ఉదయ్‌కృష్ణని చూస్తూనే ఎదురొచ్చి ఊర్మిళ పరిస్థితి ఏమీ బాగోలేదని చెప్పాడు.

ఈవేళ ఉదయంనుంచి మీకు ఎన్నిసార్లు ఫోన్ చేశానో మీరు ఇంటిదగ్గర లేరు. ఇందాక చేస్తే మళ్ళీ చేయమన్నారు. ఇంటికి కబురు చేద్దామంటే ఎవరూ లేరు. ఏ సమయంలో ఏ అవసరం వుంటుందోనని నేను ఇక్కడే వున్నాను అని చెప్పాడు.

ఊర్మిళ పరిస్థితి ఏమీ బాగోలేదు. చాలా నీరసంగా వుండటంతో ప్రసవించలేక చాలా బాధపడిపోతుంది. అని తెలిసి మృత్యుంజయరావుగారు అక్కడ బెంచీమీద కూర్చుండిపోయారు.

ఆయన మనసు ఏమీ బాగోలేదు.

ఉదయ్‌కృష్ణ మతిలేనట్టు అలా నిలబడిపోయాడు.

టైము గడుస్తుంది.

ఏ టైముకి ఏ కబురు వింటామోనని తండ్రీకొడుకులు అలా ఉండిపోయారు.

ఊర్మిళకు ఏమైనా అయితే యింకేమైనా ఉందా! తను బ్రతగ్గలడా! అతని మనసు పరిపరి విధాలపోతుంది.

తెల్లవారుజామున నాలుగుగంటలకు ఊర్మిళకు కొడుకుపుట్టాడని నర్స్ వచ్చి చెప్పటంతో తండ్రీకొడుకులు ఇద్దరూ సంతోషంతో పొంగిపోయారు.



తెల్లవారి ఆరుగంటలకు ముందు మృత్యుంజయరావుగారు వెళ్ళిచూశారు.

మామగార్ని చూస్తూనే అంత నీరసంలోనూ ఆశ్చర్యంగా చూసింది.

మీరు వూర్నుండి వచ్చేరా! అన్నట్టు ఉన్నాయి ఆ చూపులు.

ఆమెకు చెప్పారు తను వూరునుండి ఎప్పుడొచ్చింది.

పక్కనేవున్న ఉయ్యాలతొట్టిలో పడుకునున్న మనవడ్ని చూసి మురిసిపోయారు.

ఊర్మిళ కళ్ళనీళ్ళతో మామగారివేపు చూసింది. భర్త బాబుని చూడటానికి రాలేదన్న బాధ ఒకటి మామగారికి జరిగిన సంగతులు అన్నీ తెలుసా! అని.

కోడలిబాధ గ్రహించుకున్నట్టు ఆమె తలపై చేయి వేసి "అబ్బాయి వచ్చాడు అవతల ఉన్నాడు. నేను జరిగిందంతా వాడికి చెప్పి నీ తప్పేం లేదని చెప్పాను. జరిగిన దానికి వాడు పశ్చాత్తాప పడుతున్నాడు" అంటూ మెల్లగా కోడలికి అన్నీ చెప్పారు.

మావగారి మాటలతో ధైర్యం వచ్చినట్టుగా అయి కృతజ్ఞతగా చూసింది ఆయనవైపు.

హాస్పటల్లోకి మళ్ళీ సాయంత్రం వస్తానని చెప్పి ఆయన వెళ్ళి కొడుకుని పంపించారు.

ఉదయ్‌కృష్ణ ఆ గదిలోకి అడుగుపెట్టాడు.

మంచందగ్గర నిలబడిన భర్తవైపు చూసింది.

అతనలా రెప్పవాల్చకుండా చూశాడు.

ఆమె చూపులు నిర్మలంగా అమాయకంగా ఉన్నాయి

అతను చూపులతో చూపులు కలపలేక తప్పు చేసిన వాడిలా తలొంచుకున్నాడు.

"మీరు వచ్చారా!" అంది ఆమె కంఠస్వరం నీరసంగా పలికినా సంతోషం తొంగిచూస్తుంది ఆ కంఠస్వరంలో.

"ఏవండి మాట్లాడరేమిటి! నామీద ఇంకా కోపమా!" అంటూ జాలిగా అడిగింది.

"ఊర్మిళా!" అంటూ దగ్గర కూర్చుని భరించరాని బాధతో ఆమె జుత్తులోనికి వేళ్ళుపోనిచ్చి మూగగా రోధించాడు.



"నన్ను క్షమించు ఊర్మిళా, నీ గురించి నిజనిజాలు తెల్సుకోకుండా అనుమానించి అవమానించి యింటినుంచి గెంటేశాను. నన్ను క్షమించు" అన్నాడు అతని కంఠస్వరం భారంగా పలికింది.

ఊర్మిళ అతని చేయి అందుకుని మౌనంగా వుండిపోయింది.

"బాబును చూశారా! అచ్చు మీలాగే వున్నాడు" అంటున్న ఆమె కళ్ళు సంతోషంతో గర్వంగా మెరిశాయి.

ఉదయ్‌కృష్ణ భార్య మాటల్తో తలతిప్పి చూశాడు.

ఉయ్యాలలో బాబు పడుకుని నిద్రపోతున్నాడు.

లేచి దగ్గరగా వెళ్ళాడు. బంగారు ఛాయతో నల్లటి ఉంగరాలజుత్తుతో బొద్దుగా ముద్దుగా అందంగా వున్నాడు.

అరిచేతులు అరికాళ్ళు కుంకుమ అద్దినట్టు ఎర్రగా ఉన్నాయి.

తన ప్రతిరూపం. తన రక్తాన్ని పంచుకు పుట్టిన బిడ్డ.

అతని అంతరంగమంతా సంతోషంతో నిండిపోయింది.

మెల్లగా బాబు బుగ్గ నిమిరాడు.

పైనుండి క్రిందపడినట్టు బాబు ఒక్కసారి ఉలిక్కి పడ్డాడు.

క్రింద పడిపోలేదు ఉయ్యాల్లోనే ఉన్నాను అన్నట్టు మళ్ళీ నిద్రపోయాడు.

## 36

హాస్పిటల్‌నుండి ఊర్మిళ యింటికి వచ్చేసింది.

ఇప్పుడు మళ్ళీ యిల్లంతా కళకళలాడిపోతుంది.

మేడమీద గదిలో బాబుకి ఉయ్యాల, ఉయ్యాల చుట్టూ దోమతెర కట్టివుంది.

బాబుకి ఇప్పుడు నెల వెళ్ళింది.

ఉదయ్‌కృష్ణ మంచంమీద కూర్చుని భార్యవైపే పరీక్షగా చూస్తున్నాడు.

ఆమెలో మునుపటి కళ అందం వచ్చేశాయి. ముఖం సంతోషంతో వెలిగిపోతుంది.



బాబుకి పాలుపట్టించి సీసాపక్కన పెట్టి ఇటు తిరిగింది.

అతని ముఖం ఎన్నడూ చూడని ఆనందంతో గర్వంతో వెలిగిపోతుంది.

“ఊర్మిళా” అతని కంఠస్వరం మృదువుగా లాలనగా పలికింది.

అతని పిలుపుకి ఆమె నిండుగా నవ్వింది.

ఆ నవ్వు వెన్నెల విరిసినంత అందంగా ఉంది అతని కళ్ళకి.

భర్త దగ్గరగా నడిచి అతని జుత్తులోకి వేళ్ళు పోనిచ్చింది.

రెండు చేతులు ఆమె నడుంచుట్టూ వేసి దగ్గరకు లాక్కున్నాడు.

“మనకి బాబు పుట్టాడు నీ పంతమే నెగ్గింది.

ఆమె నవ్వింది. “ఈసారి తప్పక మీరే గెలుస్తారు.”

“ఒక్కసారి కాదు రెండుసార్లు వరసగా నేనే గెలవాలి” అన్నాడు నవ్వుతూ.

ఆమె చెంపలు సిగ్గుతో ఎర్రబడ్డాయి.

“ఊర్మిళా!” ప్రేమానురాగాలతో పిలిచాడు.

అతని పిలుపు ఆమెకు ఎంతో మధురాతి మధురంగా వినిపించింది.

అప్రయత్నంగా భర్త తలని గుండెలకు దగ్గరగా లాక్కుంది.

ప్రపంచమంతా ఆమెకు వింతసోయగాలతో చెప్పలేని అద్భుతంగా అనిపించ సాగింది.

తన్మయత్వంతో కళ్ళుమూసుకుంది క్షణంసేపు.

LAVANYA RENTED BOOK STALL;
PARK ROAD;
PROP:
M. Venkateswarlu;
NANDYAL.

**
***

## ERRA KALUVALI

—BY R. SANDH

నరకకూపంలో పడబోతున్న ఊర్మిళను మృత్యుంజయరావుగారు. ఆమెకు మంచి చూసి వివాహం చేసి ఆమె జీవితాన్ని అనుకున్నారు ఆయన.

కాని మృత్యుంజయరావుగారి కుమారుడు ఊ. ఊర్మిళను తప్ప ఇంకొకరిని పెళ్ళాడనన్నాడు.

మృత్యుంజయరావుగారు ఊర్మిళ గతం ఉదయ్‌కిచ్చి వివాహం చేశారు. వారి సంసా దంగా సాగిపోతున్న తరుణంలో ఉదయ్ విషయం తెలిసింది.

శ్రీరామచంద్రుడిలా నిండు గర్భవతి ఊర్మిళ నుండి గెంటి వేశాడు. ఛిన్నాభిన్నమైన వా నౌక తిరిగి తీరం చేరేనా?

విశిష్టమైన ఇతివృత్తానికి
ఆర్. సంధ్యాదేవి విలక్షణ కథనం

తప్పక చదవండి

Sree Vamsee Krishna Publicat
VIJAYAWADA-
Gandhinagar Phone : 74331 520